www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 శుక్రవారం

# వెలుతురు

రంగారెడ్డి। 9, ఫిబ్రవరి 2024 తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 261, పేజీలు: 12, వెల: రూ.5/-

వెలుతురు TV NEWS

## మోడీ బిసి కాదు..ఓసికి చెందిన వ్యక్తి

- అందుకే కులగణను వ్యతిరేకిస్తున్నారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణ
- తిప్పికొట్టిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 8(వెలుతురు):** ప్రధాని మోదీ ఓబిసికి చెందిన వ్యక్తి కాదని మోడీని ఉద్దేశించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆయితే రాహుల్ చేసిన వ్యాఖ్యలను కేంద్రప్రభుత్వం తోసిపుచ్చింది. 'రాహుల్ ప్రకటనపై వాస్తవాలు' అంటూ మోదీ జన్మించిన కులం గురించి స్పష్టత ఇచ్చింది. ప్రధాని మోదీ ఘాంచీ కులానికి చెందిన కుటుంబంలో జన్మించారని, 2000 సంవత్సరంలో గుజరాత్‌లో అధికారంలో ఉన్న భాజపా ఆ కులాన్ని ఓబీసీ విభాగంలో చేర్చిందని వివరించారు. గుజరాత్‌లో ఒక సర్వే అనంతరం మండల్ కమిషన్ కింద ఓబీసీ జాబితాను తయారుచేసింది. అందులో ఘాంచీ కులం పేరు కూడా ఉంది. దీనిని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు జులై 25, 1994లో నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పుడు మోదీ స్వరాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఆ తర్వాత ఏప్రిల్ 4, 2000లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా దానిని ఓబీసీ జాబితాలోకి చేర్చారు. ఈ రెండు ప్రకటనలు ఇచ్చిన సమయంలో మోదీ అధికారంలో లేరు' అని కేంద్రం వెల్లడించింది.ఎన్నికల సమయంలో మాత్రమే మోదీకి తాను ఓబీసీననే విషయం గుర్తుకువస్తుందని కొద్దిరోజుల క్రితం రాహుల్ విమర్శించిన సంగతి తెలిసిందే. మిగతా.. 2లో


## నియామకాలకు తొలగిన అడ్డంకులు..

- గురుకులాల ఉద్యోగ ఫలితాల వెల్లడి
- త్వరలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పూర్తి..
- గ్రూప్-4 ఫలితాల వెల్లడికి కసరత్తు
- గ్రూప్-1 పరీక్ష రద్దు.. తిరిగి ఉత్తర్వు!..
- పాతవారు దరఖాస్తు చేయనక్కర్లేదు
- కొత్త వారికి అవకాశం కల్పించడమే!..
- సమాంతరంగా మహిళా రిజర్వేషన్లు
- ఈ ఏడాదంతా నియామకాల జాతరే..
- 2లక్షల ఉద్యోగాల భర్తీకి సర్కారు రెడీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (వెలుతురు):** వివిధ ఉద్యోగ నియామకాలకు ఎదురవుతున్న ప్రధాన అడ్డంకులు తొలగిపోవడంతో వాటి భర్తీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తాజాగా గురుకులాల్లో 9,210 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన పరీక్షల ఫలితాలను ప్రకటించిన ప్రభుత్వం.. సుమారు 15 వేల పోలీసు ఉద్యోగాలకు సంబంధించి వారం రోజుల్లో నియామక పత్రాలను అందించాలని నిర్ణయించింది. అలాగే.. గ్రూప్-4 పరీక్షల ఫలితాలు వెల్లడించాలని, గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ జారీ చేయాలని, ఇతర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇప్పటి వరకు కొన్ని సాంకేతిక సమస్యలు అడ్డంకిగా ఉన్నాయి. పోస్టుల భర్తీలో మహిళా రిజర్వేషన్ అమలు విషయంలో సంక్లిష్టత ఉండేది. ఈ రిజర్వేషన్ వర్టికల్‌గానా, లేక సమాంతరంగానా అనే అంశంపై సందిగ్ధం ఉంది. తాజాగా రాజ స్థాన్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రిజర్వేషన్లను సమాంతరంగా అమలుపరచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి సర్క్యులర్ జారీచేశారు. మిగతా.. 2లో

## ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బిజెపి కార్యాచరణ

- కాంగ్రెస్‌కు బిజెపి మాత్రమే పోటీ
- బిఆర్ఎస్ పని అయిపోయినట్లే
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణలో భవిష్యత్తు లేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సమగ్ర కార్యాచరణ కోసం పార్టీ పెద్దలను కలిసినట్టు ఆయన చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో తెలంగాణ బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశం జరగనుందని చెప్పారు. తెలంగాణలో పార్ల మెంట్ ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా ఉంటాయని ఆశా భావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నాయని, బీజేపీని గెలవనివ్వకూడ దనే ఉద్దేశంతో రెండు పార్టీలు కుమ్మక్కు అవుతున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీలు డూప్ ఫైటింగ్ చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటేసిన బీఆర్ఎస్‌కు ఓటేసిన ఒక్కటే. కాంగ్రెస్‌కు బీజేపీనే ప్రధాన ప్రతిపక్ష పార్టీ. బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీలో ఉండదు. బీఆర్ఎస్ అరకొర సీటు గెలిచిన, ఓడినా తెలంగాణకు ఒరిగేది ఏం లేదు. బీఆర్ఎస్ కుటుంబం కోసం పని చేసే పార్టీ. కుటుంబ అవశ్యకత పూర్తి అయిపోయింది. హైదరాబాద్‌లోని అసదుద్దీన్ ఓవైసీ సీటుతో పాటు తెలంగాణలో అన్ని సీట్లు గెలుస్తాం. హైదరాబాద్ ఎంపీ సీటులో అసదుద్దీన్‌ను ఓడిస్తాం. అందుకు గట్టి ప్రణాళికలు రచిస్తున్నాము. తెలంగాణ లోక్‌సభ ఎన్నికలపై వస్తున్న సర్వేల్లో వాస్తవం లేదు. తెలంగాణలో మెజార్టీ సీట్లు గెలిచేలా కార్యాచరణ చేస్తున్నాము. ఓల్డ్ సిటీలో బీజేపీకి ఓట్ల శాతం పెరిగింది. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు డూప్ టింగ్ చేస్తున్నాయి. వంద రోజుల్లో హామీలు అమలు, అవినీతి పరులపై చర్యలు అన్నారు. కానీ ఇంకా మీన మేశాలు లెక్క పెడుతున్నారు. మిగతా.. 2లో



## తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు

- ప్రజాభవన్ కంచె తొలగింపుతో ప్రజలకు స్వేచ్ఛ
- ఇచ్చిన హామీ మేరకు 2లక్షల ఉద్యోగాల భర్తీ
- మూసీ అభివృద్ధి,రంగారెడ్డి పాలమూరు పూర్తి చేస్తాం
- ఆరుగ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం
- ఆర్థికంగా చిన్నాభిన్నం అయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పని
- ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాడారని.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాభవన్ ముందున్న ఇనుప కంచెను తొలగించడం ద్వారా ప్రజలకు స్వేచ్ఛ కలిగించామని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. ప్రజల కోసం ఏర్పడ్డ ప్రభుత్వం ఇదని అన్నారు.టీఎస్‌పీఎస్సీ ద్వారా 2 లక్షల ఉద్యోగాల భర్తీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. పెద్దఎత్తున మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపడతామని.. ఆ నది మరోసారి మిగతా.. 2లో

### ఉభయసభలు నేటికి వాయిదా

- కాళోజీ కవితతో చెంపదెబ్బ
- నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ
- తొలిరోజు సభకు కెసిఆర్ డుమ్మా



**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (వెలుతురు):** ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగంలో కాళోజీ కవితను ప్రస్తావించిన అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు కవితతో గవర్నర్ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు. అయితే ఆ కవితలో గత ప్రభుత్వం తీరును ఎండగడుతూ గవర్నర్ వ్యాఖ్యలు చేశారు.
' అధికారమున్నదని హద్దు పద్దు లేక.
అన్యాయమార్గాల నార్జింపబూనిన .
అచ్చి వచ్చే రోజులంతమైనాయి .
అచ్చి వచ్చే రోజులంతమైనాయి!' అంటూ గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించారు.గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి గవర్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. కాగా... గణతంత్ర మిగతా.. 2లో





## ఉచిత విద్యుత్ పథకంపై సీఎం కసరత్తు

- హామీలు నెరవేర్చే దిశగా అడుగులు
- అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు ప్రణాళిక
- రేషన్ కార్డు, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్ అనుసంధానం!

**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** మాటతప్పం..మడమ తిప్పం అనే విధంగా పాలనలో దూసుకెళ్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకునే పనిలో పడింది కాంగ్రెస్ సర్కార్. ఉచిత విద్యుత్ సరఫరా కోసం కసరత్తు చేస్తోంది. తొలిదశలో రేషన్ కార్డు, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్ అనుసంధానమై ఉన్న కరెంట్ కనెక్షన్ల ఇళ్లకు.. గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని భావిస్తోందట. అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు మిగతా.. 2లో

## హామీల అమలుపై ప్రస్తావన ఏదీ..?

- స్పష్టత లేకుండా గవర్నర్ ప్రసంగం
- పంటలకు బోనస్,రుణమాఫీపై దాటవేత
- మీడియా పాయింట్ వద్ద హరీష్ రావు



**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** హామీల అమలుకోసం ఎదురు చూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం నిరాశ మిగిల్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎన్నికల హామీల అమలుపై స్పష్టత లేదని విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై విశ్వాసం కల్పించలేకపోయిందన్నారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఎప్పటి నుంచి ఇస్తారో గవర్నర్ ప్రసంగంలో చెప్పలేదన్నారు. రైతులకు బోనస్ ఇచ్చే విషయమై ఒక్క మాటా మిగతా.. 2లో

## తెలంగాణలో కాంగ్రెస్.. ఎపిలో టిడిపి

- పార్లమెంట్ ఎన్నికల్లో వీరిదే అధిక్యం
- ఇండియాటుడే సర్వే వెల్లడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు):** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎపిలో టిడిపి, తెలంగాణలో కాంగ్రెస్ బలం చాటుకుంటా యని సర్వేలు చెబుతున్నాయి. అలాగే బిఆర్ఎస్ కూడా దెబ్బతింటుందని పేర్కొంటున్నారు. వైకాపాకు గట్టి షాక్ తగలబోతోందని సర్వేలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ స్థానాల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తెలుగుదేశం పార్టీ 17 లోక్‌సభ స్థానాలు గెలుచుకోబోతోంది. వైకాపా 8 స్థానాలకు పరిమితం కానుంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరిట ఇండియాటుడే సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన సర్వే ఫలితాలను గురువారం వెల్లడించింది. 2023 డిసెంబర్ 15 నుంచి మిగతా.. 2లో

## హైదరాబాద్‌లో ఎన్ఐఎ సోదాలు

- వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ ఇంట్లో తనిఖీలు
- ఫోన్ తదితర వస్తువుల స్వాధీనం

**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సోదాలు చేపట్టారు. హిమాయత్ నగర్ లోని వరవరరావు అల్లుడు, సీనియర్ జర్నలిస్ట్ 'వీక్షణం' పత్రిక ఎడిటర్‌గా ఉన్న ఎన్.వేణుగోపాల్ పాటు ఎల్బీనగర్ లోని రవిశర్మ, అనురాధ దంపతుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. వేణు ఇంట్లో దాదాపు 5 గంటల పాటు తనిఖీలు చేశారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో మిగతా.. 2లో

## ప్రతిపక్షనేతకు ఇచ్చే గౌరవం ఇదేనా..?

- ఇంత చిన్న గది ఎలా కేటాయిస్తారు
- స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి వేముల

**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** అసెంబ్లీలో ఎల్‌వోపీ కార్యాలయం మార్పుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌కు చిన్న ఛాంబర్ ఇవ్వడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ అంశంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈరోజు బీఆర్ఎస్ పార్టీకి చెందిన 39 ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి స్పీకర్‌ను కలిశామని.. అసెంబ్లీలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌కు చిన్న ఛాంబర్ ఇవ్వడం అవమానించడమే అని అన్నారు. స్పీకర్ కావాలని అడగడంతో ఎల్‌వోపీ ఇచ్చాం. స్పీకర్ మీద గౌరవంతో ఇవ్వడం జరిగింది. మా ఎల్‌వోపీకి అంతే పెద్ద ఛాంబర్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ చిన్న గదిని కేటాయించారు అది కరెక్ట్ కాదు. ఇప్పటి వరకు వాడుతున్న ఎల్‌వోపీ రూమ్‌ను మీ సౌకర్యం కోసం ఇవ్వడానికి ఒప్పుకున్నారు కేసీఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఐదుగురు ఉన్నప్పుడు కూడా మేము ఎల్‌వోపీ రూమ్ ఇచ్చాం. పెద్ద ఛాంబర్ కేటాయించాలని స్పీకర్‌ను కోరామని తెలిపారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన దగ్గర ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. సంగారెడ్డిలో చింతా ప్రభాకర్ ఎమ్మెల్యే అనే విషయం మర్చిపోతున్నారన్నారు.

సంగారెడ్డిలో ఓడిపోయిన ఎమ్మెల్యే భార్యకు ప్రోటోకాల్



ఇస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఆర్డీవో కూడా అలానే చేస్తున్నారన్నారు. దీంతో ఆర్డీవోపై పిర్యాదు చేశామని చెప్పారు. ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు పోలీస్ ఎస్కార్ట్ వెహికల్ ఇస్తున్నారన్నారు. దీనిపై డీజీపీ ఆలోచించాలని కోరారు. ప్రభుత్వాలు వస్తాయి పోతాయి, ముఖ్యమంత్రులు, వస్తారు మిగతా.. 2లో



## మన్మోహన్ సేవలు నిరుపమానం

- ఆయన నిబద్ధత ఎంపిలకు ఆదర్శరం
- రాజ్యసభలో ప్రధాని మోడీ వెల్లడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు):** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యుల వీడ్కోలు సందర్భంగా ప్రధాని సభలో ప్రసంగించారు. మోదీ మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ తన ఆరోగ్యం బాలేనప్పుడు కూడా వీల్ చైర్‌లో పనిచేశారని గుర్తు చేశారు. ఒకానొక సమయంలో ఓటింగ్ సందర్భంగా మన్మోహన్ వీల్ చైర్‌లో వచ్చి ఓటు వేశారని ఆ ఘటన వృత్తిపట్ల తనకున్న నిబద్ధతకు తార్కాణంగా నిలిచిందని పేర్కొన్నారు. పదవీ విరమణ చేయనున్న రాజ్యసభ సభ్యులకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఢిల్లీలోని తన నివాసంలో గురువారం వీడ్కోలు ఇవ్వనున్నారు. ఈమేరకు ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో రాజ్యసభ సభ్యులు గ్రూప్ ఫొటోలు దిగారు. రాజ్యసభలో 56 మంది ఎంపీలు త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం వారికి మిగతా.. 2లో

## ప్రతిపక్షనేతకు ఇచ్చే గౌరవం ఇదేనా..?

మొదటిపేజీ తరువాయి..
పోతారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా గెలవని జగ్గారెడ్డి.. మా ఎమ్మెల్యేలనే తీసుకెళ్తారా? అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యేలను తీసుకెళ్లేంత మొగోళ్లు కాంగ్రెస్‌లో లేరు అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి తమకేం అవసరం ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అంతర్యుద్ధం తప్పదని హెచ్చరించారు. అలవిగానీ హామీలు ఇచ్చి తమపై నెపం నెడుతున్నారని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

## మన్మోహన్ సేవలు నిరుపమానం

మొదటిపేజీ తరువాయి..
సభలో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీమాట్లాడుతూ మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన ఎంపీలందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ దేశానికి మన్మోహన్‌జీ చేసిన సేవ అపారం. సుదీర్ఘకాలం పాటు రాజ్యసభకు ఆయన అందించిన సహకారం, దేశాన్ని నడిపించిన తీరు ఎప్పటికీ గుర్తుంటుంది. రాజ్యసభలో ఇటీవల ఓ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ట్రెజరీ బెంచ్ గెలుస్తుందని తెలిసినప్పటికీ ఆయన వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేశారు. ఓ సభ్యుడిగా తన విధుల విషయంలో ఎంత బాధ్యతగా ఉన్నారనడానికి ఇదొక ఉదాహరణ. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఆయన చక్రాల కుర్చీలో ఉన్నా పనిచేశారు. ఎంపీలందరికీ ఆయన ఆదర్శం అని మోదీ ప్రశంసించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' గురించి మోదీ ప్రస్తావించారు. ఆ పత్రం మా ప్రభుత్వానికి దిష్టి చుక్క లాంటిదే. మాపై చెడు చూపు పడకుండా చేస్తుంది. ప్రతిపక్షాల చర్యను మేం స్వాగతిస్తున్నాం అని అన్నారు. తన పదేళ్ల పాలనపై కేంద్రంలోని అధికార భాజపా 'వైట్‌పేపర్'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'బ్లాక్ పేపర్'ను విడుదల చేశారు. నిరుద్యోగం, ధరల కట్టడి, రైతుల సమస్యలను తీర్చడంలో కేంద్రం విఫలమైందని హస్తం పార్టీ ఈ పత్రంలో ఆరోపించింది.

## తెలంగాణలో కాంగ్రెస్.. ఎపిలో టిడిపి

మొదటిపేజీ తరువాయి..
జనవరి 28 వరకు సర్వే నిర్వహించినట్లు తెలిపింది. 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన వైకాపా.. 22 లోక్‌సభ స్థానాలనూ గెలుచుకుంది. తెదేపా 3 స్థానాలకే పరిమితమైంది. ఈసారి ఎన్నికల్లో ఫలితాలు తారుమారు కానున్నాయని ఇండియా టుడే సర్వే అంచనా వేసింది. 45 శాతం ఓటింగ్‌తో తెలుగుదేశం పార్టీ 17 లోక్‌సభ స్థానాలను గెలుచు కోబోతోందని పేర్కొంది. వైకాపా 41 శాతం ఓటింగ్‌తో 8 స్థానాలకు పరిమితం కానుందని తెలిపింది. ఇక తెలంగాణలో అధికార కాంగ్రెస్ ఈసారి 10 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉందని ఇండియా టుడే సర్వే పేర్కొంది. 17 లోక్‌సభ స్థానాలకు గానూ భాజపాకు 3, భారాసకు 3, మజ్లిస్ 1 సీటు గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. గత ఎన్నికల్లో భారాసకు 9, భాజపాకు 4, కాంగ్రెస్‌కు 3, మజ్లిస్ ఒక సీటు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభలోనూ అదే ఒరవడిని కొనసాగిస్తూ ఏడు స్థానాలు పెంచుకోనుందని సర్వే అంచనా వేసింది. భారాసకు భారీగా సీట్లు తగ్గనున్నట్లు తెలిపింది. భాజపా ఒక ఎంపీ సీటు కోల్పోనుందని తెలిపింది.

## హైదరాబాద్‌లో ఎన్ఐఎ సోదాలు

మొదటిపేజీ తరువాయి..
ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రవిశర్మ సెల్ ఫోన్, పాత పుస్తకాలు, పాత కరపత్రాలు సీజ్ చేశారు. ఈ నెల 10న విచారణకు రావాలని ఆదేశించారు. కాగా, ఇటీవల మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు దీపక్‌ను కూకట్‌పల్లిలో పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద దొరికిన సమాచారం ఆధారంగా వేణు నివాసంలో సోదాలు చేసినట్లు సమాచారం. గతంలోనూ వీరి ఇళ్లల్లో ఎన్ఐఏ అధికారులు దాడులు నిర్వహించారు. పత్రికా ప్రకటన ద్వారా పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. మరోవైపు, గురువారం ఉదయం 5 గంటలకు ఎన్ఐఏ అధికారులు తమ ఇంటికి వచ్చారని జర్నలిస్ట్ వేణు తెలిపారు. సెర్చ్ వారెంట్‌తో వచ్చామని వారు చెప్పినట్లు వివరించారు. 2013లో నయీమ్ బెదిరింపుల లేఖ పుస్తకాలు రాశానని.. ఆ పుస్తకాలను తీసుకెళ్లారని చెప్పారు. తన మొబైల్ సీజ్ చేశారని అన్నారు. ఎన్ఐఏ గతంలో అరెస్ట్ చేసిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు దీప్ కు, తనకు సంబంధం ఉందని కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసుపై గత ప్రభుత్వంలోని సీఎంకు లేఖ రాశానని పేర్కొన్నారు. తాను రాసిన ఉత్తరం పత్రికల్లో ప్రచారం అయ్యిందని వెల్లడించారు. దేశంలో ఎన్ఐఏ ఉపా చట్టం ద్వారా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరామని, జనవరి 3న తనపై పెట్టిన కేసును ఎన్ఐఏ టేకప్ చేసుకుందని వివరించారు. ఈ కేసులో తన పేరును ఏ – 22గా చేర్చారని.. తాను ఓ మాస పత్రికను నడుపుతున్నానని చెప్పారు. తాను 'విరసం'లో ప్రస్తుతం లేనని స్పష్టం చేశారు.

## ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బిజెపి కార్యాచరణ

మొదటిపేజీ తరువాయి..
ఇంకా సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయి. కాళేశ్వరంపై ప్రభుత్వానికి చిత్తశుద్ది లేదు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఆడుకోవద్దు. జల వివాదాలపై ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ మభ్య పెడుతున్నాయి. నాగార్జునసాగర్ విషయంలో రెండు ప్రభుత్వాలు కలిసి నిర్ణయం తీసుకోవాలి. రెండు ప్రభుత్వాలు కలిసి చర్చించుకోవాలి. కేసీఆర్‌తో ఏపీ సీఎం జగన్ సమావేశం అయ్యారు. ఏం చేశారు మరి. బీజేపీ తెలంగాణకు న్యాయం జరగాలని కోరుకుంటుంది. మోదీ మళ్లీ ప్రధానమంత్రి కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే వసూళ్లు మొదలు పెట్టింది. కేంద్ర కాంగ్రెస్‌కు సూటు కేసులు మోస్తున్నారు. కర్ణాటకలో దోపిడీ చేసి తెలంగాణలో ఖర్చు పెట్టారు. ఇప్పుడు తెలంగాణలోనూ దోచుకుంటున్నారు. తెలంగాణ నుంచి బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుంది. బీఆర్ఎస్‌లో ఉన్న నేతలు బీజేపీలో చేరాలి. అందుకు నేను పిలుపు ఇస్తున్నానని అన్నారు.

## ఉభయసభలు నేటికి వాయిదా

మొదటిపేజీ తరువాయి..
దినోత్సవం రోజున గవర్నర్ స్పీచ్‌లో గత బీఆర్ఎస్ పాలనపై ఘాటైన విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. మరోవైపు అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డుమ్మా కొట్టారు. శుక్రవారం ధన్యవాద తీర్మానం చేయడానికి ఆయన హాజరయ్యే అవకాశమున్నట్లు సమాచారం. శస్త్ర చికిత్స చేయించుకున్న కారణంగా గత అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరుకాలేదు.గవర్నర్ ప్రసంగం అనంతరం ఉభయసభలు వాయిదా పడ్డాయి. శుక్రవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుంది. శాసనసభ కార్యకలాపాల సలహాకమిటీ బీఏసీ సమావేశమై సభను ఎన్ని రోజులు నడపాలనే దానిపై నిర్ణయం తీసుకుంటుంది.. ఆర్థిక శాఖను నిర్వహించే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఫిబ్రవరి 10న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం బడ్జెపై సాధారణ చర్చ జరగనుంది. సమావేశాలు సుమారు 7–10 రోజుల వరకు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. బడ్జెట్‌కు ఆమోదం తరవాత వాయిదా పడుతుంది. ఇకపోతే ఆనవాయితీ ప్రకారం కాంగ్రెస్ సభ్యులు సిఎం రేవంత్ సహా అంతా కండువాలు కప్పుకుని వచ్చారు. బిఆర్ఎస్ సభ్యులు గులాబీ కండువాలతో వచ్చారు.

## సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్దంగా లేదు

### అసెంబ్లీ సమావేశాలు 12 రోజులైనా నిర్వహించాలి: కడియం

హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు): బడ్జెట్ ఆమోదించుకునే తొందరలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై చర్చించాలన్న శ్రద్ధ లేదని బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ సభలో ఓట్ ఆన్ అకౌంట్ బ్జడెట్ పెడుతున్నట్లు ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. నాలుగు రోజులే సభ నిర్వహిస్తామన్నారు. కనీసం 12 రోజులైనా సభ నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు. అవసరమైతే 13న మరోసారి బీఏసీ నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పినట్లు తెలిపారు. త్వరగా బ్జడెట్ ఆమోదించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజా సమస్యలు ప్రస్తావించే అవకాశం లేకుండా పోతుందని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా రెచ్చిపోతున్నారని కడియం శ్రీహరి మండిపడ్డారు. కనీసం ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరుతో ఇచ్చిన 420 హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రశ్నిస్తుందనే భయంతో సమావేశాలను త్వరగా ముగిస్తున్నారని కడియం పేర్కొన్నారు.

# నియామకాలకు తొలగిన అడ్డంకులు..

మొదటిపేజీ తరువాయి..
ఈ విధానంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి టీఎస్‌పీఎస్‌సీ, ఇతర నియామక బోర్డులు సన్నద్ధమవుతున్నాయి. ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

### గ్రూపు-4 పోస్టులకు తొలగిన అడ్డంకి !

మహిళా రిజర్వేషన్ అమలుపై స్పష్టత రావడంతో.. గ్రూపు–4 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను వెల్లడించాలని టీఎస్‌పీఎస్‌సీ అధికారులు భావిస్తున్నారు. సుమారు 8,039 గ్రూపు–4 పోస్టుల కోసం ఇప్పటికే పరీక్షలను పూర్తి చేశారు. తుది కీని కూడా ప్రకటించారు. అయితే.. ఫలితాలను విడుదల చేయాల్సి ఉంది. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి స్పష్టత లేకపోవడంతో వీటిని వెల్లడించలేదు. తాజాగా మహిళా రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో. వీటి ఫలితాలను ప్రకటించడానికి అధికారులు చర్యల్ని తీసుకుంటున్నారు.

### గ్రూపు-1 అభ్యర్థులకు మరోసారి పరీక్ష!

ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ రాసిన గ్రూప్–1 అభ్యర్థులు మరోసారి ఆ పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గతంలో ప్రకటించిన 503 పోస్టులకు అదనంగా మరో 60 పోస్టులను జత చేసి, కొత్తగా నోటిఫికేషన్‌ను జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ అప్లై చేయాల్సిన అవసరం లేదు. కొత్తవారు మాత్రం దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం అవకాశం ఇవ్వబోతున్నది. అలాగే.. అభ్యర్థుల వయో పరిమితిని కూడా రెండేళ్ల పాటు పొడిగించాలని నిర్ణయించారు. గత నోటిఫికేషన్ సమయంలోనే ప్రభుత్వం పదేళ్ల పాటు వయోపరిమితిని పొడిగించిన సంగతి తెలిసిందే. తాజా నిర్ణయం ద్వారా అది 12 ఏళ్లకు పెరగనుంది.

### గ్రూపు-2, 3 పోస్టుల పరీక్షలు..

గ్రూపు–2, 3 పోస్టుల భర్తీకి కూడా త్వరలోనే పరీక్షలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. మొత్తం 783 గ్రూపు–2 పోస్టుల కోసం సుమారు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నిజానికి ఈ పరీక్షలను 2023 ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. పేపర్ లీకేజీ నేపథ్యంలో నవంబరు 2, 3 తేదీలకు వాయిదా వేశారు. ఆ తర్వాత అభ్యర్థుల ఆందోళనతో మళ్లీ జనవరి 6, 7 తేదీలకు వాయిదా వేశారు. కొత్త టీఎస్‌పీఎస్‌సీ ఏర్పాటు ప్రక్రియ నేపథ్యంలో జనవరిలోనూ ఈ పరీక్షలు జరగలేదు. ఇక.. సుమారు 1,363 గ్రూపు–3 పోస్టుల కోసం 5.8 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటించనున్నారు. వీటితోపాటు.. ఇతర పోస్టుల భర్తీ విషయంలోనూ త్వరగా నిర్ణయం తీసుకోవాలని టీఎస్‌పీఎస్‌సీ భావిస్తోంది. ఇందులో ముఖ్యంగా లైబ్రేరియన్లు(71), డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు (18), ఇంటర్మీడియెట్ జూనియర్ లెక్చరర్లు(1392), అసిస్టెంట్ ఇంజనీర్లు(833), వెటర్నరీ సర్జన్లు(185), టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ (175), ఉద్యాన అధికారులు, అకౌంట్స్ ఆఫీసర్స్ తదితర పోస్టులున్నాయి.

### త్వరలోనే డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం త్వరలోనే మెగా డీఎస్సీని ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 5,089 టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీని ప్రకటించిన సంగతి తెలిసిందే. వాటికి మరికొన్ని పోస్టులను జోడించి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గతంలో ప్రకటించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,739, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 2,575, భాషాపండిట్ పోస్టులు 611, పీఈటీ పోస్టులు 164 ఉన్నాయి. వాటికి మరో 6వేల పోస్టులను జత చేసి, మెగా డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

### ఒకే మార్కులు వస్తే స్థానికతకు ప్రాధాన్యం

పోటీ పరీక్షల్లో అభ్యర్థులకు సమాన మార్కులు వస్తే.. స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. తెలంగాణ స్థానికత ఉన్న అభ్యర్థికి మెరుగైన ర్యాంకును ఇస్తామని.. ఇద్దరి స్థానికతా ఒకటే అయితే అభ్యర్థి వయసుకు ప్రాధాన్యమిస్తామన్నారు. స్థానికత, పుట్టిన తేదీ ఒకటే అయితే.. ఆయా సబ్జెక్టుల్లోని మార్కుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. అప్పటికీ తేలకపోతే..

ఉన్నత విద్యను, ఉన్నత విద్యలో సాధించిన మార్కులశాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. వాటిలోనూ సమానంగా ఉంటే కమిషన్‌దే తుది నిర్ణయం అవుతుంది.

# ఉచిత విద్యుత్ పథకంపై సీఎం కసరత్తు

మొదటిపేజీ తరువాయి..
ఈ మూడింటినీ ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది. వీటి ఆధారంగా విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. ఉచిత కరెంట్ కోసం ప్రజాపాలనలో 81 లక్షల 54 వేల 158 దరఖాస్తులిచ్చారు. వీటిలో 30 శాతం మంది రేషన్‌కార్డు, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లను సరిగా నమోదు చేయలేదు. తనిఖీల్లో భాగంగా విద్యుత్ సిబ్బంది ఈ వివరాలను మళ్లీ నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారుల్లో 10 లక్షల మందికి అసలు రేషన్‌కార్డులే లేవని తేలింది. ఇలాంటి వారికి తొలిదశలో ఉచిత కరెంటు సరఫరా సాధ్యం కాదని సమాచారం.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 49.50 లక్షల విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో 30 లక్షల కనెక్షన్లు నెలకు 200 యూనిట్ల లోపే కరెంటు వాడుతున్నారు. కానీ.. 19.85 లక్షల మంది మాత్రమే ఉచిత కరెంటు కోసం దరఖాస్తులిచ్చారు. వీటిలో 5 లక్షల దరఖాస్తుల్లో రేషన్ కార్డుల వివరాలే లేవు. సుమారు 10 లక్షల మంది అసలు దరఖాస్తు చేయలేదు. వీటన్నిటినీ సరిచూడడానికే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. రాష్ట్రమంతటా ఈ ప్రక్రియ పూర్తయ్యాక.. ఎన్ని ఇళ్లకు ఉచిత కరెంటు సరఫరా చేయాలనే ప్రాథమిక లెక్కలు తేలుతాయి.

# హామీల అమలుపై ప్రస్తావన ఏదీ..?

మొదటిపేజీ తరువాయి..
లేదన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ఒక్క మాట కూడా చెప్పలేదన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేలు ఇచ్చే విషయాన్నీ ప్రస్తావించ లేదన్నారు. గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ గురించి మాత్రమే చెప్పారు. మేనిఫెస్టో అంశాల గురించి ఎక్కడా చెప్పలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ, గవర్నర్ ప్రతిష్ట దిగజార్చిందన్నారు.ప్రజావాణి తుస్సుమన్నదని విమర్శించారు. ప్రజావాణిలో రోజూ సీఎం స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తా మన్నారు. మొదటి రోజు తరువాత సీఎం మొహం చాటేశారని విమర్శించారు. ప్రజావాణికి రోజుకొక మంత్రి వెళ్తారన్నారు.. అదీ లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దరఖాస్తులు తీసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కలెక్టర్లు దరఖాస్తులు తీసుకునేవారని వెల్లడించారు. ప్రజావాణి గురించి గర్నవర్‌తో అర్థసత్యాలు చెప్పించారన్నారు. ఆరు గ్యారంటీల్లో 13 హామీలున్నాయని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో మూడు చెప్పి ఒక గ్యారంటీ అమలుచేశామని చెబుతారా అని ప్రశ్నించారు. ఆరోగ్య శ్రీ అమలు లోపభూయిష్టంగా ఉన్నందునే గవర్నర్ ప్రసంగంలో చెప్పించలేదన్నారు. నిర్దిష్ట సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రైతులకు ఇచ్చిన నాలుగు హామీలు అమలు చేయడం లేదని చెప్పారు. డిసెంబర్ 9న అధికారంలోకి వస్తాం, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. అయితే ప్రమాణ స్వీకారాన్ని ముందుకు జరిపి.. హామీల అమలును వాయిదా వేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. వంద రోజుల్లో 60 రోజులు పూర్తయ్యాయ, ఇంకా 40 రోజులే ఉన్నాయని గుర్తుచేశారు. మరో పది రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది.. అప్పటివరకు సాగదీసి హామీల అమలు వాయిదా వేయాలని ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. ఎన్నికల కోడ్ వస్తే హామీలు ఎలా అమలు చేస్తారని నిలదీశారు. చిత్తశుద్ధి ఉంటే హామీల అమలు గురించి గవర్నర్ ప్రసంగంలో ఉండేదన్నారు. రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు కరెంట్ గురించి మాత్రమే ప్రస్తావించారని, మిగతా హామీలు వచ్చే ఏడాదిలో చేయలేమని అని చెప్పకనే చెప్పారని వెల్లడించారు. వంద రోజుల్లో అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. రూ.15 వేల రైతుభరోసా ఇస్తామన్నారు, 10 వేల రైతుబంధు కూడా ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వచ్చే యాసంగి పంటకు అయినా బోనస్ ఇస్తామని చెబుతారని ఎదురు చూశాం.. కానీ నిరాశ ఎదురైందన్నారు. రూ. 40 వేల కోట్ల పెట్టుబడిపై వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి పవర్ ఎలాంట్ ఊసేలేదని విమర్శించారు. మూసీ నది ప్రక్షాళన బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రారంభించిందని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం ఇస్తారన్నారు.. కానీ 7వ తేదీ వచ్చినా జీతాలు పడలేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణం. రెండు, మూడు నెలల నుంచి వారికి జీతాలు లేవన్నారు.

# మోడీ బిసి కాదు..ఓసికి చెందిన వ్యక్తి

మొదటిపేజీ తరువాయి..
లేకపోతే కులగణన కోరిన ప్రతిసారీ దేశంలో ఉన్నది ధనిక, పేద అనే రెండు కులాలు మాత్రమే అని చెప్తారన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఉద్దేశించి బుధవారం పార్లమెంట్‌లో మోదీ స్పందించారు. 'దళితులు, ఆదివాసీలు, వెనకబడిన వర్గాల వారికి కాంగ్రెస్ వ్యతిరేకంగా పనిచేసింది. మాజీ ప్రధాని నెహ్రూను వారు గుడ్డిగా అనుసరిస్తున్నారు. రిజర్వేషన్లను ఆయన గట్టిగా వ్యతిరేకించారు. మా హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అన్ని పదవుల్లో విశేష ప్రాధాన్యం ఇచ్చాం' అని వెల్లడించారు. అయితే మోదీ తన కులం విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒడిశాలోని ఝూర్సుగూడలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ఓబీసీ కులానికి చెందిన వ్యక్తి కాదని.. జనరల్ కేటగిరీకి చెందిన వారని ఆరోపించారు. ఆయన తన కులం గురించి అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. 'మోదీ ఓబీసీ కాదు. గుజరాత్‌లోని తెలీ కులంలో జన్మించారు. 2000 సంవత్సరంలో ఆయన కులాన్ని ఓబీసీల్లోకి మార్చారు. అగ్రవర్ణ కులాల్లో జన్మించినందుకే ఆయన కులగణనకు వెనకాడుతున్నారు' అని రాహుల్ అన్నారు. ఆయన చేపట్టిన న్యాయ్ యాత్ర గురువారం ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశించనుంది. కాంగ్రెస్ పార్టీ నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్తీస్ గఢ్‌లో అధికారం కోల్పోయింది. ఆ తరువాత రాష్ట్రంలో రాహుల్ తొలిసారి పర్యటిస్తున్నారు. జనవరి 14న మణిపూర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఫిబ్రవరి 11న రాయ్‌గఢ్, శక్తి, కోర్బా జిల్లాల మీదుగా సాగనుంది. ఫిబ్రవరి 14న బలరాంపూర్ నుంచి జార్ఖండ్‌లో రాహుల్ అడుగుపెట్టనున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయన ఈ యాత్ర చేపట్టారు.

# తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి..
హైదరాబాద్ జీవనాడిగా మారుతుందని చెప్పారు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే పనిలో ఉన్నామని అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రముఖ కవి కాళోజీ నారాయణ కవితతో గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. సామాన్య ప్రజల కోసం ప్రజాభవన్‌ను తెరిచామని చెప్పారు. ఆరు గార్యంటీలల్లో రెండింటిని అమలు చేశామని.. త్వరలో మరో రెండు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులకు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తామన్నారు. గత ప్రభత్వం రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి.. మాకు అప్పగించారని..ధనిక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని చెప్పారు. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక వ్యవస్థను గాడిన పెడతామని.. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాలానుగుణంగా హామీలను అమలు చేస్తామని.. ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో 1.8 కోట్ల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాభవన్ కంచెను తొలగించారన్నారు. దీంతో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజల కొరకు ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాటం చేశారని ప్రశంసించారు. యువకుల బలిదానాలతోనే తెలంగాణ ఏర్పాటైందని గుర్తు చేశారు. ప్రజాకాంక్షలు నెరవేరేలా ఈ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రజాభవన్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజలకు అనుమతి లభించిందని, తెలంగాణ ఏర్పాటులో కలిసి వచ్చిన పార్టీలు, వ్యక్తులకు తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలుపుతోందని గవర్నర్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సకాలంలో అమలు చేస్తామని, ఇప్పటికే రెండు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ఉచిత ప్రయాణం ద్వారా ఇప్పటివరకు 15 కోట్ల మంది మహిళలు ప్రయాణించారన్నారు. పాలమూరు రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, టిఎస్‌పిఎస్‌సి ద్వారా రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేవంత్ ప్రభుత్వం కొత్త ఎంఎస్ఎంఇ విధానం ప్రకటించిందని, దావోస్ సమావేశంలో రూ.40 వేల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని వెల్లడించారు. తెలంగాణ ఇచ్చిన అప్పటి మన్మోహన్ సింగ్ సర్కారుకు ప్రభుత్వం కృతజ్ఞతలు



తెలుపుతోందని, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ అగ్రనేత, యుపిఎ వైఎస్ చైర్మన్ సోనియాగాంధీ పోషించిన చారిత్రక పాత్రను ప్రభుత్వం స్మరించుకుంటోందన్నారు. ప్రజాపాలనలో 1.2 కోట్ల దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించామని తమిళి సై వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామన్నారు. అర్హులైన వారికి రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు తెలిపారు. కచ్చితంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. ధనిక రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థమైందని... దాన్ని చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేస్తామన్నారు. యువతకు 2 లక్షల ఉద్యోగుల కల్పనపై దృష్టిపెట్టామన్నారు. ప్రజావాణిలో 1.8కోట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. మౌలిక వసతులరంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలపై పన్నుల భారం పడకుండా చూస్తామన్నారు. గత సమావేశాల్లో ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందిస్తామని గవర్నర్ తమిళిసై వెల్లడించారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానం, మౌలిక వసతుల రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం కొత్త విధానాన్ని కూడా అమలులోకి తీసుకొస్తామన్నారు. ధరణి కమిటీ ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తాం. మా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పాటిస్తుంది. గత ప్రభుత్వం నిర్వాకాలను శ్వేతపత్రం ద్వారా ప్రజలకు తెలియజేశాం. రాష్ట్రంలో ప్రత్యేక నైపుణ్య వర్సిటీలు ఏర్పాటు చేస్తాం. విద్యతో పాటు ఉద్యోగమూ సాధించేలా యువతలో నైపుణ్యాలు పెంపునకు కృషి చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, వికలాంగ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తాం. 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. హైదరాబాద్‌ను దేశంలోనే కృత్రిమ మేధ (ఏఐ) ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 50 నుంచి 100 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేస్తాం. రూ.2 వేల కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తాం. క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేయడమే మా లక్ష్యం. కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బ్జడెట్ కేవలం ఆర్థిక పత్రం కాదు.. భవిష్యత్‌కు నమూనా అని చెప్పారు.గవర్నర్ ప్రసంగం అనంతరం శాసన సభ, శాసన మండలి సమావేశాలు నేటికి వాయిదా పడ్డాయి. అంతకుముందు గవర్నర్ తమిళసై అసెంబ్లీకి రాగానే సిఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాదరావు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబులు వెళ్ళి స్వాగతం పలికి తోడ్కొని వచ్చారు.

# రంగారెడ్డి జిల్లా తుది ఓటరు జాబితాను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా,(వెలుతురు న్యూస్):** ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. శశాంక గురువారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 35 లక్షల 91 వెయ్యి 987 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 286 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు, సర్వీస్ ఓటర్లు 581 మంది ఉన్నారని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. 18 లక్షల 50 వేల 292 మంది పురుష ఓటర్లు ఉండగా, 17 లక్షల 40 వేల 379 మంది మహిళా ఓటర్లు, 449 మంది థర్డ్ జెండర్స్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. 286 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లలో 230 మంది పురుషులు, 56 మంది మహిళా ఓటర్లు ఉన్నారని, 581 మంది సర్వీస్ ఓటర్లలో పురుషులు 543 మంది, మహిళా ఓటర్లు 38 మంది ఉన్నారని తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఓటర్లను పరిశీలిస్తే,

1. 48-ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఒక లక్ష 69 వేల 713 పురుష ఓటర్లు, 1 లక్ష 67 వేల 298 మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 36 మంది, 32 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు, 55 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 3 లక్షల 37 వేల 47 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.
2. 49-ఎల్. బి. నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 3 లక్షల 12 వేల 163 మంది పురుష ఓటర్లు, 2 లక్షల 88 వేల 153 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 134 మంది, 52 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు, 50 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 6 లక్షల 450 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.
3. 50-మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 2 లక్షల 84 వేల 913 మంది పురుష ఓటర్లు, 2 లక్షల 70 వేల 996 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 69 మంది, 59 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు, 73 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 5 లక్షల 55 వేల 978 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.
4. 51-రాజేందర్ నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 3 లక్షల 10 వేల 863 మంది పురుష ఓటర్లు, 2 లక్షల 88 వేల 684 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 38 మంది, 102 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు, 91 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 5 లక్షల 99 వేల 585 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.
5. 52-శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 3 లక్షల 95 వేల 460 మంది పురుష ఓటర్లు, 3 లక్షల 52 వేల 069 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 144 మంది, 34 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు, 50 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 7 లక్షల 47 వేల 673 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.
6. 53 -చేవెళ్ళ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 1 లక్ష 35 వేల 261 మంది పురుష ఓటర్లు, 1 లక్ష 33 వేల 820 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ ఆరుగురు, 5 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు, 74 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 2 లక్షల 69 వేల 087 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.
7. 83 కల్వకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 1 లక్ష 22 వేల 805 మంది పురుష ఓటర్లు, 1 లక్ష 20 వేల 148 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 9 మంది, ఇద్దరు ఎన్.ఆర్.ఐ ఓటర్లు, 134 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 2 లక్షల 42 వేల 962 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.
8. 84- షాదనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 1 లక్ష 19 వేల 114 మంది పురుష ఓటర్లు, 1 లక్ష 19 వేల 211 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 13 మంది, 54 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకుని మొత్తం 2 లక్షల 38 వేల 338 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.

ఎస్.ఎస్.ఆర్ - 2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించడం జరిగిందని కలెక్టర్ స్పష్టం చేశారు.

తుది ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహశీల్దార్ కార్యాలయాలలో, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.



## పనుల్లో నాణ్యత లోపిస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం...

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 08:** ఇటీవల హిమాయత్ నగర్ డివిజన్‌లోని విట్టల్వాడిలో ప్రారంభమైన స్వేరాజ్ పనులను కాంట్రాక్టర్ పని మనుషుల పైన వదిలేసి వెళ్లడం గమనించి అక్కడున్న స్థానికులు కార్పెంటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్‌కి సూచనలు ఇవ్వడం జరిగింది వారు హుటాహుటిగా అక్కడికి చేరుకొని జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు, మరియు మేనేజర్ మహేందర్ రెడ్డిని పిలిచి ప్రజాధనం వృధా కాకుండా నాణ్యమైన పనిచేయాలని ఆదేశించారు. అక్కడున్న కాంట్రాక్టర్‌ని పిలిచి నాణ్యతలేని పని చేస్తే మాత్రం అతనికి బ్లాక్లిస్టులో పెడతామని హెచ్చరించారు. జలమండలి సీఎం కూడా కాంట్రాక్టర్‌ని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు నవీన్, వినోద్, సత్యం గౌడ్, మరియు బిఆర్ఎస్ నాయకులు సుజాత, అనీష్, జగదీష్, అభిషేక్, ఆలీ, తదితరులు పాల్గొన్నారు.




## పల్లెకు పోదాం పదండి పాల్గొన్న బోసుపల్లి ప్రతాప్

**వెలుతురు ఇబ్రహీంపట్నం మండలం ఫిబ్రవరి 08:** భారతీయ జనతా పార్టీ ఎలిమినేడు గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా ఎలిమినేడు గ్రామానికి వచ్చిన ముఖ్యఅతిథులు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్ గారు వచ్చారు. కార్యకర్తలతో సమావేశమై గావ్ చలో అభియాన్ ముఖ్య ఉద్దేశాలను



వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ముఖ్య నాయకులు బోసుపల్లి ప్రతాప్ గారు, మండల సభ్యులు కంబాలపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్సు శ్రీకాంత్ రెడ్డి, బూత్ సభ్యులు అంజన్ రెడ్డి, ప్రశాంత్, మహేందర్, గణేష్, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో కాంగ్రెస్‌లోకి 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

### కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** త్వరలో కాంగ్రెస్‌లోకి 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వస్తారంటూ ఆ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ పక్కన ఉన్నా కూడా ఆ 20మంది ఎమ్మెల్యేలు వస్తారని చెప్పారు. ప్రజలకు బాగా సేవ చేయాలని, మంచి పేరు తెచ్చుకునేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ వైపు అట్రాక్ట్ అవుతారని కాన్ఫిడెంట్‌గా చెబుతున్నానని వ్యాఖ్యానించారు. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వస్తారంటూ గతంలోనూ జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు మరోసారి అదే రకమైన కామెంట్స్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాగా తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ నేతలను ఎన్నో ఇబ్బందులు పెట్టిందని జగ్గా రెడ్డి అన్నారు. పోలీసుల్ని అడ్డం పెట్టుకుని గడ్డపారతో పొడిచారని.. కనీసం తాము సూదితో అయినా పొడవకూడదా? అని ప్రశ్నించారు. అయితే తాము బీఆర్ఎస్ వాళ్లంత మూరులం కాదన్నారు. రాజకీయంగా కొన్ని తమకు తప్పదన్న జగ్గా రెడ్డి.. బీఆర్ఎస్ చేసిన అలవాటే తాము కొనసాగిస్తామన్నారు. మర్యాదపూర్వకంగా అంటూ ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వ్యవహారం రాజకీయ దుమారం రేపడం తెలిసిందే. అటు పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థంపుచ్చుకున్నారు. లోక్ సభ ఎన్నికలకు తెలంగాణలోని రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్న వేళ.. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వస్తారని జగ్గారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## చౌకబియ్యంపై అజమాయిషీ ఏదీ..?

### సరిహద్దులు దాటుతున్న పట్టని అధికారులు

**నిజామాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా ఎన్ని చర్యలు చేపట్టినా ఆగడం లేదు. రూపాయికే కిలో బియ్యం రావడం, బహిరంగ మార్కెట్లో ధరలు పెరగడంతో ఈ బియ్యాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రూపాయి బియ్యం తినడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. ఇదే అదనుగా కొందరు ఈ బియ్యాన్ని సేకరించి దందా చేపట్టారు. చాలామంది తమకు వచ్చిన బియ్యాన్ని షాపుల వద్దే పదిరూపాయలకు చొప్పున అమ్మేసు కుంటున్నారు. రేషన్ డీలర్లు సైతం కార్డుదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి అంతకంటే ఎక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముతున్నారు. జిల్లా నుంచి రేషన్ బియ్యం మహారాష్ట్ర ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా అవుతోంది. గిరిజన ప్రాంతాల్లో దుకాణదారులు బియ్యాన్ని తీసుకొని బదులుగా ఇతర నిత్యావసర వస్తువులను ఇస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు లారీల ద్వారా రేషన్ బియ్యం, ఇతర వస్తువులు సరఫరా చేస్తారు. ఈ బియ్యాన్ని పెద్ద ఎత్తున తరలించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. బియ్యం పక్కదారి పడుతుండడంతో ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించినా ఎలాంటి ఫలితం కానరావడం లేదు. ఇటీవల చౌకధరల దుకాణాలను తనిఖీ చేస్తూ సరుకుల పంపిణీని, స్టాక్ నిల్వలను, రేషన్ బియ్యం రీసైక్లింగ్ కాకుండా, మిల్లర్లు రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటలు వివరాలను సేకరిస్తున్నారు. పంటల అక్రమ నిల్వలను సైతం పరిశీలిస్తారు. అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటారు. దీంతో ప్రజా పంపిణీ దుకాణాల ద్వారా పంపిణీ చేసే సరకులు పక్కదారి పట్టే అవకాశాలు ఉండవు. ఎంఎల్ఎస్ పాయింట్లలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి బియ్యం సరఫరా చేసే వాహనాల్లో జీపీఎస్ పరికరాలను అమర్చారు. ఫలితంగా రేషన్ వస్తువులు సక్రమంగా దుకాణాలకు చేరే అవకాశాలున్నాయి. ఇకపోతే చౌక బియ్యం తీసుకుంటున్న కొంతమంది వినియోగిస్తుండగా, మరికొందరు అధిక ధరలకు అమ్ము కుంటున్నారు. పౌరసరఫరాల శాఖ ఆ ధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సైతం రేషన్ దుకాణాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని కిరాణ దుకాణా ల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన దుకాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నాయి. బియ్యం అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రేషన్ దుకాణంలో పంపిణీ చేసిన బియ్యం రీసైక్లింగ్ అయి సన్నబియ్యం రూపంలో అమ్మకాలు సాగిస్తున్నారు. పౌరసరఫరాలశాఖకు మిల్లర్లు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తుండగా, వారు రైతుల వద్ద కొనుగోలు చేసిన బియ్యం వివరాలను సైతం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సేకరిస్తుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసే ఇతర వస్తువులు దుకాణాలకు చేరకుండా నిఘా ఉంచుతారు. పంటల అక్రమ నిల్వలపై సైతం వీరు గుర్తిస్తారు. వీరు ప్రతి నెలా ఇందుకు సంబంధిం చిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటారు. అయితే ఎవరెన్ని చర్యలు తీసుకున్నా స్మగ్లర్లు దందా వీడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

## కెసిఆర్ కుటుంబాన్ని జైలుకు పంపాల్సిందే

### అందుకు తాను హోంమంత్రిని కావాల్సిందే

### కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్య



**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తాను హోంమంత్రిని కావాలని కోరుకుంటున్నానని అన్నారు. శాసనసభ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనకు అధిష్ఠానం హామీ ఇచ్చిందని.. హోంశాఖ ఇవ్వాలని కోరుతున్నానని చెప్పారు. కేసీఆర్‌ను గద్దె దించేందుకే కాంగ్రెస్‌లోకి వచ్చా. నేను హోంమంత్రి అయితేనే భారాస నేతలు కంట్రోల్‌లో ఉంటారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు, జగదీశ్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం. భువనగిరి, నల్గొండ లోక్‌సభ స్థానాల్లో మా కుటుంబసభ్యులెవరూ పోటీ చేయకూడదనేది మా ఆలోచన. పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తాం. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపిస్తాం అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే తెలంగాణ అసెంబ్లీ అవరణలో మాజీ మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. రాజగోపాల్ రెడ్డిని చూసిన కేటీఆర్ మీకు మంత్రి పదవి ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. మీ లానే మాకు ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతుందని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఫ్యామిలీ పాలన కాదు.. మంచిగా పని చేస్తే కీర్తి ప్రతిష్టలు వస్తాయని కేటీఆర్ అన్నారు. ఎంపీగా మీ కూతురు కీర్తి పోటీ చేస్తుందా.. సంకీర్త్ పోటీ చేస్తున్నారా? అని కేటీఆర్ అడిగారు. దయచేసి తనను కాంట్రవర్సీలోకి లాగవద్దంటూ రాజగోపాల్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక అనంతరం అసెంబ్లీ లాబీలో రాజగోపాల్ రెడ్డి మీడియాతో కాసేపు చిట్ చాట్ చేశారు. కేసీఆరే దగ్గరుండి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి పంపుతారన్నారు. వాళ్ళను వాళ్ళు కాపాడుకోడానికి బీజేపీలో బీఆర్ఎస్ వాళ్లు చేరుతారన్నారు. తనకు హోం మంత్రి కావాలని ఉందని.. బీఆర్ఎస్ వాళ్లను జైలుకు పంపాలని కోరికగా ఉందన్నారు.

## జయజయహే గీతం కెసిఆర్ ప్రోత్సాహమే..

### అందెశ్రీతో రాయించిన ఘనత కెసిఆర్‌ది

### మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**కరీంనగర్,ఫిబ్రవరి8(వెలుతురు):** జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతం విషయంలో జరుగుతున్న వివాదంపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పందించారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు ముందు పొలిటికల్ మైలేజ్ కోసం వాడు కుంటోందని ఆరోపించారు. అసలు జయ జయహే తెలంగాణ పాటకు కర్త కర్మ క్రియ? బీఆర్ఎస్ పార్టీనే అని అన్నారు. 2003 -2004 లో అందెశ్రీ ఈ పాటను రాసారని, కేసీఆర్ ప్రోత్సాహంతో ఆ పాటను రికార్డ్ చేశామన్నారు రసమయి. అయితే అందెశ్రీ రాసిన ఒరిజినల్ పాటలో 12 చరణాలు ఉండటంతో వాటిని 4 చరణాలకు తగ్గించాలనే ప్రతిపాదనకు అందెశ్రీ ససేమిరా ఒప్పుకోలేదన్నారు. తన పాటను యథాతథంగా 12 చరణాలతో వాడాలని చెప్పడంతోనే ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా వాడలేకపోయాం తప్ప, వేరు దురుద్దేశం మాజీ సీఎం కేసీఆర్‌కు లేదన్నారు రసమయి బాలకిషన్. జయ జయహే తెలంగాణ అనే పాటని రాష్ట్ర గీతంగా అప్పుడు ప్రకటించాలని కేసీఆర్ అను కున్నా? కేవలం అందెశ్రీ ఒప్పుకోకపోవడం వల్లే ఆగి పోయిందన్నారు రసమయి. కేసిఆర్ కర్త కర్మ క్రియగా ఉండి రికార్డు చేసిన పాటను? రేవంత్ కేవలం పొలిటి కల్ మైలేజ్ కోసమే ఇప్పుడు తెరపైకి తీసుకువచ్చి లబ్ది పొందాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తానికి? ఒక పాట.. రెండు స్వరాలు.. తెలంగాణ రాజకీయాల్లో రచ్చ రేపుతున్నాయి.

## బిజెపి పక్ష నేతగా మహేశ్వర్ రెడ్డికే చాన్స్..!

**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** తెలంగాణ బీజేపీ శాసనసభ పక్షనేతగా ఏలేటి మహేశ్వర రెడ్డిని నియమించే అవకాశం ఉంది. ఈ మేరకు బీజేపీ అగ్రనాయకత్వం నేడు అధికారికంగా ప్రకటించనుందని సమాచారం. ప్రస్తుతం నిర్మల్ ఎమ్మెల్యేగా ఉన్న ఏలేటి మహేశ్వర రెడ్డి.. 2009లో ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యేగా పనిచేశారు. కాగా అసెంబ్లీ బీఏసీ సమావేశానికి 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల్లో ఒకరిని పిలవాలని ఆ పార్టీ శాసనసభ్యులుస్పీకర్‌ను కోరారు. ఈ క్రమంలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డిని పిలవాలని బీజేపీ ఎమ్మెల్యేలంతా సంతకాలు చేసిన లేఖను స్పీకర్‌కు అందించారు. దీంతో బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వరరెడ్డి బీఏసీ సమావేశానికి హాజరయ్యారు. దీనిని బట్టి బీజేపీ శాసనసభా పక్షనేతగా ఏలేటి మహేశ్వరరెడ్డి పేరు ఖరారు అయినట్టేనని పలువురు చెబుతున్నారు.

## యూసఫ్‌గూడలో దారుణహత్య

### అర్ధరాత్రి కత్తులతో అతి కిరాతకంగా దాడి

**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** హైదరాబాద్‌లోని యూసఫ్ గూడలో దారుణ ఘటన చోటు చేసుకుంది. రాములు అనే వ్యక్తిపై 10 మంది గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి కత్తులతో అతి కిరాతకంగా దాడి చేశారు. అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఛైర్మన్ రాములు గత కొంతకాలంగా సోషల్ సర్వీసెస్ చేస్తున్నారు. ఆయన గత ఎన్నికల్లో బీజేపీలతో చేరారు. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన బీజేపీ నేత సింగోటం రామన్నను గత రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని డీసీపీ కృష్ణచైతన్య, జూబ్లీహిల్స్ ఏసీపీ పరిశీలించారు. పాతకక్షల నేపథ్యంలోనే హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. రాములు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.ఆటోడ్రైవర్ స్థాయి నుంచి చేపల ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగిన రామన్న.. అబ్దుల్ కలాం ఫౌండేషన్ నుంచి కొంతకాలంగా సోషల్ సర్వీస్ చేస్తూ పేరు సంపాదించుకున్నారు. ముఖ్యంగా పాలమూరు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం సింగోటం ప్రాంతం సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీలో చేరిన రాములు.. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ జిల్లా నుంచి బీజేపీ ఎంపీ టికెట్ ను ఆశిస్తున్నారు. ఈ హత్యకు పాతకక్షలు కారణమా లేక బీజేపీ నుంచి ఎంపీ టికెట్ ఆశించినందుకే అంతమొందించారా అన్న కారణాలు తెలియాల్సి ఉంది. ఈ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పాదచారులపైకి దూసుకెళ్లిన డిసిఎం

### ప్రమాదంలో 9ఏళ్ల బాలుడు మృతి

**హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** సికింద్రాబాద్ అల్వాల్ లో గురువారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. స్థానికంగా ఓ సూపర్ మార్కెట్ కు సరుకులతో వచ్చిన డీసీఎం వ్యాన్ ఒక్కసారిగా పాదచారులపైకి దూసుకొచ్చింది. ఇదే సమయంలో తల్లితో కలిసి అటుగా వెళ్తున్న తొమ్మిదేళ్ల బాలుడు తిరుపాల్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడగా.. వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తిరుపాల్ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అల్వాల్ గంగపుత్ర కాలనీకి చెందిన తిరుపాల్.. కృష్ణవేణి స్కూల్ లో మూడో తరగతి చదువుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న తండ్రిని చూసేందుకు తల్లితో కలిసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కుమారుడి మృతితో తల్లి కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

## వీధికుక్కల దాడిలో వృద్ధురాలు మృతి

**కామారెడ్డి,ఫిబ్రవరి8(వెలుతురు):** వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ విషాదకర సంఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముస్తాబాద్ రామవ్వ (75) బుధవారం రాత్రి తన ఇంటి ముందు కూర్చుని ఉంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. అయితే ఒక్కసారిగా ఆమెపైకి దూసుకొచ్చిన వీధికుక్కల గుంపు దాడి చేసింది. గమనించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన రామవ్వను తొలుత కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి ఆమె మార్గమధ్యలోనే మృతి చెందారు.

# సంపాదకీయం..

## ధరల నియంత్రణలో ప్రభుత్వాల విఫలం!


దేశంలో ఆహారధాన్యాల సేకరణ,వ్యవసాయ విధానంలో మార్పులు రానంత వరకు ..వాటి ధరలు అనూహ్యంగా పెరుగుతూనే ఉంటాయి. తాజాగా దేశంలో బియ్యం ధరలు చుక్కలనంటాయి. కర్నూలు సోనా బియ్యం కిలో 70కి చేరువలో ఉన్నాయి. ధరల నియంత్రణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఎక్కడా కఠిన చర్యలు కానరావడం లేదు. భారత్ బియ్యం కిలో 29కే అందిస్తామని ప్రకటించినా ధరల్లో మార్పు కానరావడం లేదు. ఇబ్బడిముబ్బడిగా వరిధాన్యం పడుతున్నా..బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయో ఆలోచన చేయడం లేదు. ఒక్క బియ్యం ధరలే కాదు..ఉప్పులూ..పప్పుల ధరలు కూడా విపరీతంగా పెరిగి పోతున్నాయి. ధరల నియంత్రణ తమ పనికాదన్న రీతిలో ప్రభుత్వాలు ఉన్నాయి. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఇదేనా వికసిత భారత్ అని ఆలోచించాలి. అందమైన ప్రకటనలతో ఎంతోకాలం ప్రజలను మోసపుచ్చలేం. వ్యవసాయ, అనుబంధ రంగాలను బలోపేతం చేయడంతో పాటు, ఆహారధాన్యాల దిగుమతులను పూర్తిగా తగ్గించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. అందుకే ఎంతగా శ్రమించినా రైతులకు మాత్రం గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం లభ్యం కావడం లేదు. కార్పోరేట్ దిగ్గజాలకు ఇస్తున్న ప్రాధాన్యం మన దేశంలో రైతులకు ఇవ్వకపోవడం కారణంగా వ్యవసాయం అనుకున్న రీతిలో ముందుకు సాగడం లేదు. ఆదానీ, అంబానీలకు మద్దతు ఉన్నంత మాత్రాన దేశం అభివృద్ధి చెందదు. సామాన్య రైతులను ఆధారం చేసుకుని మన విధానాలు మార్చుకోవాలి. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలు ఎప్పుడూ మోసోపోతూనే ఉన్నారు. ఈ పరిస్థితి మారాల్సి ఉంది. సాగు చట్టాలను రద్దు చేసినా...రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, అనుబంధ రంగాలను పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయలేదు. నిజానికి ఈ రెండు రంగాలను బలోపేతం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాగలదు. అలాగే దేశీయంగా వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరగాలి. వ్యవసాయ దిగుమతులను తగ్గించుకుంటే తప్ప ఇది సాధ్యం కాదు. గోదాముల్లో పేరుకు పోతున్న ధాన్యం ప్రజలకు అందడం లేదు. దేశంలో నేటికీ పేదప్రజలు ఆకలితో అలమటిస్తున్న దుర్భర పరిస్థితులు దాపురించాయి. వాళ్ళ దగ్గర కొనుగోలుశక్తి లేకపోవడమే దీనికి కారణం. వీరంతా తమ ఆరోగ్య సంరక్షణకి, గృహ వసతికి, బిడ్డల చదువులకు నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. అంటే ఈ రంగాలను కూడా పేదలకు చేరువ చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక వ్యవస్థలో వినిమయాన్ని పెంపొందించడం జరగాలంటే ప్రజా సంక్షేమ రంగాల్లో కేటాయింపులను పెంచాలి. దేశంలో ఎఫ్‌సిఐ వద్ద ఆహార ధాన్యాల నిల్వలు అలాగే పడివున్నాయి. కానీ ప్రజల కొనుగోలుశక్తి లేకపోవడంతో అధిక ధరలు దాడి చేస్తున్నాయి. నిజానికి సంక్షేమానికి కేటాయింపులు పెంచాలి. కాని బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు గతంలో ఉన్న కేటాయింపులకు సైతం కోతలు పెట్టింది. తలసరి వాస్తవ వినిమయంలో పెరుగుదల 5శాతం కన్నా తక్కువగానే ఉంది. ఇది జిడిపి వృద్ధి రేటు కన్నా తక్కువ. ఉపాధి హామీ పథకానికి కేటాయింపుల సంగతి అలావుంచితే దానిని ప్రాధాన్య రంగాలకు వినియోగించివుంటే బాగుండేది. వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్లను పట్టించుకోవడం లేదు. దేశంలో 81 కోట్లమందికి నెలకు 5 కిలోల చొప్పున ఆహారధాన్యాలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం చాలా గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. అంటే ఇంకా ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదని ఈ పథకం వల్ల అర్థం చేసుకోవచ్చు. విద్య, వైద్యం రంగాలకు కేటాయింపుల్లో నామమాత్రపు పెరుగుదల చూపించారు. కాని పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఫలితంగా ఈ రంగాలు వాస్తవం గా గతం కన్నా తక్కువ కేటాయింపులనే పొందనున్నాయి. ఉత్పత్తి సామర్ధ్యాన్ని పూర్తిగా ఉపయోగించు కోవడం కాని, మౌలిక వసతులను సంపూర్ణంగా ఉపయోగించుకో గలగడం కాని జరగడం లేదు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం లేదు. పైగా దేశ ఆర్థిక వ్యవస్థ మనుగడ కూడా ప్రమాదంలో పడిపోతుంది. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడనంత కాలం ఆర్థిక వ్యవస్త చితికిపోతూనే ఉంటుంది. ప్రజల కొనుగోలుశక్తి పెరగనంత కాలం ఈ పరిస్థితి తప్పదు. అప్పుడు ఈ ఆర్థికవృద్ధి లక్ష్యానికే అర్థం లేకుండా పోతుంది.

ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపుల్లో కోత పడిందో, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజాసంక్షేమం విషయంలో వెనకాడతాయి. ఆర్థిక వసరులను ఈ విధంగా కావాలనే కేంద్రం చేతుల్లో మరింత ఎక్కువగా ఉంచుకోవడం ద్వారా ఫెడరల్ వ్యవస్థను కేంద్రం మరింత బలహీనపరుస్తోంది. ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయడం వలన నేరుగా శ్రామిక ప్రజలు లబ్ది పొందుతారు. ప్రజా సంక్షేమానికి చేసే ఖర్చు ఆర్థిక వ్యవస్థ మీద చేసిన ఖర్చుకి మించి కొన్ని రెట్టు ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. అదే పెట్టుబడి వ్యయం మీద ఖర్చు చేస్తే ఆ విధమైన ప్రభావం ఉండదు. అంటే పెట్టుబడి వ్యయం మీద ఖర్చు పెంచడం కన్నా సంక్షేమం మీద ఖర్చు పెంచితే ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఎక్కువ ఉపాధి కల్పన జరుగుతుంది. పెట్టుబడి వ్యయాన్ని పెంచినంత మాత్రాన దేశంలో ఉపాధి కల్పన జరిగిపోతుందని అనుకోరాదు.

దేశీయంగా ఆ పెట్టుబడి వ్యయాన్ని వినియోగించగలిగిన పరిస్థితి ఉంటే మనదేశంలో ఉపాధి కల్పన పెరుగుతుంది. అంతేకాని విదేశీ దిగుమతులకోసం పెట్టుబడి వ్యయాన్ని ఎక్కువ కేటాయిస్తే ఉపాధి అదనంగా పెరిగేది చాలా స్వల్పమే. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా కార్యాచరణ జరగాలి. గ్రామాల్లో ఆర్థిక కార్యకాలపాలకు ప్రాధాన్యం పెరగాలి. అలా జరగాలంటే వ్యవసాయం, అనుబంధ రంగాలను ఆదుకోవాలి. అందుకు ప్రోత్సాహకాలు పెరగాలి. దేశీయంగా పండించే పంటలను ప్రోత్సహించి, అందుకు అనుగుణంగా దిగుమతులపై ఆంక్షలు విధించుకోవాల్సిందే.

## అడవుల రక్షణకు కఠిన చర్యలు

జిల్లాలో అటవీ భూములను ఆక్రమించే వారిని, అటవీ జంతువులను వేటాడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసారు. అటవీ అధికారులు ఇందుకోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. ఓవైపు అడవుల రక్షణ మరోవైపు హరితహారంలో మొక్కలు నాటడం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నారు. ఇప్పటికే అడవులకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయగా సత్ఫలితాలు ఇస్తున్నాయి. అటవీ సంపదను దోచుకునే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోబోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో అటవీ సంపదను దోచుకునే వారిపై ఇకనుంచి సమాచారాన్ని సేకరించి వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపడతామని అన్నారు.అటవీ భూముల ఆక్రమణ దారులపై చట్టపరంగా చర్యలు తీసుకునే విధంగా పోలీస్ శాఖ, అటవీ శాఖ సమన్వయంతో పనిచేసే విధంగా ప్రణాళికను రూపొంది స్తున్నారు. ఇందు కోసం పోలీస్, అటవీశాఖలు సంయుక్తంతో పనిచేసి అటవీ



సంపదను కాపాడాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేశారు. అటవీ, పోలీస్ శాఖలు సమ న్వయంతో జిల్లాలో అటవీ సంపదను కాపాడుకోవాలని అటవీ అధికారులు అన్నారు. అటవీ సంపద ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఒక్కటైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ సంపద అక్రమార్కుల పాలు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ సంపదను కాపాడుకునేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 20 చెక్‌పోస్టులతో పాటు అదనంగా ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటునకు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. కలప అక్రమ రవాణా చేసే వారిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అడవుల రక్షణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో భారీగా మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్ణయించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీ ఉంటే మొక్కలను సులువుగా ఆయా గ్రామాల్లో మొక్కలు నాటడంతో పాటు ప్రజలను అత్యధికంగా భాగస్వాములను చేయనున్నారు.నర్సరీలోనే ఆ పంచాయతీల్లో, మండలాల్లో మొక్కలు నాటేలా అధికారులు ప్రణాళికా రూపకల్పన చేశారు. ఇతర మండలాల నుంచి మొక్కలను తీసుకువచ్చి మొక్కలు నాటేలా కాకుండా ప్రతి గ్రామ పంచాయతీ ఖచ్చితంగా ఒక నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచే బాధ్యతను అప్పగించారు. జిల్లాకు నిర్ధేశించిన మొక్కల లక్ష్యాన్ని నాటేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేయడంతో విత్తనాల పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. టేకు వృక్ష జాతి అంతరించిపోయే దశలో ఉండడం, గృహ, ఫర్నీచర్ అవసరాలతో పాటు, ఎక్కువ విలువ కలగడంతో టేకు మొక్కలు నాటేలా ప్రభుత్వం నిర్దేశించింది. ఎలాంటి వాతావరణంలోనైనా టేకు మొక్కలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందునే టేకు మొక్కలను పెంచనుంది. టేకు మొక్కలు మినహాయిస్తే మిగతా పూలమొక్కలు, పండ్ల మొక్కలను పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రధాన రోడ్ల వెంట నాటనున్నారు. టేకుతో పాటు వెదురు, దానిమ్మ, నిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, కర్జూరం, నిద్ర గన్నేరు, మల్బర్ వేప, గానుగ, వేప, కదంబ, గుల్‌మొహర్, మారేడు, స్పాంథోడియా, కరివేపాకు, గోరింట, ఉసిరి, చింత, రేగు, ఈత, నేరేడు తదితర మొక్కలు ఈ నర్సరీలో పెంచనున్నారు.

# అభివృద్ధి పథంలో ఈశాన్య భారతదేశం



**- జి. కిషన్ రెడ్డి**
**ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి**

సుందరమైన కొండలు, లోయల మధ్య ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లో స్పష్టమైన మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. పదేళ్ళపాటు సాగిన అలుపెరగని కృషి ఫలించింది. ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి పవనాలు వీస్తున్నాయి. అభివృద్ధిలో నూతన శకం ప్రారంభమైంది. 8 రాష్ట్రాల అంతర్లీన సామర్థ్యాన్ని తొలిసారిగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తించి అభివృద్ధికి నాంది పలికారు. ఈశాన్య రాష్ట్రాలను ' అష్టలక్ష్ములు' గా అభివర్ణించిన శ్రీ నరేంద్ర మోదీ భారతదేశ అభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాలు కీలకంగా ఉంటాయి అని ప్రకటించారు. రహదారులు,రైలు, విమాన సర్వీసులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన తో ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి వేగం పుంజుకుంది.ఈశాన్య రాష్ట్రాల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు దేశం ఇతర ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ప్రమాణాలకు సమానంగా ఉన్నాయి. బందు లు, రహదారుల దిగ్బంధం, సమ్మెలు గతంలో అభివృద్ధి అవకాశాలను యువతకు దూరం చేశాయి. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో బందు లు, రహదారుల దిగ్బంధం, సమ్మెలు లేవు. దీంతో యువత అభివృద్ధి కలలు సాకారం అవుతున్నాయి. ఎలాంటి ఆటంకాలు, సమస్యలు లేకుండా వర్తక, వాణిజ్య కార్యక్రమాలు సాగుతున్నాయి. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. రవాణా సౌకర్యాలు పెరగడంతో ఇవన్నీ సాధ్యం అయ్యాయి.

తొలుత నుంచి ఈశాన్య ప్రాంతం అపూర్వమైన రాజకీయ సంకల్పం, స్ఫూర్తిదాయకమైన అంకితభావానికి పుట్టినిల్లుగా ఉంటూ ప్రతి భారతీయుడికి గర్వ కారణంగా నిలిచింది. భారతదేశంలో కీలక ప్రాంతంగా గుర్తింపు పొందిన ఈశాన్య ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి నూతన శకానికి తెర తీసింది. ఇటీవల ముగిసిన ఎన్ఈసీ 71వ ప్లీనరీలో గౌరవనీయ హోం మంత్రి వర్ణించినట్టుగా గత దశాబ్దం ఈశాన్య భారత చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఈశాన్య ప్రాంతం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి, విధానం మారాయి. స్పష్టమైన ఈ పరివర్తనాత్మక విధానం వల్ల ఈశాన్య ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతంలో సంఘర్షణ-కేంద్రీకృత-పరిపాలన జరిగేది. ప్రస్తుతం అభివృద్ధి-ఆధారిత పాలన విధానం అమలు జరుగుతోంది. గతానికి తెర దించిన ప్రభుత్వ విధానం సాంస్కృతిక మరియు సామాజిక సమైక్యతకు బీజాలు వేసింది. బలమైన,, ఐక్య భారతదేశాన్ని ఆవిష్కరించింది. ఈశాన్య ప్రాంతంలో మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ రైల్వే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అగర్తలా-అఖౌరా మధ్య రైల్వే సేవలు అందుబాటులోకి రావడంతో రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన భారతదేశ 'లోతట్టు ప్రాంతం' అంతర్జాతీయ వాణిజ్య,పర్యాటక పటంలో ఎలా ఎదిగిందో చెప్పడానికి గర్వించదగిన చక్కటి ఉదాహరణ.

శక్తివంతమైన సంస్కృతులు, పుష్కలమైన వనరులతో కూడిన ఈశాన్య ప్రాంతం భారతదేశంలో కీలక ప్రాంతం. అయితే, రాజకీయ ఉదాసీనత వల్ల ఈ ప్రాంతం వెనకబడి పోయింది. హింస, అస్థిరతను సాకుగా చూపించిన గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రాంతానికి సరైన గుర్తింపు ఇవ్వలేదు. వాస్తవ పరిస్థితి, అనుసరించిన విధానాలను పరిశీలిస్తే ఈశాన్య ప్రాంతాలు వెనుకబడి ఉండటానికి కారణం ఎవరో స్పష్టంగా అర్థం అవుతుంది.

అయితే, 10 సంవత్సరాల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం ఈశాన్య ప్రాంతాల ప్రాధాన్యత గుర్తించి అమలు చేసిన విధానాల వల్ల ప్రాంతంలో శాంతి, భద్రతలు నెలకొన్నాయి. భౌగోళిక సవాళ్లు, భద్రతాపరమైన సవాళ్లు ఎదుర్కొని అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. అరుణాచల్ లోని కిబితూను భారతదేశం చివరి గ్రామంగా కాకుండా భారతదేశం మొదటి గ్రామం గుర్తించడం, దేశవ్యాప్త వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా ఈశాన్య దాని మారు మూల మూల ప్రాంతాల అభివృద్ధి పట్ల తనకున్నఈ నిబద్ధతను కేంద్రం ప్రకటించింది.

2014 నుంచి 50కి పైగా మంత్రిత్వ శాఖలు ప్రాంతీయ అభివృద్ధి కోసం రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. దీనివల్ల ఈ ప్రాంతంలో అభివృద్ధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. 2014 నుంచి ఈశాన్య ప్రాంతంలో ఒక ఆర్థిక విప్లవం జరుగుతోంది. ఈ ప్రాంతంలో 54 కేంద్ర మంత్రిత్వ శాఖలు చేసిన వ్యయం 233% (2014 లో 24,819 కోట్ల నుంచి 2023 లో 82,690 కోట్ల రూపాయలకు) పెరిగింది. ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపులు 152% (2014 లో రూ .2,332 కోట్లు, 2014 లో రూ .2,332 కోట్లు, 2014 లో రూ .5,892 కోట్లు) పెరిగాయి. ప్రభుత్వ విధానంలో మార్పు అభివృద్ధికి దోహదపడుతోంది. . వివిధ రాష్ట్రాల అవసరాలకు పీఎం డివైన్ పథకం కింద రూ.6,600 కోట్ల సహకారం అందిస్తామని ప్రకటించి ప్రభుత్వం మరోసారి తన నిబద్ధతను చాటుకుంది.

ఈశాన్య ప్రాంతంలో " రవాణా ద్వారా మార్పు తీసుకు వస్తాం" అని 2014లో గౌరవనీయ ప్రధానమంత్రి ప్రకటించారు. ఈశాన్య ప్రాంతంలో పదేళ్ల తర్వాత మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానమంత్రి దార్శనికత కార్య రూపం కింద 64 కొత్త మార్గాలు అమలులోకి వచ్చాయి. మొట్ట మొదటిసారిగా, ప్రతి రాష్ట్రంలో ఒక విమానాశ్రయం అందుబాటులో ఉంది, ఇటీవల పాక్యాంగ్, ఉమ్రోయ్ మరియు ఇటానగర్ వంటి ప్రాంతాలకు విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి.

నదులు ఈశాన్య రాష్ట్రాలకు జీవనాడి. దేశ విభజనకు ముందు రోజుల్లో సులభంగా సరుకులు రవాణా వీలుగా రవాణా మార్గాలు అందుబాటులో ఉండేవి. . అంతర్జాతీయ సరిహద్దులు ప్రజలకు ఆర్థిక అవకాశాలకు దూరం చేశాయి. . ఆశ్చర్యకరంగా, అంతర్గత జలమార్గ సంబంధాలను




దాలుస్తోంది. రవాణా రంగం అభివృద్ధి మార్గంలో నడుస్తోంది. 75 సంవత్సరాల తర్వాత మణిపూర్ కు మొదటిసారిగా సరుకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. 100 సంవత్సరాల తరువాత నాగాలాండ్ లో రెండవ రైల్వే స్టేషన్ ప్రారంభం అయింది. అనేక రాష్ట్రాల నుంచి మొదటిసారి విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యాయి. 75 సంవత్సరాలలో మొదటి గూడ్స్ రైలు 2022 లో మణిపూర్ కు వచ్చింది. , జిరిబామ్-ఇంఫాల్ రైల్వే లైన్ లో నిర్మించిన 141 మీటర్ల పొడవైన స్తంభాలతో ప్రపంచంలోనే ఎత్తైన గిర్డర్ రైల్ వంతెన నిర్మాణం జరిగింది. ఈశాన్య రైల్వే సాధించిన అబ్బుతమైన అభివృద్ధి విస్మయం, ప్రేరణ కలిగించే అంశం.

2014కు ముందు భారతీయ రైల్వేలు గౌహతి లేదా త్రిపురను దాటి ఎప్పుడూ ముందుకు వెళ్ళ లేదు. అన్ని రాష్ట్రాల రాజధానులను కలిపే ప్రణాళికతో రైల్వే శాఖ ప్రణాళిక అమలు చేస్తోంది. ఈ ప్రణాళిక దాదాపు పూర్తి కావస్తోంది.పని చేస్తున్న సెక్షన్లలో గణనీయమైన 170% పెరుగుదల సాధించింది. ఇది సంవత్సరానికి సగటు కంటే రెట్టింపు (యుపిఎ -2 కాలంలో సంవత్సరానికి 66.6 కి.మీ/ ప్రస్తుతం సంవత్సరానికి 179.78 కి.మీ). రాజకీయ సంకల్పం,సహకారంతో గణనీయమైన ఆర్థిక పురోగతి ఈ మార్పుకు దోహదపడింది, యుపిఎ -2 పాలనతో పోలిస్తే వార్షిక బడ్జెట్ కేటాయింపులు 384% పెరిగాయి, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ .9,970 కోట్లు పెరిగాయి. "అమెరికా రహదారులు మంచివి కావు ఎందుకంటే అమెరికా సంపన్నమైనది, కానీ అమెరికా రోడ్లు బాగున్నాయి కాబట్టి అమెరికా సంపన్నమైనది" అని అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ వ్యాఖ్యానించారు. జాన్ ఎఫ్ కెన్నెడీ మాటలు ఈశాన్య భారతదేశానికి సరిగా వర్తిస్తాయి. అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడంతో జాతీయ రహదారి అభివృద్ధి జాతీయ సగటును కూడా ఈశాన్య ప్రాంతం అధిగమించింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో రోజుకు కేవలం 0.6 కిలోమీటర్ల జాతీయ రహదారిని నిర్మించారు 2014-2019 మధ్య కాలంలో ఈశాన్య రాష్ట్రాల్లో రహదారుల నిర్మాణం రెట్టింపు అయింది. రహదారుల నిర్మాణం రోజుకు1.5 కిలోమీటర్ల పెరిగింది.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, 2014 వరకు, ఈశాన్య ప్రాంతంలో 10,905 కిలోమీటర్ల జాతీయ రహదారులు మాత్రమే ఉన్నాయి, కానీ కేవలం 10 సంవత్సరాల వ్యవధిలో 2023 నాటికి ఈ సంఖ్య ఈ ప్రాంతంలో రహదారుల విస్తీర్ణం 16,125 కిలోమీటర్లకు పెరిగింది. ప్రస్తుతం రూ.1.11 లక్షల కోట్ల విలువైన 5,388 కి.మీ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.

అదేవిధంగా, విమానయాన రంగానికి ప్రోత్సాహం లభించింది.ఈశాన్య ప్రాంతంలో 2014 నుండి 8 కొత్త విమానాశ్రయాలు నిర్మించబడ్డాయి. రీజినల్ ఎయిర్ కనెక్టివిటీ స్కీమ్ వల్ల ఈశాన్య ప్రాంతంలో విమాన సేవలు ఎక్కువ అయ్యాయి. సవాళ్లతో కూడిన మార్గాలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద సహకారం అందుతుంది. నేడు ఉడాన్ పథకం పునరుద్ధరించడానికి 7 దశాబ్దాలు పట్టింది. 19 కొత్త జాతీయ జలమార్గాలు (2014 వరకు కేవలం 1 మాత్రమే) అందుబాటులోకి వచ్చాయి. బంగ్లాదేశ్ తో అంతర్గత జల రవాణా (ఐడబ్ల్యుటి) ఒప్పందం, చిట్టగాంగ్ ,మంగ్లీ ఓడరేవుల వినియోగం కోసం కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందాలు ఆసియా దేశాలు, పొరుగు దేశాలతో వాణిజ్యాన్ని పెంచడానికి ఆర్థిక అవకాశాలను తెరుస్తాయి.

పటిష్టమైన రవాణా వ్యవస్థ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వస్తుంది. ఈ ప్రభావం ఈశాన్య ప్రాంతంలో స్పష్టం కనిపిస్తోంది. ఈశాన్య ప్రాంతం మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చెందడంతో పాటు వివిధ రంగాలలో ప్రతిభను వెలికి తీస్తోంది. వర్ధమాన పారిశ్రామికవేత్తల నుంచి ప్రపంచ స్థాయి క్రీడా తారల వరకు ఈ ప్రాంతంలో అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయి. మణిపూర్ లో దేశంలోనే తొలి స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పడం , 2018 నుంచి ఖేలో ఇండియా కింద నిధులు ఎక్కువగా కేటాయించడం వంటి కార్యక్రమాలు ఈ ప్రాంతంలో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలుస్తాయి.. అంతేకాకుండా, దాదాపు 4000 స్టార్టప్ ల రిజిస్ట్రేషన్, డిసెంబర్ 2022 వరకు 670 కోట్లకు పైగా మైక్రో ఫైనాన్స్ రుణాల మంజూరు ఈశాన్యంలో వృద్ధి, సామర్థ్యానికి నిదర్శనం.

గత దశాబ్దంలో ఈశాన్య ప్రాంతంలో సాధించిన పురోగతి ఈ ప్రాంతాన్ని భారతదేశ మారుమూల మూల స్థాయి నుంచి న్యూ గ్రోత్ ఇంజిన్ స్థాయికి పెంచింది. రవాణా సౌకర్యాలు మెరుగు పడడంతో నూతన అవకాశలు అందుబాటులోకి తెచ్చింది. పర్యాటకం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమ, సేవా రంగం,యువ శ్రామిక శక్తి, సహజ, సేంద్రీయ వ్యవసాయం, పునరుత్పాదక ఇంధన రంగం అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. దశాబ్దాలుగా గుర్తింపుకు నోచుకోని అనేక ఇతర రంగాలను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతం ఆర్థిక వృద్ధిపై ఈ రోజు తీర్వ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోగొప్ప విజయాలు నమోదు అయ్యాయి.అయితే, సాధించాల్సిన లక్ష్యాలు ఇంకా చాలా ఉన్నాయి శ్రీ నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో,ప్రభుత్వం యుద్ధంలో సగం విజయం సాధించింది. కొన్ని పంక్తులు భారతదేశంలో పూర్వోత్తర భారతదేశంలో ఒక కొత్త ఉదయానికి మన దార్శనికతను , సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయి.

"ఉదయాన్ని ఆలింగనం చేసుకుని , చాలా ప్రకాశవంతంగా ప్రయాణాన్ని సాగించాలి.
ఈశాన్య రాష్ట్రాల ప్రస్థానం , వెలుగుతున్న దీపం
ఆశయాలు బయటపడే చోట ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అవకాశం కలుగుతుంది. ,
భవిష్యత్తు అభివృద్ధికి ఈశాన్య ప్రాంతం సాధించిన అభివృద్ధి ఒక నిదర్శనం ".

**(వ్యాసకర్త కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి)**

# ప్రజా ఉద్యమాలను లక్ష్యం చేయని కేంద్రం

ఎన్నికలకు మరో నెల మాత్రమే గడువు ఉంది. ఇప్పటికే రాజధాని రగడ అలాగే ఉండిపోయింది. పోలవరం పూర్తి కాలేదు. ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. అలాగే రాజధాని లేకుండా కాలం గడిపేశారు. దీనికితోడు విశాఖ ఉక్కు వ్యవహారంలో అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మౌనం వహిస్తోంది. కేంద్రాన్ని నిలదీసే చర్యలకు పూనుకోవడం లేదు. అధికార, విపక్షాలు ఉమ్మడిగా కేంద్రాన్ని నిలదీయలేకపోతున్నాయి. అందరిదీ అధికార యావ కావడంతో కేంద్రం విషయంలో గట్టిగా పోరాడ లేకపోతున్నారు. ఈ విషయంలో కార్మికులు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ప్రజా సంఘాలు, లెఫ్ట్ పార్టీలు మాత్రమే వారికి మద్దతుగా పోరాడుతున్నాయి. కేంద్రం తీరును ఎండగట్టడం లో సిఎం జగన్ ఎందుకనో భయపడుతున్నారు. . విశాఖ ఉక్కుపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సిఎం జగన్ ప్రధాని మోడీకి లేఖ రాసి చేతలు దులుపుకున్నారు. కేంద్రాన్ని ఇలదీసేంత బలం లేదని ఒప్పు కున్నారు. కేంద్రంలో మైనార్టీ ప్రభుత్వం ఉంటే తప్ప మనం నిలదీయలేమని రోక్షంగా అంగీకరించారు. అధికారంలో ఉన్నందున కేంద్రాన్ని నిలువరించే బాధ్యత నుంచి ఆ పార్టీ కూడా తప్పుకోజాలదు. నిజానికి దివంగత రాజశేఖర్ రెడ్డి లాంటివారు ఉండివుంటే ఇలా జరిగేదా అన్న ప్రశ్న వస్తోంది. ప్రధాని మోడీయే కాదు..సోనియాను కూడా ఎదరించే సత్తా ఉన్న నేత దివంతగ వైఎస్ మాత్రమే. ఆయన తనయుడిగా జగన్ ఆ సత్తా చాటలేకపోతున్నారు. కార్యనిర్వాహక రాజధాని పేరిట విశాఖ పట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ పునాదులను మరింత పటిష్ఠం చేసుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విశాఖ స్టీల్ సవాల్ కానుంది. విశాఖకు రాజధానిని తరలిస్తున్నట్లు చెబుతున్న సిఎం జగన్ విశాఖకు మకుటాయమానంగా ఉన్న విశాక ఉక్కు విషయంలో నిర్లిప్త ధోరణిలో ఉన్నారు. అయినా విశాఖకు రాజధాని తరలించలేక పోయారు. ఇప్పటికైనా వివిధ అంశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేంద్రంపై ఒత్తిడి పెంచితేనే జగన్‌పై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కేంద్ర నిర్ణయాన్ని ప్రతిఘటిస్తారా? లేక రాజీ పడిపోతారా? అన్నది తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.. ప్రత్యేక హోదాను అటకెక్కించినట్టుగా విశాఖ ఉక్కు విషయంలో కూడా మౌనంగా ఉండిపోతే జగన్‌కు



నష్టమే తప్ప లాభం లేదని గుర్తించాలి. ముఖ్యమంత్రి జగన్ బాటలోనే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కూడా కేంద్ర పెద్దలకు భయపడి విశాఖ ఉక్కు విషయంలో మెతక వైఖరి అవలంబిస్తే టిడిపికి కూడా పుట్టగతులు ఉండవు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల పక్షాన ముందుండి పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తెలుగుదేశంపై అధికంగా ఉంది. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికైనా రాజకీయ పార్టీలు విభేదాలు పక్కనపెట్టి ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలి. రాజధాని కూడా లేకుండా ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్‌కు రాజధాని కోసం రైతులు తమ భూములను త్యాగం చేస్తే, ఇప్పుడు వారిని ఎగతాళి చేస్తున్నారు. రాజధాని అమరావతి అంటే 29 గ్రామాల ప్రజల సమస్యగానే చూస్తున్నారు. అలాగే అదేదో చంద్రబాబు భూ సమస్యగా చూస్తున్నారు. దీంతోపాటు కేంద్రంతో ఢీకొనలేని స్థితిలో సిఎం జగన్ ఉన్నారు. రాజధాని ఉన్నా లేకపోయినా ఒక్కటే అన్న ధోరణి కనిపిస్తోంది. దీంతో అమరావతి అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారింది. భూములిచ్చిన రైతులు చేస్తున్న పోరాటం అధికార పార్టీని కదిలించలేక పోతోంది. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా రాజధాని వ్యవహారం తమది కాదన్నట్లుగా ఉదాసీనంగా ఉంటున్నారు. అమరావతి తర్వాత పోలవరం ప్రాజెక్టు కూడా ఈ జాబితాలో చేరిపోయింది. పూర్తిస్థాయిలో రిజర్వాయర్ నిర్మించడానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి కేంద్రం ససేమిరా అంటున్నా, రాష్ట్ర ప్రభుత్వం కూడా నోరెత్తలేక పోతోంది. మొన్నటి బడ్జెట్‌లో సవరించిన అంచనాలపై మాటమాత్రంగా అయినా ప్రస్తావించలేదు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం అని చెప్పు కోవడమే తప్ప నేతలు అలా భావిస్తున్నట్టుగా లేదు. అమరావతికి, పోలవరానికి పట్టిన గతి తెలిసి కూడా ప్రజల్లో కనీసం చైతన్యం లేకపోవడాన్ని గమనించిన కేంద్రం ఇప్పుడు విభజన హామీలపై పెద్దగా స్పందించడం లేదు. బీజేపీ నాయకులకు కూడా ప్రధాన సమస్యలపై కేంద్రంతో పోరాడే ధైర్యం చాలడం లేదు. త్యాగాల పునాదుల మీద నిర్మించిన విశాఖ ఉక్కును అమ్మేస్తామని చెబుతున్నా బిజెపి నేతలు నోరు మెదపడం లేదు. కేందప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్నా పట్టించుకోవడం లేదు. జనసేన సహకారంతో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రబాబు సవాలు విసురుతున్న తరుణంలో ఈ మూడు ప్రధాన సమస్యలపై ఎలాంటి వైఖరి తీసుకోబోతున్నారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్య ఉంది.



## పాఠశాల సిబ్బందికి ఆర్థిక సహాయం అందజేసిన శ్రీరంగం ఫౌండేషన్...

**కూకట్ పల్లి వెలుతురు:** కెపిహెచ్బి కాలనీలోని పాఠశాల సిబ్బందికి గురువారం శ్రీరంగం ఫౌండేషన్ వారు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్ బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజ కుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు మరియు పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం ని కోరారు. అందుకు అంగీకరించిన సత్యం శ్రీరంగం తన శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్చిన మాట ప్రకారం జనవరి నెల వేతనాన్ని కూడా శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతులమీదుగా పాఠశాలలో అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మహిళా సమాఖ్య సంఘాల రిసోర్స్ పర్సన్స్ ప్రతినిధులు..

**శేర్లింగంపల్లి, వెలుతురు:**
శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని మహిళా సమాఖ్య సంఘాల రిసోర్స్ పర్సన్స్ (ఆర్.పి) ప్రతినిధులు పలు సమస్యలపై కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని వారి నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మహిళ సంఘాల సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రతి సమస్యను సత్వర పరిష్కారంకు కృషి చేస్తామని , మీకు ఎల్లవేళలో అందుబాటులో ఉంటానని తెలియచేసారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘాల ఆర్ పి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దారసాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

**కూకట్‌పల్లి, వెలుతురు:** బీజేవైఎం నాయకుడు దారసాయి జన్మదినం సందర్భంగా వివేకా నంద నగర్ కాలనీలోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు స్వగృహంలో గురువారం దారసాయి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో



సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయి, వివేకానందనగర్ డివిజన్ నాయకులు గోపాల్ రావు, వేణు, నాయినేని ప్రశాంత్ రావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

### - కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**శేర్లింగంపల్లి, వెలుతురు:** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్ టి ఆర్ నగర్ నుండి పీజేఆర్ నగర్ కు వెళ్లే సీసీ రోడ్డు కొరకు గతంలో యాభై లక్షల రూపాయల నిధులు మంజూరై, ఇప్పుడు పెండింగ్ నిర్మాణ పనులు జరుగుతున్న సీసీ రోడ్డును పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా



కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సిసి రోడ్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, సి.ఎచ్ భాస్కర్, పోశెట్టిగౌడ్, మహేష్, మహబూబ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.






# పారని జక్కా మంత్రం..!

- పెద్ద తలకాయ సహకారం లేనట్టేనా..?
- స్వంత వర్గంలో నమ్మకం కోల్పోయినట్టేనా..?
- అవిశ్వాసం ఇక ఆరని అగ్నిగోళమేనా..?
- మేయర్ కు ఇప్పుడు సోషల్ మీడియానే దిక్కా...?
- పెయిడ్ ఆర్టికల్స్‌తో రాజకీయాన్ని శాశించవచ్చా..?

**మేడిపల్లి, వెలుతురు:**
రాష్ట్ర రాజకీయాలు అన్ని ఒక లెక్క అయితే మేడ్చల్ జిల్లాలోని రాజకీయాలు ఇంకో లెక్క అన్నట్టే మారుతున్నాయి జిల్లాలోని రాజకీయ పరిణామాలు.. అవిశ్వాసం పేరుతో కార్పొరేటర్లు టూర్ల బాట పడుతున్నారు.. గతంలో కొంతమంది ఎమ్మెల్యేలను అక్కడి ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కార్పొరేటర్లను టూర్లు తిప్పిన విషయం విదితమే.. అలాగే ఇప్పుడు కూడా మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ లో బీఆర్ఎస్ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై స్వంత పార్టీ కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు.. అందులో భాగంగానే గత పది రోజుల నుండి టూర్ బాట పట్టారు. దానిని నిలువరించేందుకు మేయర్ జక్క వేసిన జిత్తులు, ఎత్తులు పారడం లేదు అనే గుసగుసలు వినిపిస్తున్నాయి.. కార్పొరేటర్ల మనసులో విశ్వాసం కోల్పోయిన జక్క వెంకట్ రెడ్డి కొత్త నాటకానికి తేర దించుతున్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి..

### పెద్ద తలకాయ సపోర్ట్ లేదు...

మేడ్చల్ రాజకీయాలలో సంచలనాత్మకంగా నిలిచిన మాజీ మంత్రి మల్లారెడ్డి సాదారణ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలయ్యాక ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. తన స్వంత నియోజకవర్గంలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో స్వంత పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య రోజు రోజుకు ముదురుతున్న అసమ్మతిని నిలువరించే ప్రయత్నం చేయకపోతున్నారు..
దీంతో మీరు మీరు తన్నుకు చావండి.. నాకేమి సంబంధం లేదు అనే రీతిలో ఎమ్మెల్యే వ్యవహార శైలీ ఉన్నదంటూ బీఆర్ఎస్ పార్టీ వర్గాలే గుసులాడుతున్నాయి. ఏది ఏమైనా రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామల నేపథ్యంలో మల్లారెడ్డి వ్యవహారం అచితూచి మాట్లాడే పరిస్థితికి మారిందనే చెప్పాలి. పీర్జాదిగూడ కార్పొరేషన్ లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆయన ఏ మాత్రం కార్పొరేటర్లతో మాట్లాడే ప్రయత్నం చేయకపోవడం.. అసమ్మతి కార్పొరేటర్లతో గోవా టూరేసినా అసమ్మతి తగ్గించకపోవాడం చూస్తుంటే మేయర్ వెంకట్ రెడ్డిపై మల్లారెడ్డికి కూడా నమ్మకం లేదా...? అనే వాదనలే ప్రజల్లో వినిపిస్తున్నాయి.

### తాను తప్పించుకోవడం కోసం.. ఇంకొకరికి పై తప్పుడు ప్రచారం..!

మేయర్ వెంకట్ రెడ్డి స్వంత పార్టీ కార్పొరేటర్ల చేత చీవాట్లు పెట్టించుకుని నోటి దూలతో అందరినీ దూరం చేసుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.. అసమ్మతి సమస్య నుండి తప్పించుకోవడానికి మేయర్ వెంకట్ రెడ్డి వేయని ఎత్తులు.. చేయని యత్నాలు లేవు, ప్రయాత్నాలు లేవు.. అందులో భాగంగానే ఒకప్పటి రాజకీయ గురువు, మేడ్చల్ రాజకీయాలలో కురవృద్ధుడైన మాజీ శాసనసభ్యుడు మలిపెద్ది సుధీర్ రెడ్డిపై తప్పుడు ప్రచారం చేసేందుకు సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నారనే విమర్శలు జోరుగా నడుస్తున్నాయి.. అందుకు ఒక పేయిడ్ బ్యాచ్ తో ప్రచారం మొదలు పెట్టాడంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.. మైలేజ్ వస్తుందని భావించిన మేయర్ కు సీన్ రివర్స్ అయ్యే సరికి కుడితిల పడ్డ ఎలుక తీరు అయింది అనుకుంటుర్రు ఇప్పుడు మేడ్చల్ జిల్లా రాజకీయం తెలిసిన ప్రజలు..

### అవిశ్వాసం ఇక ఆరని మంటేనా..?


కార్పొరేటర్ల మనోభావాలను దెబ్బ తీసిన మేయర్ వెంకట్ రెడ్డి ఎత్తులకు పై ఎత్తులు వేసిన అవిశ్వాసం తప్పదని మేయర్ వ్యతిరేక వర్గంగా ఉన్న కార్పొరేటర్లు బల్లగుద్ది చెప్తున్నారు. వెంకట్ రెడ్డి అవినీతి అక్రమాలపై మా పోరాటం అగదని, ఆయనను మేయర్ పీఠం నుండి దించేంత వరకు మా ప్రయత్నం ఆగదు అంటూ బహిరంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.. ఈ నేపథ్యంలో డబ్బులు ఇచ్చి సోషల్ మీడియాలో ఆయనకు అనుకూలంగా వార్తలు రాయించుకుంటున్నారు అంటూ విమర్శల జల్లు కురిపిస్తున్నారు కార్పొరేటర్లు.. దీంతో సొంతింటి గుట్టు గడప దాటక ముందే చూసుకోవాలి.. కానీ గడప దాటిన తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసినా నమ్మే పరిస్థితుల్లో ఎవ్వరూ లేరు అనేది ప్రజల్లో నుండి వినిపిస్తున్నా మాట.. మరి చూడాలి రాజకీయ కిరికిరి ఇంకా ఎంత దూరం పోతుంది.. ఎలాంటి మలుపులు తిరుగబోతుంది అనేటిది ముందు ముందు..

## నవాబుపెట్ మండలంలో వట్టి మీనపల్లి గ్రామంలో భారీ చోరీ

### తండ్రికి ఆరోగ్యం బాగులేదని ఆసుపత్రికి వెలితే అదును చూసి ఇంట్లో దొంగలు..!!

### 38 తులాల బంగారం, 40వేల వెండి,60 వేల నగదు చోరీ....!!

**నవాబుపెట్ (వెలుతురు న్యూస్):**
తండ్రికి ఆరోగ్యం బాగులేదని ఆసుపత్రికి వెలితే అదును చూసి ఇంట్లో దొంగలు ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలో ఉన్న నగదు సొమ్ము,బంగారం, వెండి దోచుకెళ్లిన సంఘటన నవాబుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టిమీనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.మోమిన్ పేట్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం నవాబుపేట మండల పరిధిలోని వట్టి మీనపల్లి గ్రామానికి చెందిన సుక్కమొల్ల చంద్రశేఖర్ రెడ్డి తండ్రి రాంరెడ్డి ఆరోగ్యం బాగాలేక బుధవారం చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చంద్రశేఖర్ భార్య సంధ్య ఇద్దరు పిల్లలు పుట్టింటికి వెళ్లారు.గురువారం తెల్లవారుజామున చంద్రశేఖర్ రెడ్డి వదిన సుక్కమల్ల రజిత ఉదయం ఇల్లు చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. తన మరిది చంద్రశేఖర్ రెడ్డికి



ఫోన్ చేసి విషయం తెలిపింది. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ రెడ్డి ఇంటికి వచ్చి చూస్తే సరికి ఇంట్లో దొంగలు పడ్డారని అర్థమైంది. మొత్తం సొమ్ము రూ. 60వేల నగదు,38తులాల బంగారం,40తులాల వెండి చోరి జరిగిందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇట్టి ఫిర్యాదు మేరకు మోమిన్ పేట్ సిఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.







## ఘనంగా బీసీసీ మినిస్ట్రీస్ 23వ వార్షికోత్సవ వేడుకలు...

**కూకట్ పల్లి వెలుతురు:** కూకట్ పల్లిలోని బీసీసీ మినిస్ట్రీస్ 23వ వార్షికోత్సవ వేడుకలు మూడు రోజులపాటు కనుల పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీవిత అర్ధం-పరమార్థం తెలుసుకోవడంలో హైటెక్ మనిషి తడబడుతున్నాడని భగవంతుడికి పూర్తి విధేయత చూపడమే దీనికి ఏకైక పరిష్కారమని ప్రముఖ సువార్తికులు రెవరెండ్ డాక్టర్ డేవిడ్ ప్రశాంత్ గొల్లపల్లి తెలిపారు. విధేయత పేరుతో మరో నాలుగు రకాల విధేయతలు ప్రత్యక్షమవుతుంటాయని డాక్టర్ డేవిడ్ గొల్లపల్లి వివరించారు. ప్రసిద్ధి విధేయత, పాక్షిక విధేయత, ప్రేక్షక విధేయత, ప్రేరిత విధేయత ఉచ్చుల్లో చిక్కుకోకుండా విధాతకు పూర్తి విధేయత చూపాలని సూచించారు. దేవుడు కనిపించి మాట్లాడాడు అంటూ పెద్ద పెద్ద వాళ్ళు సైతం చెబుతూ వుంటారని అవన్నీ హంబగ్ అని ఆయన తేల్చిచెప్పారు. క్రిస్టియన్ సమాజంలో నో అని చెప్పాల్సి వచ్చినప్పుడు, ప్రార్థన చేసి చెబుతామని అంటుంటారని డాక్టర్ గొల్లపల్లి చెణుకులు విసిరారు. ఈ కార్యక్రమంలో బీసీసీ సంఘ పెద్దలు హనోక్ ఆర్థర్, రత్నమయ్య, సతీష్ మంద్రుతో పాటు క్వయర్ టీమ్ భాద్యులు పాస్టరమ్మ జాలీ సామ్, హోలీ యూత్ టీమ్ డైరెక్టర్ జిన్నీ సామ్, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా క్రాంతికుమార్, ఇమ్మానుయెల్ ,జీ. సతీష్, సంజీవ్ చింతల ,అరుణ గాలెంక, జ్యోతిలత, శ్యామ్ బాబు , రత్న కుమారి, మేరీ, ఇంజినీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రేయర్ వారియర్స్ తో పాటు వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతిఒక్కరికీ బీసీసీ మినిస్ట్రీస్ అధ్యక్షులు, సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ విప్పర్తి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా హోలీ యూత్ టీమ్ ప్రదర్శించిన డ్యాన్స్ లు..స్పెషల్ సాంగ్స్ ఆహూతులను ఎంతగానో అలరించాయి. బీసీసీ క్వయర్ బృందం ఆలపించిన భక్తి గీతాలు మరింతగా ఆధ్యాత్మిక శోభను పంచిపెట్టాయి.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైన పామెన జ్యోతికి సన్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ

**నవాబుపెట్ (వెలుతురు న్యూస్):** రంగారెడ్డి జిల్లా నూతనంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికైన పామేనా జ్యోతి భీమ్ భరత్ కలిసి సన్మానించిన మాదిరెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. నవపేట్ మండల్ అడ్వకేట్ ఆనందం ప్రభావతి. మాదిరెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. సదానందం బుధవారం ఘనంగా సన్మానించారు. అనంతరం జ్యోతిబిమ్ భరత్ కు పుష్పగుచ్ఛం అందజేశారు. నాపై నమ్మకంగా ఉంచి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాకు జిల్లా ఉపాధ్యక్షురాలుగా. ఆకాశమిచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు నా మీద ఉన్నటువంటి నా ప్రజలకు నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ అవకాశం అప్పగిచినదుకు. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానని. మహిళల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేసి బాధ్యతలు స్వీకరించి పోరాడుతానని తెలిపారు.






## ఆదర్శ పాఠశాలలో లేడి వాచ్మెన్.. వంట మనుషుల పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం..

**వాచ్మెన్‌కు 10వ తరగతి విద్య అర్హత ఉండాలి...**

**ప్రధాన..అసిస్టెంట్ లేడి వంట మనిషికి పోస్టులకు 10వ.. 7వ తరగతి అర్హత ఉండాలి...**

**ఈ నెల 13న దరఖాస్తులకు చివరి తేదీ...**

**మండల విద్యాధికారి గోపాల్....**

నావాబుపేట్ (వెలుతురు న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలలో ఒక్క మహిళా నైట్ వాచ్మెన్ పోస్ట్,ఒక్క మహిళా ప్రధాన వంట మనిషి,ఇద్దరు మహిళా సహాయ వంట మనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని నవాబు పేట్ మండల విద్యాధికారి గోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా నవాబు పేట్ మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి విద్యా అర్హతతో ఒక్క మహిళా నైట్ వాచ్మెన్ పోస్ట్,అదే విధంగా పదవ తరగతి విద్య అర్హతతో ఒక్క మహిళా ప్రధాన వంట మనిషి, ఏడవ తరగతి విద్య అర్హతతో ఇద్దరు మహిళా సహాయ వంట మనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు.దరఖాస్తు చేసుకునే మహిళలు 18 నుండి 45 సంవత్సరాల వయసు కలిగి ఉండి ఈ ఉద్యోగం చేయాలని అనుకునే ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు తెలంగాణ ఆదర్శ పాఠశాల వికారాబాద్ జిల్లా నవాబుపేట్ హాస్టల్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయలని మండల విద్యాధికారి గోపాల్ తెలిపారు.

## నియోజకవర్గం ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్‌కి వినతిపత్రం ఇచ్చిన రిసోర్స్ పర్సన్స్‌ల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ

శేర్లింగంపల్లి, వెలుతురు: శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ని రీసోర్స్ పర్సన్స్ (ఆర్ పి)ల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ గురువారం నియోజకవర్గ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్‌ని వారి నివాసంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ



సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి సమస్యను సత్వర పరిష్కారంకు కృషి చేస్తానని మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు ఏకాంత్ గౌడ్, అల్వాల్ భాస్కర్, నాగరాజు, కవిత, సువర్ణ, రాధ, సరిత, తదితరులు పాల్గొన్నారు.


## ఐఏఎస్ అధికారి రమణాచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పిడికిటి గోపాల్..

కూకట్‌పల్లి, వెలుతురు: ఐఏఎస్ అధికారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాజీ సలహాదారులు కె.వి రమణాచారి జన్మదినం సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా



ఉపాధ్యక్షులు పిడికిటి గోపాల్ చౌదరి గురువారం రమణాచారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే మాధవరం సమక్షంలో ఘనంగా వలవల నాయుడు జన్మదిన వేడుకలు..



కూకట్ పల్లి వెలుతురు: కూకట్ పల్లి నియోజకవర్గం బీఆర్ ఎస్ పార్టీ స్థానిక నాయకులు వలవల నాయుడు జన్మదిన వేడుకలను గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వలవల నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ ఆరోరా వలవల నాయుడుకి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

# నవాబుపేట్ ఆదర్శ పాఠశాలలో గజ్జల శబ్దం వస్తుందంటూ విద్యార్థుల భయం..

నవాబుపేట్ (వెలుతురు న్యూస్): గత వారం రోజులుగా ఆదర్శ పాఠశాలలో గజ్జల శబ్దం వస్తుందంటూ భయం గుప్పెట్లో ఉన్న విద్యార్థులకు చివరకు ఊరట లభించిందినే చెప్పవచ్చు.ఇదే విషయంపై వాట్సప్ పలు గ్రూపుల్లో వచ్చిన ఎస్ఎంఎస్లను చూసిన విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి వికారాబాద్ జిల్లా నవాబుపేట



మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లోని బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినీలను, వార్డెన్,అక్కడ పనిచేసే ఉద్యోగులను హాస్టల్లో జరిగే వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఈ గజ్జల చప్పుడు భయం అనేది కేవలం హాస్టల్లో పని చేసే చంద్రమ్మ అనే వాచ్మెన్ సృష్టించిన కట్టు కథ నేనంటూ జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకాదేవి విచారణలో బయటపడడంతో వాచ్మెన్ విధుల నుంచి చంద్రమ్మను తొలగించినట్లు తెలుస్తుంది.చంద్రమ్మ ఆడిన నాటకంలో విద్యార్థినిలు బలవడమే కాకుండా కొందరికి జ్వరాలు రావడం,మరికొందరు ఇంటికి పరుగులు తీయడం జరిగిందని అధికారులు చెప్పుకొచ్చారు. ఏది ఏమైనా వాచ్మెన్ చంద్రమ్మను తొలగించిన కూడా






**హాస్టల్లో వచ్చే గజ్జల చప్పుడు మానేనా...?**

**లేదంటే ఇదే పునరావృత్తం అయ్యేనా..?**

అనేది తెలియాల్సి ఉంది.అదేవిధంగా జిల్లా విద్యాధికారిని రేణుకాదేవి విద్యార్థినుల్లో ఉన్నటువంటి భయాన్ని తొలగించేందుకు బుధవారం రాత్రి వారితో పాటే ఉంది అవగాహన చేసి విద్యార్థులతో కలిసి హాస్టల్లో నిద్రిస్తారని తెలిపారు.ఈ వసతి గృహాన్ని సందర్శించిన విచారణ చేసిన వారిలో ఎంపిడివో సుమిత్రమ్మ,ఎస్ఓ ఆశలత,వార్డెన్ నాగమణి,ప్రధాన ఉపాధ్యాయురాలు సత్యసిద్దార్థిని,విద్యార్థి సంఘ నాయకులు శ్రీహరి,ఉన్నారు.

## పార్టీ అధిష్టానం ఆదేశాలతో శేర్లింగంపల్లి నియోజకవర్గంలో

# అభివృద్ధి కోసం మరిన్ని నిధులు తీసుకువస్తాం...

**- వి.జగదీశ్వర్ గౌడ్**

కూకట్‌పల్లి, వెలుతురు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశనిర్దేశంలో ఇంచార్జ్ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని శేలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం జగదీశ్వర్ గౌడ్ కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ని కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదరనగర్, వివేకానంద నగర్, అల్విన్ కాలనీ మరియు కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని కాలనీ, బస్తిలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పక్క ప్రణాళికాలు సిద్ధం చేయాలని జోనల్ కమీషనర్‌ని కోరారు.



పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగుతుందని, శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భాను ప్రసాద్, నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కుల వెంకటేశ్వర రావు, కూన సత్యం గౌడ్, నల్ల సంజీవ రెడ్డి, నాగేశ్వరరావు, సిందాం శ్రీకాంత్, ఉప్పల విద్యాకల్పనా ఏకాంత్ గౌడ్, భాషిపాక నాగమణి యాదగిరి, మరెళ్ల శ్రీనివాస్, బసంత్ రాజ్, శిరీష్ సత్తూర్, అరుణ, ప్రభాకర్, ముకయ్య, వెంకటస్వామి సాగర్, ఆల్వాల భాస్కర్, పరుశురాం, శశి, దుర్గా రావు, వెంకటేష్, కావూరి ప్రసాద్, వెంకన్న, కొఠారి వెంకట్, వెంకన్న, ఏనాథ్, సాదిక్, ప్రభాకర్, దుర్గన్న, రాజు,వసీం,పల్నాటి అశోక్,ఎల్లారెడ్డి,కన్నా రావు,శివ, ఉదయ్ రావు,ఎస్పి పరుశురాం, రవి,వెంకటేష్,యూసఫ్, లక్ష్మి, శాంసన్, రాజు, స్వాతి, యమున తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి కోటలో బీజేపీ గెలుపు ఖాయం..

**దేశంలో మూడవసారి ప్రధాని మోడీ..**

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి**

వెలుతురు న్యూస్ నారాయణపూర్: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణపురం మండలం లోని సర్వే గ్రామంలో భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు గావ్ చలో అభియాన్ లో భాగంగా సర్వేలు గ్రామంలో ఇంటింటికి అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి విచ్చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు,రామ మందిరం నిర్మాణం,దేశంలో జాతీయ రహదారు,కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల, అభివృద్ధి,పాలన గురించి ప్రతి గడపకు తిరుగుతూ వివరించారు. సీనియర్ కార్యకర్తలను అంగన్వాడి ఉపాధి హామీ కూలీలను మోడీ పాలన పైన వారి అభిప్రాయ వివరాలను తెలుసుకున్నారు.

ప్రజల ఆధారణ చూస్తుంటే తిరిగి రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో 12 స్థానాలు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. మూడో సారి కూడా నరేంద్ర మోడీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చిన



కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజులలో ఇచ్చిన హామీలు ఏ విధంగా నెరవేస్తారన్నారు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర నరసింహ, నందగిరి జగత్, గంట నరసింహ, గుండా మల్లేష్,శ్రీను,వంగరి రఘు,దేవేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టియుసి ఫెడరేషన్‌పై అనవసర వాదనలు చేస్తే లీగల్ చర్యలంటాయి..!

**రిజిస్ట్రేషన్ ఎవరికి ఉందో ప్రక్షాళన చేసుకోండి..!**

**రిజిస్ట్రేషన్ పరిధిపై కూడా మీ నాయకులను అడిగి తెలుసుకోండి...!**

**మరోసారి ఇలాగే ప్రవర్తిస్తే లీగల్‌గా చర్యలుంటాయి..!**

**కనీస జ్ఞానంలేని వారు కూడా ఇలా మాట్లాడరేమో..!**

**ట్రేడ్మార్క్ రిజిస్ట్రేషన్ కలిగిన ఏకైక INTUC మా ఫెడరేషన్ మాత్రమే..!**

**గత పది సంవత్సరాలనుండి కనుమరుగైన మీరా మా గురించి మాట్లాడేది...!**

**భారత్ జోడోలో మీరు ఎక్కడ ఉన్నారు..?**

**మా మాజీ అధ్యక్షులు ఎల్కచెను సాయిబాబా ఆధ్వర్యంలో తెలంగాణ మొత్తం జోడో యాత్ర లో మేమున్నాం..!**

**ఏదైనా యూనియన్‌కు అధ్యక్షుల పదవి కాలం రెండు లేదా మూడేళ్లు...!**

**మరి మీ అధ్యక్షుల స్వంత జాగీరు లాగా ఎలా ఇన్నేళ్లు నెట్టుకొస్తున్నారు..!**

**జాగ్రత్తగా మేసులుకోండి..! మమ్మల్ని గెలకవద్దు..!**

**అంటున్న ఐఎన్టియుసి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్ధారం**




వెలుతురు హైదరాబాద్ 08, 2024: వివరాల్లోకి వెళితే ఖమ్మం జిల్లాలో కొందరు వ్యక్తులు తాడుబొంగరం లేని అవస్థవాలతో అవగాహన లేమితో కొన్ని విషయాలు ప్రస్థావిస్తూ ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ కు రిజిస్ట్రేషన్ లేదంటూ పుట్టుకొచ్చాయంటూ, పెట్టుకొచ్చాయంటూ వాళ్లే సృష్టికర్త అయినట్టు రకరకాల వాక్కులు చేవాక్కులు పేలటం చూస్తూ ఉంటే చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుంది. వాస్తవాలు తెలుసుకోకుండా, ఏం జరుగుతుందో అనేటువంటి విషయంపై కనీస అవగాహన లేకుండా గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కనుమరుగైనవారు ఇప్పుడు ప్రభుత్వం వచ్చిందని రెచ్చిపోవటం చూస్తుంటే తాతకు దగ్గర నేర్పిన పరిస్థితి కనిపిస్తుంది. గత పది సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కార్మికుల పక్షాన ప్రశ్నించలేని వీళ్లు మమ్మల్ని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. తోటి కార్మికులను, కార్మిక నాయకులను హేళన చేస్తూ మాట్లాడటం వారికి తగదు. కావున వాస్తవ ధోరణితో మెలగాలని ఐ ఎన్ టి యు సి వ్యవహారంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడటం సమంజసం కాదని వాస్తవాలను గ్రహిస్తూ నడుచుకోవాలని కార్మికుల కోసం శ్రమించే వారితో కలిసి రావాలని రాష్ట్ర అధ్యక్షులుగా పిలుపునివ్వడం జరుగుతుంది. గత తెరాస ప్రభుత్వం పై, అలాగే రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్రలో మా ఐఎన్టియుసి ఫెడరేషన్ పాత్ర ఆధారాలతో సహా చూపుతాం. ఇలా ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా మా కృషి ఏవిధంగా ఉందో ఆధారాలతో చూపుతాం. అంతేకానీ నోటికి వచ్చినట్టుగా వాస్తవాలను గ్రహించకుండా పుట్టుకొచ్చాయంటూ మాట్లాడటం సమంజసం కాదు. కావున కావున తోటి కార్మిక నాయకులుగా కలిసి వస్తే కలుపుకుపోతాం. లేదా మీ ఆధ్వర్యంలో మీ కార్యక్రమాలు చేపట్టండి మా ఆధ్వర్యంలో మా కార్యక్రమాలు చేపడతాం. అంతే తప్ప అనవసరమైనటువంటి వాగ్వాదాలకు చోటివ్వొద్దని సూచిస్తున్నామని రాష్ట్ర ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా హితవు పలుకుతున్నామని డాక్టర్ ముర హరి బుద్ధారం ఒక ప్రకటనలో తెలియజేశారు.





# బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం

## కేంద్రంలో మూడోసారి బిజెపి ప్రభుత్వం ఏర్పడడం ఖాయం : బిజెపి సీనియర్ నాయకులు డిసిసిబి మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 08 :** మెదక్ జిల్లా :- శంకరంపేట్ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని బిజెపి సీనియర్ నాయకులు డిసిసిబి మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి అన్నారు.. గురువారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆయనను మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కోణం విఠల్ తదితరులు శాలువాలతో సన్మానించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని.. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్యకర్తలు నాయకులు వివరించాలని పేర్కొన్నారు.. ప్రధానమంత్రి మోడీ భారత దేశపు గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పారని వివరించారు.. బడుగు బలహీన పేద వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని.. వాటిని ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపొందేందుకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లో బిజెపి గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్.. నాయకులు బండల శ్రావణ్ కుమార్.. అనిల్ విజయ్ కుమార్.. సుభాష్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్

**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 08 :** మెదక్ జిల్లా శంకరంపేట్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు.. బుధవారం గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు.. భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు..

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపు కోసం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో కూడా బిజెపి నాయకులు గావ్ చలో అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు బండల




శ్రావణ్ కుమార్.. అనిల్ . మంగలి కృష్ణ.. రాజుపటేల్ సుదాకర్ బాబు విజయ్ సుభాష్ బుగడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 08:** కరీంనగర్ నగర సంస్థ ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కు డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ వినతి పత్రం సమర్పించారు.

ప్రధానంగా తీగల గుట్టపల్లి గ్రామపంచాయతీ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమై నాలుగు సంవత్సరాలైనా నేటికీ డివిజన్ ప్రజలకు తాగునీరు అందలేని దయనీయ పరిస్థితి ఉందని కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా డివిజన్లోని సరస్వతి నగర్ త్రాగునీటి సమస్య ఇబ్బందికరంగా మారిందని,. గత నాలుగు సంవత్సరాలుగా తన సొంత డబ్బులతో ట్యాంకర్ల ద్వారా ప్రతి వేసవికాలంలో ప్రజలకు



మంచినీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. డివిజన్లో ఇంతవరకు పైప్ లైన్ పనులు ఇంకా పూర్తి చేయలేదని, పైప్ లైన్ పూర్తిచేసిన వీధులలో కనీసం తాగునీరును అందించడం లేదన్నారు. గతంలో 24 గంటలు మంచినీటిని ఇస్తామని చెప్పిన నేటి కి ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారని, ఒకటో డివిజన్లో ఒక గంట కూడా తాగునీటిని ఇచ్చే పరిస్థితిలో నగరపాలక సంస్థ లేదని , కనీసం ఇప్పటికైనా పైపులైను డివిజన్లో పూర్తి చేసి ఈ వేసవి కాలం లోపు మంచినీటిని ప్రజలకు అందించడానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను , కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ వినతి పత్రం ద్వారా కోరారు.



### అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల మరియు కళాశాల

# ప్రవేశాలకు దరఖాస్తుల గడువు తేదీ పెంపు

**జహీరాబాద్, 08 ఫిబ్రవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ మైనార్టీ బాలుర పాఠశాలలో మరియు కళాశాల యందు వచ్చే విద్యాసంవత్సరానికి గాను 2024-2025 సంబంధించి ఐదవ తరగతి లో ప్రవేశాలకు మరియు 6,7,8 తరగతులలో మైనార్టీ బ్యాక్లాగ్ ఖాళీలకు అదేవిధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ మరియు బైపీసీ గ్రూపులకు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తుల గడువు తేదీని ఫిబ్రవరి 15 వరకు పొడిగించ బడిందని ప్రిన్సిపాల్స్ జె. రాములు, కే.ఎస్. జమీల్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్గోల్ మైనారిటీ బాలుర కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (సీవోఈ)లో నీట్ మరియు ఎన్డీఎ కోర్సుల్లో చేరుటకు అర్హత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ద్వార విద్యార్థులను ఎంపిక చేయడం జరుగు తుంది.

5వ తరగతి నందు మైనార్టీ సీట్లు-51, క్రిస్టియన్-5, జైన్, పార్సి , బుద్ధులు మరియు సిక్కులు-4 సీట్లు మరియు నాన్ మైనార్టీ విద్యార్థులకు మొత్తం-20 సీట్లు (బీసీ-10, ఎస్సీ-05, ఎస్టీ-03,ఓసీ-02) కలవు. ఈ ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా (www.tmreis.telangana.gov.in) లేదా TMREIS మొబైల్ యాప్ ద్వారా గాని నేరుగా పాఠశాల లేదా కళాశాలలకు వెళ్లి ఫిబ్రవరి 15 తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల మరియు కళాశాల యందు నేరుగా వెళ్లి సంప్రదించ గలరు. లేదా మరింత సమాచారం కోసం క్రింది నంబర్లను సంప్రదించగలరని అర్హత గల విద్యార్థుల తల్లిదండ్రుల ను కోరడం జరిగింది.

7013109493, 9398594852, 9160203558, 9573574777, 7893428976, 8897350937, 9121036974, 9885774573





### బిజెపి విజయ సంకల్ప

# యాత్ర సమావేశం

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 08:** బిజెపి విజయ సంకల్ప యాత్ర సంబంధించి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రధాన కార్యదర్శిలు దుగ్గల ప్రదీప్ కుమార్, ప్రేమేందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, కట్టా సుధాకర్ రెడ్డి అధికార ప్రతినిధి , ఉమాశంకర్ ఆఫీస్ కార్యదర్శి, బొక్క బాల్ రెడ్డి శాతవాహన క్లస్టర్, శ్రీ వర్ధన్ రెడ్డి బద్దం మహిపాల్ రెడ్డి, భరత్ గౌడ్, శ్రీనివాస్ నాయుడు, విజయ తులసి, బిందు, హైందవి, రంజిత్ రెడ్డి , మల్లికార్జున్ పటేల్, శ్రీనివాస్, విజయ సంకల్పయాత్ర 5 క్లస్టర్ సంబంధించిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



### వెలుతురు పేపర్

# క్యాలెండర్ ఆవిష్కరణ

**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 08 :** మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట్ మండలంలో వెలుతురు క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. కార్యక్రమంలో శంకరంపేట్ మండల బిజెపిఅధ్యక్షుడు కోణం విఠల్ పాల్గొన్నారు వారితో పాటుగా బిజెపి కార్యకర్తలు హాజరయ్యారు.

# బర్దిపూర్ గ్రామంలో 11 నుంచి ఇమామ్ దర్గా ఉత్సవాలు

**జహీరాబాద్, 08 ఫిబ్రవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామంలోనీ పురాతన స్వయంభుగ వెలసిన హజరత్ షానూరే ఇమామ్ దర్గా గంధం ఉత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



ఆదివారం సర్కారీ గంధం, సోమవారం దీపారాధన, సంగీత కళాకారులచే కావాలి తోపాటు రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్గాకు మొదటిసారి ఉత్సవాలు నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా గురువారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని గ్రామస్తులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోట ఆశన్న, రమేష్ పాటిల్, నాగన్న పాటిల్, చాకలి శ్రీనివాస్, దత్తు స్వామి, ఖదీర్, యాదుల్, వడ్ల నాగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గృహ జ్యోతి పథకం 200 యూనిట్ల ప్రక్రియ ప్రారంభం

### జహీరాబాద్ విద్యుత్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు కేంద్రం

**జహీరాబాద్, 08 ఫిబ్రవరి, వెలుతురు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహ జ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పథకంలో భాగంగా తమ తమ సర్వీసు నంబరు, రేషన్ కార్డు నంబరు, ఆధార్ కార్డు నంబరు, ఫోన్ నంబర్ మరియు ప్రజాపాలన అప్లికేషన్ నంబర్లను తేది : 09.02.2024



నుండి 12-02-2024 వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జహీరాబాద్ పట్టణములోని విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందజేయగలరని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ విద్యుత్తు శాఖ అధికారులు గురువారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. అదేవిదంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కౌంటర్లు తెరిచి ఉంటాయని వారు అందులో పేర్కొన్నారు.

# బండి వెంకటయ్య యాదవ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**నంగునూరు మండలం, వెలుతురు ఫిబ్రవరి08:** నంగునూర్ మండలం గణపురం గ్రామానికి చెందిన యదవ సంఘం జిల్లా నాయకులు మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్య యాదవ్ మృతి పట్ల నంగునూర్ మండల యదవ సంఘం నాయకులు ప్రగాడ సానుభుతి తెలిపారు.

వారు మాట్లాడుతూ బండి వెంకటయ్యని దారుణంగా హత్య చెసి చంపేసారు కాబట్టి హత్య కేసు పై సమగ్ర విచారణ జరిపి నిందితులు ఎంతటి వారైన కఠిణంగా శిక్షించాలని



నంగునూర్ మండలం యదవ సంఘం అద్వర్యంలో పోలిసు శాఖను డిమాండ్ చేస్తున్నాం...

ఈ కార్యక్రమంలో నంగునూరు మండల యాదవ సంఘం అధ్యక్షులు వడితం కిరణ్ కుమార్ యాదవ్ మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ వర్ధోలు వేణు చక్రవర్తి మాజి ఆధ్యక్షులు గుండెలి రాజయ్య పరమాండ్ల మల్లేశం చెలికాని మల్లేశం బోల్లు తిరుపతి ఉల్లి చిన్న మల్లయ్య బొల్లు రవి కందబోయిన మల్లేశం తదితులున్నారు.



# జైలులో మహిళా ఖైదీలకు గర్భం

## తీవ్రమైన సమస్యన్న కలకత్తా హైకోర్టు

**కలకత్తా,ఫిబ్రవరి8(వెలుతురు):** జైలులో ఉన్న మహిళా ఖైదీలు జైలులోనే గర్భం దాలుస్తున్నారని కలకత్తా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. కస్టడీలో ఉన్న సమయంలోనే మహిళా ఖైదీలు గర్భం దాల్చినట్లు కోర్టుకు సమాచారం అందినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమస్య తీవ్రమైనదిగా పరిగణిస్తున్నట్లు కోర్టు వ్యాఖ్యానించింది. ఇప్పటి వరకు జైళ్లలో కనీసం 196 మంది శిశువులు జన్మించారని పిల్ దాఖలు చేసిన వ్యక్తి హైకోర్టుకు తెలియజేశారు. జైలు లోపల భద్రతను పర్యవేక్షించాలని కోర్టును కోరారు. మహిళా ఖైదీలు ఉండే ఎన్‌క్లోజర్లలో, కరెక్షన్ హోమ్స్‌లో పురుష ఉద్యోగులను పూర్తిగా నిషేధించాలని కోరారు. చీఫ్ జస్టిస్ టిఎస్ శివజ్ఞానం మరియు జస్టిస్ సుప్రతిమ్ భట్టాచార్యలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని 'తీవ్రమైన సమస్య'గా పేర్కొంది. ఈ విషయాన్నింటినీ క్రిమినల్ కేసులు విచారించే బెంచ్‌కి బదిలీ చేయడం సరైందని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. జైలులో ఉన్న మహిళా ఖైదీలు గర్భం దాల్చడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్లోని వివిధ జైళ్లలో 196 మంది చిన్నారులు ఉన్నారని అమికస్ క్యూరీ హైకోర్టుకు తెలిపారు. ఇటీవల, తాను కరెక్షన్ హోమ్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్(స్పెషల్), లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శితో మహిళా కరెక్షన్ హోమ్స్‌ని సందర్శించిన సమయంలో ఒక గర్భవతితో పాటు, 15 మంది ఇతర మహిళా ఖైదీలు వారి పిల్లలతో ఉన్నట్లు కనుగొన్నానని, వారంతా జైలులో జన్మించారని కోర్టుకు వెల్లడించారు. దీనిపై సోమవారం మరోసారి విచారణ జరిగే అవకాశం ఉంది.

# మహారాష్ట్ర కాంగ్రెస్‌కు వరుస షాకులు

## కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మాజీ మంత్రి రాజీనామా

**మహారాష్ట్ర,ఫిబ్రవరి8(వెలుతురు):** మహారాష్ట్ర కాంగ్రెస్‌కు వరుస షాకులు తగులుతున్నాయి. కేంద్రంలో వరుసగా పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉండడంతో పాటు సాధారణ ఎన్నికల్లో మళ్లీ గెలిచే అవకాశం లేకపోవడం, రాష్ట్రంలో బీజేపీ కూటమికి ఎదురులేకపోవడంతో పార్టీ సీనియర్ నాయకులు ఒక్కొక్కరిగా తమదారి తాము చూసుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం మాజీ మంత్రి మిలింద్ దేవరా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పగా.. మరో సీనియర్ నాయకుడు బాబా సిద్ధిక్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 48 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా ఉన్న ఆయన.. ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. "నేను యుక్తవయసులో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరాను ఇది 48 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం. ఈ రోజు నేను భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తక్షణమే రాజీనామా చేస్తాను. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను." అని ట్విట్టర్‌లో ప్రకటించారు.మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని పార్టీలో సిద్ధిక్ చేరతారని భావిస్తున్నట్లు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నాయకులు చెప్పిన కొద్ది రోజులకే గురువారం నాటి పరిణామం జరిగింది. ఫిబ్రవరి 1న ఎన్సీపీ నాయకుడు అజిత్ పవార్‌తో సిద్ధిక్, ఆయన కుమారుడు ఎమ్మెల్యే జీషన్ భేటీ అయిన తర్వాత ఎన్‌సీపీ నేతలు ఈ ఊహాగానాలు చేశారు. బాంద్రా వెస్ట్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సిద్ధిక్ మాజీ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన మహారాష్ట్ర హౌసింగ్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ముంబై విభాగానికి ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. ఆయన విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. మొదట బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌కు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యాడు.సిద్ధిక్ 1999, 2004 మరియు 2009లో బాంద్రా వెస్ట్ నియోజకవర్గం నుంచి మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ముంబై బీజేపీ అధ్యక్షుడు ఆశిష్ షెలార్ చేతిలో ఓడిపోయారు.

# ఢిల్లీ సరిహద్దుల్లో మహాధర్నా..

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు):** పంజాబ్ రైతులు ఫిబ్రవరి 13, మంగళవారం ఢిల్లీ సరిహద్దుల్లో తలపెట్టిన మహాధర్నా నిరసనని ఆపేందుకు కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, అర్జున్, నిత్యానంద రాయ్ చంఢీగడ్ తరలివెళ్లారు. అక్కడ రైతు నేతలతో పరిష్కారం కోసం చర్చలు జరుపుతారని సమాచారం. మూడేళ్ల క్రితం వ్యవసాయం చట్టాలను వ్యతిరేకిస్తూ.. పంజాబ్ రైతులు నెలల తరబరి చేసిన ధర్నా వల్ల మోదీ ప్రభుత్వం చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. మరో మూడు నెలల్లో లోక్ సభ ఎన్నికల దృష్ట్యా మరోసారి అలాంటి ధర్నా జరగకుండా ఉండేందుకు బీజేపీ మంత్రులు.. రైతుల వద్దకు చర్చలు జరిపేందుకు పరుగులు తీశారు. కనీస మద్దతు ధర కోసం ప్రత్యేక చట్టం, పంట బీమా, రైతు బీమాలు ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్లు కోసం ఢిల్లీ సరిహద్దులలో రైతులు ఫిబ్రవరి 13న రైతు ట్రాక్టర్ మార్చ్ నిరసన భారీ స్థాయిలో చేపట్టనున్నారు. అలాగే 2020లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చేసిన ధర్నాలో రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఢిల్లీ-నోయిడా సరిహద్దులో రెండు రోజులుగా ఉత్తర ప్రదేశ్ రైతుల నిరసన జరుగుతోంది. ప్రభుత్వం తీసుకున్న తమ భూములకు బదులుగా పరిహారం పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఢిల్లీ మెట్రో స్టేషన్‌లో ప్రమాదం

## కూలిన ప్లాట్‌ఫారమ్ సైడ్ వాల్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు):** ఢిల్లీ మెట్రో గోకుల్‌పురి స్టేషన్‌లో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. గోకుల్‌పురి మెట్రో పింక్‌లైన్ స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్ సైడ్ వాల్‌లో కొంత భాగం కూలిపోయి రోడ్డుపై పడింది. ఉదయం సమయం కావడంతో మెట్రో స్టేషన్ దిగువన వెళ్లే రోడ్డుపై జనం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ప్లాట్ పారమ్ సైడ్ వాల్



కూలిపోవడంతో భయాందోళనకు గురి అయ్యారు. శిథిలాలలో ఒకరు చిక్కుకోగా, 3 నుంచి 4 మందికి గాయాలైనట్లు వార్తలు కూడా వస్తున్నాయి. ఘటనా సమయంలో స్కూటర్‌పై వెళుతున్న వ్యక్తి శిథిలాల కింద చిక్కుకున్నారు. కొందరి సహాయంతో పోలీసులు బయటకు తీశారు. క్షతగాత్రులను జీటీబీ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను గుర్తించేందుకు చర్యలు చేపట్టి మరింత సమాచారం సేకరిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే జేసీబీ, క్రేన్ సహాయంతో శిథిలాలను తొలగించారు. ఈ ఘటనపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నామని ఉత్తర ఢిల్లీ డీసీపీ తెలిపారు. అదే సమయంలో, ఈ ప్రమాదం తర్వాత, మెట్రో యొక్క కొత్త మార్గాలలో పింక్ రూట్ ఒకటి కాబట్టి నిర్మాణ పనుల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

## దాడుల్లో హిజ్బుల్లా కమాండర్ హతం

**బాగ్దాద్,ఫిబ్రవరి8(వెలుతురు):** ముగ్గురు సైనికుల మరణం తర్వాత ఇరాన్ అనుకూల మిలీషియాపై అమెరికా రక్తపాత దాడులను కొనసాగిస్తోంది. తాజా దాడిలో, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో డ్రోన్ దాడిలో కారులో ప్రయాణిస్తున్న ఇరాన్ అనుకూల ఖతైబ్ హిజ్బుల్లా టాప్ కమాండర్‌ను అమెరికా చంపేసింది. హిజ్బుల్లా కమాండర్‌పై ఈ దాడికి అమెరికా తన రహస్యహెల్‌ఫైర్ క్షిపణిని ఉపయోగించిందని సమాచారం. ఈ క్షిపణితో అమెరికా అల్‌ఖైదా నాయకుడు అమాన్ అల్ జవహిరిని హతమార్చింది. ఈ క్షిపణికి కత్తిలా కనిపించే బ్లేడ్‌ను అమర్చినట్లు సోషల్ మీడియాలో షేర్ చేసిన చిత్రాలు చూపిస్తున్నాయి. ఇరాక్‌లోని మిలిటెంట్ల స్థావరాలపై బుధవారం జరిపిన డ్రోన్ దాడిలో ఇరాన్ మద్దతున్న ఓ కీలక కమాండర్ హతమైనట్లు అమెరికా సైన్యం ప్రకటింది. జోర్డాన్‌లో ఇటీవల ముగ్గురు అమెరికా సైనికుల మరణానికి ప్రతీకారంగానే తాము ఈ దాడి చేశామని వివరించింది.యూఎస్ దళాలపై దాడికి ప్రణాళిక, దాడికి కతైబ్ హిజ్బుల్లా కమాండర్ ప్రత్యక్ష బాధ్యత వహిస్తారని యూఎస్ మిలిటరీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ దాడిలో పౌరులెవరూ చనిపోలేదని అమెరికా తెలిపింది. ఈ ఘటనలో సామాన్య పౌరులు మరణించిన ఆనవాళ్లు లేవని ఓ సైనికాధికారి వెల్లడించారు. కేవలం కారు మాత్రమే దగ్ధమైనట్లు చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బహుశా ఆర్9ఎక్స్ అనే



హెల్‌ఫైర్ రకం క్షిపణిని ఉపయోగించి ఉంటారని ఓ అమెరికా మాజీ సైనికాధికారి తెలిపారు. పేలుడు తీవ్రత ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2020లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక కమాండర్ ఖాసీమ్ సులేమానీని సైతం అమెరికా ఇదే తరహాలో హతమార్చింది.రహస్య క్షిపణి గురించి అమెరికా చెప్పలేదు.. ది డ్రైవ్ నివేదిక ప్రకారం.. అమెరికా %=9ఖ% క్షిపణిని ఉపయోగించింది. దానికి బ్లేడ్లు జోడించబడ్డాయి. సరిగ్గా అలాంటి దాడుల కోసమే ఈ క్షిపణిని రూపొందించారు. అందులో అమర్చిన బ్లేడ్ కారులో లేదా ఇతర వాహనంలో కూర్చున్న లక్ష్యాన్ని చంపేస్తుంది. ఇది పరిసరాలకు చాలా తక్కువ నష్టం కలిగిస్తుంది. బరాక్ ఒబామా హయాంలో ఈ క్షిపణి తయారు చేయబడింది. ఈ క్షిపణి విషయంలో అమెరికా ఇంకా మౌనంగానే ఉంది. యూఎస్ మిలిటరీ అనేక ఇతర రకాల హెల్‌ఫైర్ క్షిపణుల ఉనికిని బహిరంగంగా అంగీకరించింది. ఈ క్షిపణులను డ్రోన్ల నుంచి మాత్రమే ప్రయోగిస్తారు. దీనిని అమెరికన్ స్పెషల్ ఆపరేషన్స్ ఫోర్స్ లేదా %జ×ూ% నిర్వహిస్తుంది. ఈ క్షిపణి సాయంతో అమెరికా ఇప్పటి వరకు అల్ ఖైదాతో పాటు పలువురు ఉగ్రవాదులను మట్టుబెట్టింది. నివేదిక ప్రకారం, 2022 సంవత్సరంలో, సీఐఏ ఈ క్షిపణి ద్వారా అల్ ఖైదా టాప్ కమాండర్ అమాన్ అల్ జవహిరిని చంపింది.

# ఎస్సీ వర్గీకరణకు కేంద్రం మద్దతు

## వివక్షకు గురైన వర్గాలకు న్యాయం జరగాలి

## ఏకగ్రీవంగా సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు):** తమ విభేదాలను పక్కనబెట్టి, షెడ్యూల్డ్ కులాల కోటాలో రిజర్వేషన్లు నిరుపేదలు, అత్యంత బలహీన వర్గాలకు రిజర్వేషన్లలో ఎక్కువ వాటాను అందజేస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బుధవారం ఏకగ్రీవంగా సుప్రీంకోర్టుకు తెలిపాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరించాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్రం అభిప్రాయపడింది. సామాజిక స్థితిని మెరుగుపడిన వ్యక్తులు రిజర్వేషన్‌లో ఎక్కువ వాటా పొందకుండా నిరోధించబడతారని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్ల ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదన్న 2004 నాటి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసును అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, సీనియర్ న్యాయవాదులు వాదించారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్ల ఉపవర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమేనని చిన్నయ్య తీర్పు పేర్కొంది. ఆర్టికల్ 341 ప్రకారం ప్రెసిడెన్షియల్ లిస్ట్‌లో చేర్చిన ఎస్సీ, ఎస్టీ జాబితాల్లోని కులాల్లో మార్పులు, చేర్పులు చేసే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని చిన్నయ్య తీర్పు స్పష్టం చేసింది. అయితే, 2004 తీర్పులో లోపాలున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఎస్సీ జాబితాలోని కులాల్లోనూ ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన వ్యత్యాసాలు ఉన్నాయని వెల్లడించారు. వారిలోనూ



బాగా వెనుకబడిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు దక్కేలా రిజర్వేషన్లను సహేతుకంగా పునఃపంపిణీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని తుషార్ మెహతా వివరించారు. విస్తృత ధర్మాసనంలో జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్ర, జస్టిస్ సతీశ్ చంద్ర మిశ్ర సభ్యులుగా ఉన్నారు. చిన్నయ్య తీర్పు షెడ్యూల్డ్ కులాల మధ్య తీవ్ర అసమానతలను విస్మరించిందని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి అన్నారు. కేంద్రం, పార్లమెంటు ఒక వర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చిన తర్వాత, సమూహాల మధ్య కోటాను హేతుబద్ధీకరించడం ద్వారా ఈ వర్గాల మధ్య అసమానతలను తొలగించడానికి చర్యలు తీసుకునే స్వేచ్ఛను రాష్ట్రాలకు ఇవ్వాలని అటార్నీ జనరల్ అన్నారు.ఎస్సీ వర్గాల ఉప-వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడంపై సందిగ్ధతకు ఆస్కారం లేకుండా చేస్తూ, వందల ఏళ్లుగా వివక్షకు గురవుతున్న వారికి సమానత్వం కల్పించేందుకు వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్‌ను కేంద్రం నిశ్చయాత్మక చర్యగా పరిగణిస్తోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. రిజర్వేషన్ విధానాన్ని ప్రకటించేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్రం తరఫున తుషార్ మెహతా సుప్రీంకోర్టులో తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య స్థాయిలను అనుసరించి ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని అన్ని కులాలు ఏకస్థితిని కలిగి ఉన్నాయని భావించలేమని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఓ ప్రత్యేక ప్రయోజనం కోసం రాజ్యాంగంలో ఈ రెండు వర్గాలు సజాతీయతను కలిగి ఉన్నాయని పేర్కొన్నారని.. అన్నింటిని దానికి వర్తింపజేయలేమని పేర్కొంది. ఈ కోణంలో 2004 తీర్పులోని అంశాలను పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం వెల్లడించింది. రాష్ట్రాల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఆయన కూడా అణిచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లోని కులాల మధ్య కూడా సమానత్వానికి కృషి జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీల్లోని అన్ని సామాజిక వర్గాల స్థితిగతులు ఒకే తీరుగా ఉన్నాయని చెప్పలేమని తెలిపారు. ఈ విషయంపై ఇవాళ(గురువారం) కూడా సుప్రీంకోర్టులో విచారణ కొనసాగనుంది.

# భారత్‌లో తైవాన్ కంపెనీ రూ.1200కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు):** తైవాన్ అతిపెద్ద కంపెనీ ఫాక్స్‌కాన్ భారతదేశానికి కొత్తేమీ కాదు. ఆపిల్ అతిపెద్ద తయారీదారు ఫాక్స్‌కాన్ భారతదేశంలో తన పట్టును మరింత బలంగా స్థాపించడానికి ప్రయత్నిస్తోంది. దీని కోసం కంపెనీ భారతదేశంలో సెమీకండక్టర్ వ్యాపారంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకుంది. దీని కోసం కంపెనీ మొదట వేదాంతతో భాగస్వామిగా ఉంది, కానీ తరువాత ఫాక్స్‌కాన్ వేదాంతను విడిచిపెట్టవలసి వచ్చింది. ఇప్పుడు వచ్చిన వార్త చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఫాక్స్‌కాన్ దేశంలోని అతిపెద్ద దాతృత్వ సంస్థతో చేతులు కలిపింది. సెమీకండక్టర్ చిప్‌లపై ఫాక్స్‌కాన్‌తో కలిసి ఎవరి కంపెనీ పని చేస్తుంది. ఫాక్స్‌కాన్ కూడా తన ఫ్యాక్టరీని స్థాపించడానికి 1200 కోట్ల రూపాయల పెట్టుబడిని ప్రకటించింది. దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త, దాతల సంస్థతో కలిసి ఫాక్స్‌కాన్ 'సెమికాన్'పై పని చేస్తుంది. రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం, తైవానీస్ ఎలక్ట్రానిక్స్ మేజర్ ఫాక్స్‌కాన్ భారతదేశంలో హెచ్‌సిఎల్ గ్రూప్ భాగస్వామ్యంతో చిప్ అసెంబ్లీ, టెస్టింగ్ ప్లాంట్‌ను నిర్మించడానికి బిడ్‌లను ఆహ్వానించింది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రారంభ పెట్టుబడిగా రూ.1,200 కోట్లు వెచ్చించాలని కంపెనీ నిర్ణయించింది. ఇప్పటికే కొనుగోలు చేసిన సొంత స్థలంలో ప్లాంట్‌ను ఏర్పాటు



చేయబోతున్నట్లు ఫాక్స్‌కాన్ తెలిపింది. అలాగే, ఈ బిడ్‌ను ఫాక్స్‌కాన్ హాన్ హై టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆహ్వానించిందని కంపెనీ తరఫున చెప్పబడింది.ఈ నెల ప్రారంభంలో ఫాక్స్‌కాన్ భారతదేశంలో చిప్ ప్యాకేజింగ్, టెస్టింగ్ వెంచర్‌ను ప్రారంభించడానికి భారతదేశానికి చెందిన హెచ్‌సిఎల్ గ్రూప్‌తో భాగస్వామ్యం కలిగి ఉందని వార్తలు వచ్చాయి. తైవాన్ కాంట్రాక్ట్ తయారీదారు యూనిట్ ఫాక్స్‌కాన్, హాన్ హై టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ జాయింట్ వెంచర్‌లో 40 శాతం వాటా కోసం 37.2 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఐఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్స్ అసెంబ్లర్ అయిన ఫాక్స్‌కాన్, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారతదేశంలో విస్తరిస్తోంది. అలాగే, చైనాలో నానాటికీ పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి కారణంగా, పని చేయడం చాలా కష్టంగా మారింది. ఫాక్స్‌కాన్ భారతదేశంలో అతిపెద్ద ఐఫోన్‌ల తయారీదారు, మొత్తం ఉత్పత్తిలో 68 శాతం వాటాను కలిగి ఉంది.

# శ్రీశైలం డ్యామ్‌ని సందర్శించిన ఎన్డీఎస్‌ఏ, కేఆర్‌ఎంబి సభ్యుల బృందం

**శ్రీశైలం,ఫిబ్రవరి8(వెలుతురు):** నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయం రెండు రోజుల పర్యటనలో భాగంగా ఎన్డిఎస్ఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి, సాంకేతిక సభ్యుడు రాకేష్ కశ్యప్, కెఆర్ఎంబి సంబంధించిన 10 మంది బృంద సభ్యులు జలాశయాన్ని సందర్శించారు. ప్రాజెక్ట్ పరిశీలనకు వచ్చిన సభ్యుల బృందానికి డ్యామ్ ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, పలువురు డ్యామ్ ఇంజనీర్లు స్వాగతం పలికారు. ముఖ్యంగా శ్రీశైలం జలాశయం కెఆర్ఎంబి పరిధిలోకి తీసుకురానున్న నేపథ్యంలో డ్యాం భద్రత, నీటి నిల్వలు వినియోగపై పూర్తిస్థాయిలో నిపుణుల బృందం అధ్యయనం చేస్తుంది. జలాశయం భద్రత, నీటి నిల్వలు, నీటి వినియోగంపై సమగ్రంగా పరిశీలించి జలాశయం వివరాలను డ్యామ్ అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. అలానే 2009 లో జలాశయం వరదలపై అధికారులతో తెలుసుకొని డాయగ్రామ్స్ పరిశీలించారు. అలానే జలాశయం డ్యామ్ గేట్లు, గ్యాలరీ, రోప్స్, డ్యామ్ ముందు ఏర్పడిన ప్లాంజ్ ఫుల్ (పెద్ద గొయ్యి ) గురించి అలానే డ్యామ్ ముందుగల గేట్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. డ్యామ్ భద్రత ఎలా పని చేస్తుందని అరా తీశారు పరిశీలన అనంతరం డ్యామ్ అధికారులతో రేపు ఉదయం సమావేశం నిర్వహించనున్నారు. పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రాజెక్టు సిఈ కబీర్ బాషా నేషనల్ జలశక్తి సూచనల మేరకు డ్యాం నేషనల్ సేఫ్టీ అథారిటీ డ్యామ్ పరిశీలనకు వచ్చారని వివేక్, విటల్ ఆధ్వర్యంలో డ్యామును పరిశీలించారని డ్యామ్ స్థితి గతి ఎలా ఉంది ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. ప్లాంజ్ ఫుల్ పరిస్థితి ఎలా ఉంది దానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనేదానిపై పరిశీలన చేశారని ప్లాంజ్ ఫుల్ మరీ లోతుగా గోయి పడకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారని చెప్పారు.





అంతేకాదు మూడు గ్యాలరీలు పరిశీలించి వాటి సీపీసీ ఎలా వస్తుంది ఎలా అందజేస్తున్నారని డ్యామ్ గేట్లు ఎలా ఆపరేటింగ్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.
మళ్ళీ మధ్యాహ్నం నుండి వీటన్నిటికీ సంబంధించి చర్చ చేసి నిపుణులు బృందం సలహాలు సూచనలు చేశారు. వీటితోపాటు అప్రోచ్ రోడ్డు సిలికాన్ సిలిండర్ గురించి గతంలోనే ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదన సమర్పించడం జరిగిందని దానిపై కూడా చర్చ చేశారని అలానే ఇప్పటికే ప్రపంచ బ్యాంకు కి సుమారు డ్యామ్ మరమ్మతులకు 135 కోట్లు అంచనా వ్యయం వేసి పంపించామని మరొకసారి ఎన్డిఎస్ఏ బృందం సలహాలతో ఇంకా ఏమైనా కావాల్సినా వాటి గురించి కూడా ప్రతిపాదన చేస్తామని తెలిపారు.

ప్రస్తుతానికి డ్యాం స్థితిగతికి ఎటువంటి ఇబ్బంది లేదని ప్లాంజ్ ఫుల్ అలానే చిన్నచిన్న రిపేర్లకుపై నిపుణుల బృందం సభ్యులు కొన్ని సలహాలు సూచనలు చేశారని శ్రీశైలం ప్రాజెక్టు సిఈ కబీర్ భాషా తెలిపారు.

# కేంద్రంపై యుద్ధానికి ఏకమైన దక్షిణ భారతం

### సర్కారు వైఖరిపై నిరసనల వెల్లువ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు): నిధుల కేటాయింపులో వివక్ష, నిర్లక్ష్యంపై బీజేపీ నేతృత్వంలోని కేంద్రానికి వ్యతిరేకంగా కేరళ, తమిళనాడు తమ పొరుగు రాష్ట్రమైన కర్ణాటకతో కలిసి నిరసన వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారానికి వ్యతిరేకంగా కేరళకు చెందిన లెఫ్ట్ ఫ్రంట్, తమిళనాడు డీఎంకే గురువారం ఢిల్లీలో నిరసనలు చేపట్టనున్నాయి. కేరళ లెఫ్ట్ ఫ్రంట్ ఆందోళనకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ నాయకత్వం వహించనున్నారు. డీఎంకె అధినేత ఎంకె స్టాలిన్ మద్దతు ఇవ్వనున్నారు. దేశ రాజధానిలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే నిరసనలో లెఫ్ట్ ఫ్రంట్ మంత్రులు, పార్లమెంటేరియన్లు, శాసనసభ్యులు కూడా పాల్గొంటారు.పన్నుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ బుధవారం కర్ణాటక కాంగ్రెస్ కురువృద్ధుడు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన డిప్యూటీ డీకే శివకుమార్, ఇతర రాష్ట్ర మంత్రులతో కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్రానికి కేటాయించిన నిధులను విడుదల చేశారని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కేరళ ప్రభుత్వం చట్టపరమైన చర్యలకు పూర్తి మద్దతును అందజేస్తామని ఎంకే స్టాలిన్ మంగళవారం (ఫిబ్రవరి 6) పినరయి విజయన్‌కు లేఖ రాశారు. డీఎంకే ఆందోళనలో పాల్గొంటుందని, ఆ పార్టీ నేతలు నల్ల బట్టలు ధరించి ఉంటారని లేఖలో పేర్కొన్నారు. కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని స్థాపించి, రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు మా గొంతు విశ్రమించదని తమిళనాడు ముఖ్యమంత్రి అన్నారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని గాంధీ విగ్రహం దగ్గర సీనియర్ నేత టీఆర్ బాలు నేతృత్వంలో డీఎంకే 'నల్ల చొక్కా' ప్రదర్శన జరగనుంది. కేంద్ర ప్రభుత్వం "2024–25 మధ్యంతర బడ్జెట్‌లో తమిళనాడుకు అవసరమైన నిధులు కేటాయించకపోవడానికి" వ్యతిరేకంగా నిరసన జరగనుంది. డిసెంబరు 2023లో అపూర్వమైన వర్షాల కారణంగా వరదలు సంభవించిన తరువాత, దాదాపు రూ. 37,000 కోట్ల మేరకు సహాయం కోరుతూ తమిళనాడు ప్రాతినిధ్యంపై ఎటువంటి ప్రకటన చేయలేదని ఎంకే స్టాలిన్ పార్టీ పేర్కొంది. "అలాగే, తమిళనాడుకు నిధుల కేటాయింపుపై మధ్యంతర బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటన లేదు. మదురైలో ఎయిమ్స్ ఏర్పాటుతో సహా అభివృద్ధి ప్రాజెక్టులు ప్రకటించలేదు" అని డీఎంకె పేర్కొంది. డీఎంకె ఎంపీ టీఆర్‌బాలు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో సహా కూటమి పార్టీలకు చెందిన పార్టీ ఎంపీలు ఈరోజు ఢిల్లీలో ఆందోళనలో పాల్గొనాలని అభ్యర్థించారు.

# ఢిల్లీలో ఆందోళన చేపట్టిన కేరళ ప్రభుత్వం

### మద్దతు తెలిపిన ఢిల్లీ ముఖ్యమంత్రి, పంజాబ్ సీఎం

### మోడీ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు): కేంద్రం తీరుకు నిరసనగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఢిల్లీ వేదికగాఆందోళనకు దిగుతున్నాయి. జంతర్‌మంతర్ దగ్గర బుధవారం కాంగ్రెస్ ఆందోళన చేపట్టగా.. గురువారం కేరళ ప్రభుత్వం నిరసనకు దిగింది. నిధుల కేటాయింపు విషయంలో




కేంద్రం అన్యాయం చేస్తోందంటూ కేరళ ఆరోపించింది. కేంద్రం తీరును నిరసిస్తూ కేరళ సర్కార్ ఢిల్లీలో ఆందోళన చేపట్టింది. దీనికి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఒక కొత్త ఆయుధంగా మార్చుకుందని ఆరోపించారు. కోట్లాది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్ష ప్రభుత్వాలపై కేంద్రం అస్త్రంగా ప్రయోగిస్తోందని మండిపడ్డారు. గతంలో నేరం రుజువైతే జైలుకు పంపేవారు. కానీ.. ప్రస్తుతం జైలుకు పంపాక వారిపై ఏ కేసు పెట్టాలా అని ఆలోచిస్తున్నారన్నారు. ఒకవేళ భవిష్యత్తులో ఆప్‌కి కేంద్రంలో అధికారంలోకి వస్తే మాత్రం ఇదే సీన్ రిపీట్ అవుతుందని హెచ్చరించారు. ఇప్పుడు బీజేపీ చేసినట్లుగానే మేముచేస్తామని పేర్కొన్నారు. జార?ండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌పై కేసు నమోదు చేయకముందే ఆయన్ను జైల్లో పెట్టారని ఆరోపించారు. కొద్ది కాలంలోనే తనతో సహా కేరళ సీఎం పినరయి విజయన్, తమిళనాడు సీఎం స్టాలిన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కూడా జైల్లో పెట్టి ఆయా ప్రభుత్వాలను పడగొట్టే అవకాశం లేకపోలేదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు కేంద్ర నిధుల విషయంలో కేరళకు అన్యాయం జరుగుతోందని సీఎం పినరయి విజయన్ దేశ రాజధానిలో ఆందోళనకు దిగారు. ఈ నిరసనలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# గుండెపోటుతో 8వ తరగతి విద్యార్థిని మృతి

సిద్ధిపేట,ఫిబ్రవరి8(వెలుతురు): గుండెపోటుకు సంబంధించిన విస్మయం కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వయసు మళ్లిన వారిలోనే గుండె పోటు సంబంధిత సమస్యలు వచ్చేవి. కానీ ప్రస్తుతం పట్టుమని పాతికేళ్లు కూడా నిండకుండానే గుండెపోటు కారణంగా మరణిస్తున్నారు. ఇలాంటి దారుణ సంఘటనలు దేశవ్యాప్తంగా ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఇక ఇటీవల పాఠశాల విద్యార్థులు సైతం గుండెపోటు బారినపడుతుండడం,






ఆందోళన కలిగిస్తుంది. చిన్నారుల్లో గుండె పోటు రావడం ఏంటని అటు నిపుణులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత గుండెపోటు సమస్యలు ఎక్కువవుతున్నాయి. గుండెపోటు బారిన పడుతోన్న వారిలో భారతీయులే అత్యధికులు కావడం కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణలోని సిద్ధిపేటలో ఓ చిన్నారి గుండెపోటుతో మరణించడం స్థానికంగా ఆందోళన కలిగించింది. వివరాల్లోకి వెళితే.. సిద్ధిపేటకు సమీపంలో ఉన్న తడ్కపల్లి గ్రామానికి చెందిన అంబటి లక్షణ్య అనే 13 ఏళ్ల చిన్నారికి మంగళవారం నుంచి జ్వరంతో బాధపడుతోంది. ఇదే సమయంలో డాక్టర్ రాసిచ్చిన మందులను ఉపయోగించింది. అయితే బుధవారం బాత్ రూమ్‌లో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

వెంటనే అలర్ట్ అయిన కుటుంబ సభ్యులు చిన్నారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే ఆ చిన్నారి అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అంత తక్కువ వయసున్న చిన్నారి అలా గుండె పోటు కారణంగా మరణించడంతో గ్రామంలో తీవ్ర విషాధ ఛాయలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే భారత్‌లో గుండెపోటు కేసులు పెరగడానికి తగినంత వ్యాయామం లేకపోవడమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల తెలిపింది. భారతీయులు సరైన వ్యాయామం చేయని కారణంగానే హార్ట్ ఎటాక్ కేసులు పెరుగుతున్నాయని చెబుతున్నారు. రోజులో కనీసం కొంతదూరమైనా నడవాలని సూచిస్తున్నారు. అలాగే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ మంచి ఆరోగ్యకరమైన భోజనం తీసుకుంటే గుండె పోటు సమస్యకు చెక్ పెట్టొచ్చని సూచిస్తున్నారు.

# దేశంలో హడలెత్తిస్తోన్న మరో వైరస్

### మంకీ ఫీవర్‌తో రెండు మరణాలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు): కరోనా తగ్గింది అని ఊపిరి పీల్చుకుంటున్న వేళ.. ఎక్కడోచోట ఏదొక వైరస్ కేసులు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా మన దేశంలో అనేక రాష్ట్రాల్లో మంకీ ఫీవర్ కేసులు పెరుగుతూ ఆందోళన పెంచుతున్నాయి. గోవా, మహారాష్ట్ర సహా కర్ణాటకలో అత్యధికంగా కేసులు నమోదవుతున్నాయి. ఒక్క కర్ణాటకలోనే ఇప్పటివరకు 64కి పైగా కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ఈ జ్వరంతో గత నెలలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారనే వినిపిస్తున్నాయి. ఈ రెండు మరణాల తరువాత ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వైరస్‌ను ఎదుర్కోవడానికి ముందస్తు సన్నాహాలు చేస్తోంది. ఎందుకంటే ఈ వ్యాధికి ఇప్పటి వరకు నిర్దిష్ట చికిత్స అంటూ ఏదీ లేదు.దేశంలోని పలు రాష్ట్రాల్లో మంకీ ఫీవర్ కేసులు పెరుగుతున్నాయని ఢిల్లీ సీనియర్ వైద్యుడు డాక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. కీటకాలు కోతులను కుట్టి.. మళ్లీ వచ్చి మనిషిని కుడితే మంకీ ఫీవర్ వస్తుంది. ఈగల ద్వారా ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. అయితే ఇప్పటి వరకు ఈ జ్వరానికి మందు లేదా వ్యాక్సిన్ తయారు చేయలేదు. వ్యాధి లక్షణాల ఆధారంగా మాత్రమే రోగికి చికిత్స అందిస్తారు. మంకీ ఫీవర్ వైరస్, బ్యాక్టీరియా రెండింటి వల్ల వస్తుందని వైద్యులు చెబుతున్నారు. టీకాలు తయారు చేయని అనేక రకాల వైరస్ వ్యాధులు ఉన్నాయి. అయితే ఈ వైరస్ వ్యాధి కేసులు కూడా తక్కువ.ఈ వైరస్ వల్ల వచ్చే జ్వరం గురించి మాట్లాడినట్లయితే, అధిక



జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, బలహీనత, వాంతులు , విరేచనాలు, చిగుళ్ళలో రక్తస్రావం వంటి వాటితో ఇబ్బంది పడతారు. ఈ లక్షణాలు కనిపిస్తే తగిన చికిత్స తీసుకోవాల్సి ఉంది. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చు.క్యాసనూర్ ఫారెస్ట్ డిసీజ్ అని కూడా పిలువబడే కోతుల జ్వరం కారణంగా మొదటి మరణం జనవరి 8 న శివమొగ్గ జిల్లాలోని హొసానగర్‌లో నమోదైందని ఆరోగ్య శాఖ చెబుతోంది. ఈ వైరస్ కారణంగా 18 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. రెండో మరణం ఉడిపి జిల్లాలోని మణిపాల్‌లో 79 ఏళ్ల వృద్ధుడిది. ఈ వైరస్ కేసులు నిరంతరం పెరుగుతున్నాయి.. దీని కారణంగా ప్రభుత్వం, ఆరోగ్య శాఖ చాలా ఆందోళన చెందుతోంది. వైరస్ వ్యాపించకుండా నివారణ చర్యలు తీసుకోవడానికి సమావేశాలు జరుగుతున్నాయి.ఇది ఒక వైరల్ వ్యాధి. ఇది క్యాసనూర్ ఫారెస్ట్ డిసీజ్ వైరస్ వల్ల వస్తుంది. జంతువుల నుండి మనుషులకు సంక్రమణ వ్యాప్తి చెందడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. కోతుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి మొదటిసారిగా 1957లో కర్ణాటకలోని దట్టమైన అడవులలో నమోదైంది. కోతుల శరీరంలో కనిపించే పేలు.. మనిషిని కురవడంతో మానవులలో సంభవించింది. వైద్య నివేదికల ప్రకారం ఈ మంకీ ఫీవర్ కు నిర్దిష్ట చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. ఈ వ్యాధి సోకకుండా నిరోధించడానికి ప్రభావిత ప్రాంతాల్లో ఆరోగ్య శాఖ ద్వారా టీకాలు అందించనున్నారు. దీనిని నివారించడానికి, ఎక్కువ నీరు త్రాగుతూ ఉండలి. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

# మరోసారి 100బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ప్రవేశించిన అదానీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు): వాదాస్పద హిండెన్‌బర్గ్ నివేదిక నుండి భారతదేశపు అత్యంత సంపన్నులలో ఒకరైన గౌతమ్ అదానీ పూర్తిగా కోలుకుంటున్నారు. ఈ దిశలో బుధవారం ఒక ముఖ్యమైన మైలురాయి వచ్చింది. ఏడాదికి పైగా విరామం తర్వాత గౌతమ్ అదానీ మరోసారి 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి ప్రవేశించగలిగాడు. బుధవారం గౌతమ్ అదానీ నికర విలువ 2.7 బిలియన్ డాలర్లు పెరిగి 100.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఏడాది క్రితం వివాదాస్పద హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ నికర విలువ 100 బిలియన్ డాలర్లు దాటడం ఇదే తొలిసారి. జనవరి 2023 నాటికి అదానీ నికర విలువ సుమారు 120 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అతను ప్రపంచంలో మూడవ అత్యంత సంపన్న వ్యక్తి అయ్యాడు. అదే సమయంలో హిండెన్‌బర్గ్ నివేదిక పెద్ద నష్టాన్ని కలిగించింది.జనవరి 2023 చివరిలో వచ్చిన హిండెన్‌బర్గ్ నివేదికలో అదానీపై చాలా తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. నివేదిక వెలువడిన తర్వాత అదానీ షేర్లు పతనమయ్యాయి. గ్రూప్‌లోని వివిధ షేర్లు నిరంతరం లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. దీని కారణంగా ఒకప్పుడు టాప్–త్రీకి చేరుకున్న అదానీ, ప్రపంచంలోని అత్యంత సంపన్నుల జాబితాలో టాప్–30



నుండి బయటపడ్డాడు. ఇప్పుడు 100 బిలియన్ డాలర్లకు చేరుకోవడానికి ఒక సంవత్సరం కంటే కొంచెం ఎక్కువ సమయం పట్టింది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో గౌతమ్ అదానీ నికర విలువ 97.9 బిలియన్ డాలర్లుగా ఉంది. అతని సంపద గత 24 గంటల్లో 1.30 బిలియన్ డాలర్లు. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు 13.6 బిలియన్ డాలర్లు పెరిగింది. ప్రపంచంలోని అత్యంత సంపన్నుల ఈ ఇండెక్స్‌లో ప్రస్తుతం అతను 14వ స్థానంలో ఉన్నాడు.ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ల జాబితా ప్రకారం ప్రస్తుతం గౌతమ్ అదానీ నికర విలువ 82.2 బిలియన్ డాలర్లు. ఈ సంపదతో అతను ప్రపంచంలోని 16వ అత్యంత సంపన్న వ్యక్తి. ఇటీవలి పెరుగుదలతో అదానీ ఇప్పుడు భారతదేశం, ఆసియాలో అత్యంత సంపన్న వ్యక్తి ముఖేష్ అంబానీకి దగ్గరయ్యారు. అంబానీ ప్రస్తుతం ఫోర్బ్స్ జాబితాలో 111.4 బిలియన్ డాలర్లు నికర విలువతో 11వ స్థానంలో ఉన్నారు. అయితే బ్లూమ్‌బెర్గ్ ఇండెక్స్‌లో అతని నికర విలువ 107 బిలియన్ డాలర్లు.

# భారత్ తెలివిగా వ్యవహరిస్తోంది

### ఇండియాపై హేలీ సంచలన వ్యాఖ్యలు..!

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు): అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న కరోలినా మాజీ గవర్నర్, భారత సంతతి మహిళ నిక్కీ హేలీ.. భారత్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భారత్ చాలా తెలివిగా వ్యవహరిస్తోందని చెప్పారు. వాస్తవానికి అమెరికాకు భాగస్వామిగా ఉండాలని భారత్ కోరుకుంటోందని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. కానీ అగ్రరాజ్యం పెద్దన్న పాత్ర పోషించడంపై మాత్రం వారికి విశ్వాసం లేదని తెలిపారు. అందుకే స్మార్ట్‌గా ఆలోచించి.. రష్యాకు సన్నిహితంగా ఉంటూ వస్తోందని వివరించారు. అమెరికా తరఫున తాను భారత వ్యవహారాలను సైతం చూశానని గుర్తు చేశారు. అమెరికా నేతృత్వంపై భారత్‌కు నమ్మకం లేదని, అమెరికా చాలా బలహీనంగా ఉందని ఆ దేశం భావిస్తోందని చెప్పారు. ప్రస్తుతం అమెరికా పశ్చిమాసియా దేశాలపైనే అధికంగా దృష్టి సారించిందన్నారు. ఇది సరి కాదని.. ఇతర దేశాలతోనూ సత్సంబంధాలు ఉండటం అవసరమని హేలీ స్పష్టం చేశారు. అప్పుడే భారత్, జపాన్, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, న్యూజిలాండ్ తదితర దేశాలన్నీ అమెరికాతో కలిసి వస్తాయని చెప్పారు. చైనా ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఏమీ బాగోలేదన్నారు. అయినా.. డ్రాగన్ నాయకత్వం అమెరికాతో యుద్ధానికి సన్నద్ధమవుతోందని, అది ఘోర తప్పిదమేనని వ్యాఖ్యానించారు. నెవాడా రాష్ట్రంలో రిపబ్లికన్ ప్రైమరీ ఎన్నికల్లో హేలీకి 31 శాతం ఓట్లు మాత్రమే రావడంతో ఓటమి పాలయ్యారు. అధ్యక్ష అభ్యర్థిత్వం రేసులో ఆమె కంటే ముందున్న ట్రంప్ ఇక్కడ పోటీ పడలేదు. నోటా తరహాలో ' ఈ అభ్యర్థులెవరూ కారు' అనే కాలమ్‌ను బ్యాలెట్ పత్రంలో ఉంచారు. దానికి 63 శాతం ఓట్లు పోలయ్యాయి. నెవాడాలో 1975లో నోటాను ప్రవేశపెట్టిన అనంతరం ఓటమిపాలైన తొలి అభ్యర్థి హేలీయే.

# రాజ్యసభకు వైవీ సుబ్బారెడ్డి

### వైసీపీ రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక

అమరావతి,ఫిబ్రవరి8(వెలుతురు): వైసీపీ నుంచి ఆ ముగ్గుర్ని రాజ్యసభకు ఎంపిక చేయడం వెనుక వ్యూహాత్మకంగా అడుగులు వేసింది ఆ పార్టీ అధిష్టానం. ఎమ్మెల్యే టికెట్ల విషయంలో గందరగోళానికి కాస్త తెరపడేలా జగన్ జాగ్రత్తలు తీసుకున్నారు. టీటీడీ ప్రస్తుత ఛైర్మన్, ఒంగోలు మాజీ ఎంపీ, జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డిని పెద్దలసభకు పంపాలని జగన్ నిర్ణయించారు. తద్వారా ప్రకాశం జిల్లాలో ఎమ్మెల్యేల సీట్ల గందరగోళానికి తెరదించే ప్రయత్నం చేశారాయన. తన కుమారుడికి ఒంగోలు ఎంపీ టికెట్ అడుగుతున్నారు వైవీ సుబ్బారెడ్డి. సిట్టింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికే మళ్లీ ఛాన్సివ్వాలని ఆయనతో పాటు, సీనియర్ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైవీని రాజ్యసభకు పంపిండం ద్వారా.. ఆయన కుమారుడు విక్రాంత్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇచ్చేది లేదని నాయకత్వం చెప్పకనే చెప్పినట్టయింది. ఇక, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఈసారి అసెంబ్లీ టికెట్ కోసం పట్టు పడుతున్నారు. కానీ కుదరదని నాయకత్వం తేల్చి చెప్పి.. ఆయన్ను పెద్దల సభకు పంపించాలని నిర్ణయించారు. దళిత నాయకుల నియోజకవర్గాల్లోనే మార్పులు చేస్తూ.. ఆ సామాజిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నారనే ప్రచారానికి తెరదించే ప్రయత్నం చేశారు జగన్మోహన్ రెడ్డి. వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు పేర్లు ఎప్పటినుంచో ప్రచారంలో ఉన్నప్పటికీ.. సడెన్‌గా తెరపైకి వచ్చిన నాయకుడు మేడా రఘునాథ్ రెడ్డి. అన్నమయ్య జిల్లా రాజంపేట సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి సోదరుడు ఈ రఘునాథ్ రెడ్డి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి ఉమ్మడి కడప జిల్లాలో ఒకే ఒక్క ఎమ్మెల్యేగా గెలిచిన మల్లికార్జున్ రెడ్డి.. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. ఇప్పుడాయనకు అధిష్టానం మొండిచెయ్యి చూపించింది. అక్కడ మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పేరును ప్రకటించారు. మేడా ఇతర పార్టీలతో టచ్‌లోకి వెళ్లారనే ప్రచారం జోరుగా సాగింది. ఆర్థికంగా స్ట్రాంగ్ ఫ్యామిలీని దూరం చేసుకునేందుకు జగన్ ఇష్టపడలేదనే సంకేతాలు పంపారు. దీంతో ఆయన సోదరుడు రఘునాథ్‌రెడ్డి రాజ్యసభకు పంపడం ద్వారా మేడా ప్రాధాన్యత పెంచామని కేడర్ చెప్పుకునే అవకాశం కలిగింది. పైగా, మేడా ఫ్యామిలీకి టీటీడీ బోర్డులోను ప్రాతినిధ్యం కల్పించిన విషయాన్ని వైసీపీ నాయకులు గుర్తు చేస్తున్నారు.

# బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

### కాంగ్రెస్‌లో చేరిన మాజీ డిప్యూటి మేయర్ ఫిసియొద్దీన్

హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు): అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులు తున్నాయి. ఇటీవల కాలంలో పలువురు బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. స్థానిక నేతల నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు ఈ వలసల పర్వం కొనసాగుతుండడం బీఆర్ఎస్‌ను కలవరపెడుతోంది. భవిష్యత్తులోనూ ఇది కొనసాగే అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకత్వంలో కలవరం మొదలైంది. తాజాగా మరో కీలక నేత బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరారు. జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా మున్షీ సమక్షంలో బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరుపై బాబా ఫసియుద్దీన్ కొంతకాలంగా ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలోనే ఉద్యమకారులకు పార్టీలో ప్రాధాన్యం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో ప్రాణహాని ఉందని చెప్పినా అధిష్టానం పట్టించుకోలేదంటూ బాబా చెప్పారు. కాగా ఇటీవల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కూడా పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే.

# కవితను పూలే ఇప్పుడు గుర్తుకు వచ్చాడా?

### బీసీలను ఇన్నిరోజులు ఎందుకు పట్టించుకోలేదు

### మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు

హైదరాబాద్,ఫిబ్రవరి8(వెలుతురు): అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు బడుగులు, బలహీనులు, దళితులు గుర్తుకు రాలేదన్నారు మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కవితను పూలే ఇప్పుడు గుర్తుకు వచ్చాడా? బీసీలను ఇన్నిరోజులు ఎందుకు పట్టించుకోలేదన్నారు. కవితను ఒక విషయంపై ప్రశ్నిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. మనకు ఒక ఎంపీ సీటు వస్తుంది అని ఫామ్ హౌజ్ కి వెళ్లి మీ నాన్నకు చెప్పు అని ఆయన అన్నారు. శంకరమ్మకు రాజ్యసభ సీటు ఇవ్వమని అడగండని ఆయన అన్నారు. సీట్లు ఎవరెవరికి అమ్ముకున్నారో అందరికీ తెలుసునని, మీ నాన్న ఆరోగ్యం ఎలాగూ బాగోలేదు కదా.. కాబట్టి ఫ్లోర్ లీడర్ గా సీనియర్ అయిన, దళితుడు అయిన కడియం కు ఇవ్వండని రఘునందన్ రావు అన్నారు. మీ అన్న వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలాగూ రాజ్యాలు విస్తరించుకునే పనిలో ఉన్నాడని, ఆయనకు సినిమా వాళ్ళతో పనులుంటాయన్నారు.కాబట్టి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఒక బీసీ కి ఇవ్వండని, శంకరమ్మకు రాజ్యసభ సీటు ఇచ్చి మీ పాపాలు కడుక్కోండన్నారు. నీకు, మీ ఫ్యామిలీకి ఇంకా పబ్లిసిటీ పిచ్చి ఎందుకు అని ఆయన విమర్శించారు. శాసనసభలో మీ అన్న, మీ బావ కనపడాలి.. తెలంగాణ భవన్ లో మీ తండ్రి కనపడాలి.. మండలిలో నువ్వు కనిపిస్తావని, మీరు తప్ప మాట్లాడే వాళ్ళు మీ పార్టీలో లేరా అని ఆయన ప్రశ్నించారు. మీ అయ్య కాళ్ళు మొక్కుతావో.. ఏం చేస్తావో తెలియదు కాని.. కొద్దిరోజులు మీరు, మీ కుటుంబ సభ్యులు మాట్లాడకుండా, మీడియా ముందుకు రాకుండా ఉంటే మీకే మంచిదన్నారు. చెల్లి.. నువ్వు ఉన్నా లేకున్నా పూలే గుర్తుంటారు.. మీరు కొత్తగా ఏం చేయాల్సిన అవసరం లేదన్నారు. మీ పార్టీ పేరులో ఎలాగూ తెలంగాణ పోయిందని, కనీసం సీట్లు అయినా తెలంగాణ కోసం కొట్లాడిన వారికి ఇవ్వండన్నారు రఘునందన్ రావు.

# ఇండియా–కెనడాల మధ్య ఉద్రిక్తతలు..

### ఎన్నికల్లో జోక్యం "విదేశీ ముప్పు"గా పేర్కొన్న కెనడా

### కెనడా ఆరోపణలపై భారత్ ఆగ్రహం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి8(వెలుతురు): ఇండియా–కెనడాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. నిజ్జర్ హత్యలో భారత్ ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉన్నట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. దీనిపై భారత్ ఘాటుగానే స్పందిస్తూ.. ఉగ్రవాదులకు మీరు స్థావరం ఇస్తున్నారని, మీ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది.



ఇదిలా ఉంటే, ఇటీవల మరోసారి కెనడా, భారత్‌పై అనవసర నిందలు వేసింది. మా అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటుందని, కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం ఉందని ఆరోపించింది. భారత్‌ని తమ ఎన్నికల్లో జోక్యం చేసుకోగల "విదేశీ ముప్పు"గా పేర్కొంది. ఇండియాతో పాటు చైనా, రష్యాలను కూడా ఇదే విధంగా నిందించింది. ఈ ఆరోపణలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. ఎంఈఏ అధికా ప్రతినిధి రణధీప్ జైశ్వాల్ ఈ రోజు మాట్లాడుతూ.. కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకుంటుందనేది నిరాధారమైన ఆరోపణలని, వీటిని భారత్ తీవ్రంగా తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. నిజానికి మా అంతర్గత విషయాల్లో కెనడా జోక్యం చేసుకుంటుందని, మేము ఈ సమస్య గురించి క్రమం తప్పకుండా వారి వద్ద లేవనెత్తుతున్నామని, మా ప్రధాన ఆందోళనల్ని పరిష్కరించడానికి కెనడా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని జైశ్వాల్ అన్నారు.

## మనదేశంలో అడుగు పెట్టిన

# టేస్టీ టేస్టీ.. వైట్ స్ట్రాబెర్రీస్..

### పండించాలంటే ఈ రైతు అనుమతి తప్పనిసరి

**స్ట్రాబెరీస్ విదేశాల నుంచి మన దేశంలోకి అడుగు పెట్టి ఇక్కడ కూడా ఆదరణ సొంతం చేసుకున్నాయి. తియ్యగా పుల్లగా ఎరుపు రంగులో ఆకర్షణీయంగా ఉండే స్ట్రాబెర్రీలు పిందెలుగా ఉన్న సమయంలో తెల్లగా ఉంటాయి. అవి పక్వానికి వచ్చే కొద్దీ ఎరుపురంగులోకి మారతాయి. అయితే ఇప్పటి వరకూ మన దేశంలో ఎర్రటి స్ట్రాబెరీస్లను చూసినా విదేశాల్లో మాత్రం ఎప్పటి నుంచో తెల్ల స్ట్రాబెర్రీలు మార్కెట్లో సందడి చేయడం మొదలు పెట్టాయి. 2010ల ప్రారంభంలో ప్రజాదరణ వైట్ స్ట్రాబెర్రీలు కొన్ని తెల్లగా మరికొన్ని లేత గులాబీ రంగులో ఉంటాయి. వీటి టేస్ట్ కూడా చాలా తియ్యగా ఉంది.. జ్యుసిగా ఉంటాయి. అయితే ఈ వైట్ స్టాబెర్రీలు మన దేశంలో అడుగు పెట్టాయి. అది కూడా మన రైతులే పండించడం విశేషం.**



మహారాష్ట్రలోని ఓ రైతు ప్రత్యేకమైన తెల్లని స్ట్రాబెర్రీని పండిస్తున్నారు. మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని మహాబలేశ్వర్, భిలార్, వై ప్రాంతాల్లో స్ట్రాబెర్రీలను పండిస్తారు. ఇప్పుడు సతారాలోని వాయిలోని ఫూలే నగర్‌లో నివసిస్తున్న ఒక రైతు తెల్ల స్ట్రాబెర్రీలను పండించాడు. సతారాలోని ఫూలేనగర్‌కు చెందిన ఉమేష్ ఖమ్కర్ అనే రైతు అర ఎకరంలో తెల్లటి స్ట్రాబెర్రీతో ప్రయోగాలు చేశాడు. మార్కెట్‌లో ఈ స్ట్రాబెర్రీలను విక్రయించడం కూడా ప్రారంభించాడు. త్వరలో ఈ ప్రత్యేకమైన వైట్ స్ట్రాబెర్రీ ఆన్‌లైన్‌లో కూడా విక్రయించడానికి రెడీ అవుతున్నాడు.

**వైట్ స్టాబెర్రీ ప్రత్యేకత**

ఈ స్ట్రాబెర్రీ ప్రత్యేకత ఏమిటంటే దీని ధర కిలో 1000 నుండి 1500 రూపాయల వరకు ఉంటుంది. ఈ స్ట్రాబెర్రీ దిగుబడి ఆరు రెట్లు ఎక్కువ కావడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వీటి టేస్ట్ కూడా చాలా తియ్యగా ఉంది.. జ్యుసిగా ఉంటాయి. కొన్ని అనాస పండు ఫ్లేవర్ ని కూడా కలిగి ఉంటాయి.

**US , UK ల్లో ఈ వైట్ స్ట్రాబెర్రీస్ పై ప్రయోగం**

ఈ తెల్లని స్ట్రాబెర్రీని మొదట అమెరికా, ఇంగ్లండ్‌లో ప్రయోగించారు. ఈ స్ట్రాబెర్రీ పేరు ఫ్లోరిడా పెర్ల్. ఈ రకమైన స్ట్రాబెర్రీ భారతదేశంలో మొదటిసారిగా సాగు చేస్తున్నాయి. ఈ తెల్లటి స్ట్రాబెర్రీ మహారాష్ట్రలో మొదటిసారిగా సాగు చేస్తున్నారు. త్వరలో ఈ వైట్ స్ట్రాబెర్రీ సాగును ఇతర ప్రాంతాల్లో కూడా మొదలు పెట్టనున్నారు. భారతదేశంలో తెల్లటి స్ట్రాబెర్రీలను సాగు చేసిన రైతుగా సతారా వాయికి చెందిన రైతు ఉమేష్ ఖమ్కర్ ఖ్యాతిని సొంతం చేసుకున్నాడు. ఇందుకోసం యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా నుంచి రాయల్టీ హక్కులను కొనుగోలు చేశాడు. ఇప్పుడు ఎవరైనా భారతదేశంలో సాగు చేయాలనుకుంటే.. ఆ రైతులు తప్పని సరిగా ఉమేష్ ఖమ్కర్ నుండి వైట్ స్ట్రాబెర్రీ సాగు చేసేందుకు హక్కులను కొనుగోలు చేయాల్సి ఉంది.

**వైట్ స్ట్రాబెర్రీస్ లక్షణాలు ఏమిటి?**

- వైట్ స్ట్రాబెర్రీలు ఎరుపు స్ట్రాబెర్రీల కంటే కొంచెం తియ్యగా ఉంటాయి.
- స్ట్రాబెర్రీలలో ఉండే పోషకాల వల్ల శరీరానికి మేలు చేస్తుంది.
- స్ట్రాబెర్రీలు తక్కువ సహజ ఆమ్లత్వం కారణంగా ప్రసిద్ధి చెందాయి. వి
- దేశాల్లో కూడా వైట్స్ స్ట్రాబెర్రీలు బాగా ప్రాచుర్యం పొందాయి.
- ఈ స్ట్రాబెర్రీలకు భారతదేశంలో కూడా మంచి మార్కెట్ ఉంది.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. మీ గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోండిలా!



**ప్రస్తుతం మెల్ల మెల్లగా వాతావరణం మారుతుంది. చలి వదిలి నెమ్మదిగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో గత రెండు రోజల నుంచి ఉష్ణోగ్రతలు అనేవి బాగా పెరుగుతున్నాయి.**

ఈ క్రమంలోనే ప్రకృతితో పాటు శరీరంలో కూడా అనేక మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పులు బాహ్య శరీరంపైనే కాకుండా.. అంతర్గతంగా జీర్ణ వ్యవస్థపై కూడా ఎఫెక్ట్ చూపిస్తాయి. ఇలా వాతావరణం మారుతున్న క్రమంలోనే సరైన ఆహారాలు తీసుకోవాలి. లేదంటే అనారోగ్య సమస్యలు తప్పవు. అయితే మీ దిన చర్యలో కొన్ని రకాల మార్పులు, చేర్పులు చేసుకుంటే సరిపోతుంది. దీంతో గట్ ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. మరి గట్ ఆరోగ్యం మెరుగు పడాలంటే ఏం చేయాలో ఇప్పుడు చూద్దాం.

**శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోండి:**

ఉష్ణోగ్రతలు క్రమ క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో హైడ్రేషన్ అనేది చాలా ముఖ్యం. కాబట్టి నీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. అంతే కాకుండా ఇది జీర్ణ క్రియకు కూడా ఎంతో హెల్ప్ చేస్తుంది. పోషకాల శోషణకు పేగుల్లోని శ్లేష్మ పొర బాధ్యత వహిస్తుంది. కేవలం నీటిని మాత్రమే కాకుండా.. నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారాలు కూడా తీసుకుంటూ ఉండాలి. దోసకాయలు, పుచ్చకాయలు, సిట్రస్ ఫ్రూట్స్ వంటి వాటిని అధికంగా తీసుకోవాలి.

**ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు:**

ప్రేగులు ఆరోగ్యంగా ఉండాలంటే.. ఫైబర్ అనేది ముఖ్య పాత్ర వహిస్తుంది. వాతావరణ పరిస్థితులు మారుతున్న క్రమంలో మీరు ఫైబర్ అంటే పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. మీ ఆహారంలో ఫైబర్ అధికంగా ఉండేలా చూసుకోండి. ఫైబర్ సాధారణ ప్రేగు కదలికలను ప్రోత్సహించడమే కాకుండా ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియాకు ఇంధనంగా కూడా పనిచేస్తుంది.

**ఆనందంగా తినండి:**


మీరు ఆహారం తీసుకునేటప్పుడు రిలాక్స్‌గా తీసుకోండి. తినే ఆహారాన్ని పూర్తిగా నమిలి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం మైండ్ ఫుల్ ఫుడ్ డిజెస్టివ్ ఎంజైమ్‌లు రిలీజ్ అవుతాయి. ఇది జీవక్రియను కూడా మెరుగు పరుస్తుంది. ఆహారం విచ్ఛిన్నం చేయడంలో కూడా సహాయ పడుతుంది.

**ప్రోబయోటిక్స్ ఉన్న ఆహారం తీసుకోవాలి:**

ప్రోబయోటిక్స్ అనేవి మీ గట్ ఆరోగ్యాన్ని పెంచుతుంది. కాబట్టి ప్రోబయోటిక్స్ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం చాలా మంచింది. పెరుగు, గ్రీన్ పీస్, బ్రౌన్ బ్రెడ్, డార్క్ చాక్లెట్, చీజ్, ఇతర ప్రోబయోటిక్స్ ఆహారం తీసుకోవడం చాలా మంచిది.

# కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవాలా...

### ఈ ఫుడ్స్ బెస్ట్ అంటోన్న నిపుణులు!



ప్రస్తుతం చాలా మంది అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటున్నారు. శరీరంలో విపరీతంగా చెడు కొలెస్ట్రాల్ పెరిగి పోవడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడుతూ ఉంటున్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీంతో ఖచ్చితంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడం చాలా ఇంపార్టెన్స్. అప్పుడే ఆరోగ్యంగా, అందంగా ఉంటారు. కొలెస్ట్రాల్ అనేది జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, పిండితో తయారు చేసే ఆహారాలు, నూనెతో చేసిన వంటలు తినడం వల్ల వస్తుందని నిపుణులు చెబుతున్నారు. మరి ఈ కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడం అనేది మన చేతుల్లోనే ఉంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించే ఆహార పదార్థాలు తీసుకోవాలి. శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించే ఆహారాలు తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్‌ను అదుపు చేయవచ్చు. మరి ఆ ఆహారాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**పండ్లు:** కొన్ని రకాల పండ్లు తినడం వల్ల కూడా కొలెస్ట్రాల్‌కు చెక్ పెట్టొచ్చు. యాపిల్, స్ట్రాబెర్రీ, జామ, ఆరెంజ్, అవకాడో వంటి పండ్లు తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా నియంత్రించడంతో పాటు.. ఉన్న కొలెస్ట్రాల్‌ను బయటకు వెళ్ల గొడతాయి. ఈ పండ్లలో పుష్కలంగా విటమిన్స్, మినరల్స్ వంటివి.. ఆరోగ్యానికి ఎంతో మంచింది. శరీరంలో చెడు కొవ్వను తగ్గించుకోవాలన్నా.. బరువు తగ్గాలన్నా పండ్లు తినడం చాలా మంచిది.

**ఓట్స్:** ఓట్స్ కూడా ఆరోగ్యానికి ఎంతో మంచిది. కొలెస్ట్రాల్‌తో బాధ పడే వారు ఓట్స్ తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. శరీరంలో కొవ్వు కరిగించడానికి ఓట్స్ ఎంతో హెల్ప్ చేస్తాయి. ఇతర ప్రయోజనాలు కూడా చాలా ఉన్నాయి. బరువు తగ్గాలి అనుకునేవారు ఓట్స్ తీసుకోవచ్చు.

**ఆకు కూరలు:** ఆకు కూరల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు ఆకు కూరలు తినడం అనేది చాలా మంచిది. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి అందడమే కాకుండా.. ఉన్న కొవ్వును కరిగించి బయటకు పంపుతుంది.

**కూరగాయలు:** శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కూరగాయలు కూడా ఎంతో హెల్ప్ చేస్తాయి. క్యారెట్లు, చిక్కుళ్లు, బీన్స్, వంకాయ, సోయా ఆధారిత ఆహారాలు వంటివి కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. కొలెస్ట్రాల్ ఉన్నవారు మీ ఆహారంలో ఈ కూరగాయలు ఉండేలా చూసుకోండి.




# ఓ సారి ఇటు చూడండి బ్రదర్..!

### మీకోసమే ఈ చాయ్..!!

**మారుతున్న కాలానుగుణంగా మానవ మెదడులో సరికొత్త ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. ఏదైనా కొత్తగా, వింతగా, తక్కువ ఖర్చు, సులభంగా ఉండేట్లుగా ఆలోచిస్తున్నారు. విషయంలోకి వెళితే.. టీ తాగని వారు.., ఆ రుచి ఇష్టపడని వారు కూడా ఈ సరికొత్త టీ-స్టాల్‌ని చూశారో ఓసారైనా ట్రై చేద్దామనుకుంటారు. ఇక అదేంటో చూసేద్దాం! వినియోగదారులను ఆకట్టుకునేందుకు వ్యాపారులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే పెద్ద కంపెనీలు ప్రవేశించి జిల్లాలు, మండలాల వారీగా ఫ్రాంచైజీలు ఇస్తున్నారు. ఇక ఎక్కడ పడితే అక్కడ మొబైల్ టీ స్టాళ్లు ఏర్పాటవుతున్నాయి. ఈమేరకు పాత ఆటోలను మొబైల్ టీ స్టాళ్లుగా హైదరాబాద్‌లో సిద్ధం చేయించిన నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్తూ ఖమ్మంలో ఆగారు. ఖమ్మంలోని పటేల్ స్టేడియం వద్ద ఆపిన ఈ టీ స్టాల్ వాహనాలను పలువురు ఆసక్తిగా తిలకించారు.**


# రెపో రేటు యథాతథం..

## ఆర్బీఐ మోనిటరీ పాలసీ కమిటీ కీలక నిర్ణయం

**వరుసగా ఆరవసారి 6.5 శాతంగా కొనసాగించాలని నిర్ణయించిన ఆర్బీఐ ఎంపీసీ కమిటీ**

**ఆర్థిక వృద్ధికి ఊతం, ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యమని వెల్లడి**

**వడ్డీ రేట్ల విషయంలో సర్దుబాటు వైఖరిని కొనసాగిస్తామన్న ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్**



అత్యంత కీలకమైన రెపో రేటును వరుసగా ఆరవసారి 6.5 శాతంగా యథాతథంగా కొనసాగిస్తూ కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ నిర్ణయించింది. అయితే పరిస్థితుల ఆధారంగా సర్దుబాటు వైఖరిని కొనసాగించాలని భావించింది. ఈ మేరకు ద్వైమాసిక ద్రవ్య విధాన సమీక్షలో ఆర్బీఐ మోనిటరీ కమిటీ సభ్యులు నిర్ణయించారు. రెపో రేటును యథాతథంగా కొనసాగింపునకు అనుకూలంగా ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు అనుకూలంగా ఓటు వేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమివ్వడంతో పాటు ద్రవ్యోల్బణం నియంత్రణకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడించారు. 2024-25కు సంబంధించిన మధ్యంతర బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్బీఐ నిర్వహించిన తొలి సమావేశం కావడం గమనార్హం. కాగా మే 2022 నుంచి గతేడాది ఏప్రిల్ మధ్యకాలంలో రెపో రేటు ఏకంగా 250 బేసిస్ పాయింట్ల మేర పెరిగింది. అయితే ఆ తర్వాత రెపో రేటులో ఎలాంటి మార్పులేదు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసి ఆర్థిక వ్యవస్థ పురోగతికి బాటలు వేయడమే ఆర్బీఐ లక్ష్యమని శక్తికాంత దాస్ అన్నారు. ఆహార పదార్థాల ధరల కారణంగా ద్రవ్యోల్బణం పరిస్థితులు నెలకొంటున్నాయని, పంపిణీ వ్యవస్థపై ఈ ప్రభావం పడుతోందని ఆయన చెప్పారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో అస్థిరత ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది సాధారణ వర్షపాతం నమోదైతే ఆర్థిక సంవత్సరం 2024-25లో వినియోగదారుల ఆధారిత ద్రవ్యోల్బణం 4.5 శాతానికి తగ్గే అవకాశం ఉందని ఆర్బీఐ అంచనా వేసింది. ద్రవ్యోల్బణం పరిధి లక్ష్యానికి అనుగుణంగా వడ్డీ రేట్లను సర్దుబాటు చేయనున్నామని పేర్కొన్నారు.



# బ్లాక్ ఎందుకు ధరించాలి?..

## ఫ్యాషన్‌లో అశుభమన్న మాటకు తావులేదంటున్న డిజైనర్లు
## ధరించడంలో కాస్త మెలకువ పాటిస్తే మీరే ఫ్యాషన్ ఐకాన్ అంటూ సూచన

బ్లాక్ (నలుపు) అశుభానికి చిహ్నంగా భావించే వారెందరో.. ఫ్యాషన్ ప్రియులు మాత్రం ఎవర్‌గ్రీన్ కలర్స్‌లో ఒకటిగా దీనికి ప్రత్యేక స్థానమే ఇస్తుంటారు. ఈ కలర్ ఎలాంటి వారికైనా కొత్తందాలను అందిస్తుందన్నది డిజైనర్ల మాట. క్యాజువల్ మొదలు పార్టీ డ్రెస్సింగ్, వెడ్డింగ్స్‌లో అక్కడక్కడా ఈ నలుపందాలు కనిపిస్తుంటాయి.

**హైదరాబాద్:** అంతర్జాతీయ ధోరణుల కారణంగా ఫ్యాషన్‌లో తప్పనిసరి రంగుగా బ్లాక్ చేరింది. వేడుకలలో బ్లాక్‌కు అసలు స్థానం లేదన్నది సత్యం కానీ పలువురు సినీతారలు మొదలుకుని సోషలైట్స్ వరకూ వేడుకలు, సంప్రదాయ పండుగలలో ఆ రంగు వస్త్రాలను సౌకర్యవంతంగా ధరిస్తున్నారు. ఎందుకలా అని అంటే, బ్లాక్ డ్రెస్‌కు డిజైన్ పరంగా పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. పైగా కాంబినేషన్‌గా బ్లాక్ చాలా వరకూ కలర్స్‌తో సులువుగా కలిసిపోతుంది. బ్లాక్ డ్రెస్‌పై కొద్దిగా ఎంబ్రాయిడరీ వర్క్ చేసినా చాలు.. అందంగా కనిపిస్తుంది... పైగా పదిమందిలో సైతం ప్రత్యేకంగా కనిపించవచ్చు. ఈ కారణాలే బ్లాక్‌ను ఇప్పుడు అభిమాన కలర్‌గా మారుస్తున్నాయని డిజైనర్ హరీష్ అన్నారు.

### బ్లాక్ ఎందుకు ధరించాలంటే..

ఫ్యాషన్‌లో రంగులకు ఓ గుర్తింపు ఉంది. నమ్మకాల పరంగానూ వీటికి అధికప్రాధాన్యతే ఉంది. బ్రౌన్ కలర్ నమ్మకానికి ప్రతీకగా, ఎర్తీ కలర్‌గా చెబితే, వైట్‌ను శుభ్రతకు ప్రతీకగా చెబుతారు. కానీ బ్లాక్‌కు అలాంటి గుర్తింపేమీ లేదు. అయినప్పటికీ దీనికి ఫ్యాషన్‌లో ప్రత్యేకస్థానముంది. ఎందుకూ అంటే ఇది మీ మొహం మీద మాత్రమే ఎదుటి వారి చూపు పడేలా చేస్తుందంటున్నారు డిజైనర్లు. మరీముఖ్యంగా సినీతారలు, బిజినెస్ టైకూన్స్ ప్రత్యేక సందర్భాలలో బ్లాక్ ధరించడానికి కారణమిదే అని కూడా చెబుతున్నారు. ఇదే విషయమ్మై డిజైనర్ అర్షియా మాట్లాడుతూ బ్లాక్ ధరించడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. దాదాపుగా అన్ని రంగులతోనూ ఇది బాగుంటుంది. ఎలాంటి స్కిన్‌టోన్‌పై అయినా ఇది బాగుంటుంది. సీజన్‌లతో సంబంధం ఉండదు సరికదా ఎలాంటి యాక్సెసరీస్ ధరించినా అవి మరింతగా అందంగా కనబడతాయి.. అనిఅన్నారు.

### బ్లాక్ షర్ట్ ఎలా ధరించాలంటే..

బ్లాక్ షర్ట్‌ను ఎలా పడితే అలా ధరించొచ్చు అనుకుంటే పొరబడినట్లే అని అంటున్నారు హరీష్. కొద్దిపాటి మెలకువలు పాటించాల్సిందేనని ఆయన చెబుతూ పలు సూచనలు చేశారు. అవేమిటంటే..

- ప్రతిరోజూ ఉద్యోగానికి వెళ్తూ వైట్స్ లేదంటే పేస్టల్ కలర్స్.. వాటికి కాంబినేషన్స్ ఎంచుకోవడం కష్టమనుకుంటే సింపుల్‌గా బ్లాక్ షర్ట్ ధరించొచ్చు. కాకపోతే మనం చేసే ఉద్యోగం కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఐటీ రంగంలో ఇది పెద్ద ఇబ్బంది కాకపోవచ్చు. అలాగని బ్లాక్ షర్ట్, నేవీబ్లూ ట్రౌజర్స్ ధరిస్తే కౌబాయ్‌లా ఉంటారు.
- బ్లాక్ కాంబినేషన్‌గా థిక్ కలర్స్ ఉంటే బాగుంటుంది. అదీ ఫుల్ బ్లాక్ అయితే మీ సహచరులు మీపై అధిక శ్రద్ధ చూపేందుకు ఎక్కువ అవకాశముంటుంది. ఔట్‌ఫిట్ ఎప్పుడూ కూడా సింపుల్‌గా ఉండాలి.
- చాలామంది బ్లాక్ షర్ట్ ధరించి జీన్స్ ఫ్యాంట్ వేస్తారు. క్యాజువల్ డిజైన్‌గా బాగానేఉంటుంది కానీ అన్ని సందర్భాలలోనూ ఇది బాగోదు. అలాకాకుండా ఉండాలంటే స్కిన్నీ జీన్స్‌తో ధరిస్తే బెటర్. స్కిన్నీ జీన్స్‌మనకు పడదనుకుంటే స్లిమ్ ఫిట్టింగ్ చినోస్ అయినా బాగానే ఉంటాయి. ఇంకాస్త వెరైటీ చూపాలనుకుంటే రిప్డ్ జీన్స్ కూడా ధరించొచ్చు.
- ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యాజువల్ లుక్ చూపాలనుకుంటే, కాంట్రాస్టింగ్ కలర్‌లో టీషర్ట్ వేస్తే చాలు. రిలాక్సింగ్, క్యాజువల్ ఔట్‌లుక్ కావాలనుకుంటే బ్లాక్ హుడీనీ బ్లాక్ జీన్స్‌తో ధరించొచ్చు.
- బ్లాక్ షర్ట్‌ను గ్రే ప్యాంట్స్‌తో ధరిస్తే క్లాసిక్ లుక్ ఇవ్వొచ్చు. మొత్తం బ్లాక్ కూడా మంచి ఆలోచన కానీ అది సూట్స్‌తో అయితే ఎదుటి వారిని ఇంప్రెస్ చేయొచ్చు.
- ఒన్లీ బ్లాక్ కష్టం.... ఇంకాస్త వెరైటీ కావాలనుకుంటే, బ్లాక్ చెక్స్ షర్ట్ ధరించొచ్చు. ఈ తరహా షర్ట్స్ ధరించినపుడు బ్లాక్ స్కిన్నీ జీన్స్ ధరిస్తే క్యాజువల్ ఔట్ ఫిట్ ధరించిన అనుభూతి పొందొచ్చు.
- మన వాతావరణానికి పూర్తి అనువైన బ్లాక్ షర్ట్ అంటే షార్ట్ స్లీవ్ షర్ట్. కాకపోతే ఈవెనింగ్ వేర్‌గా మాత్రమే వీటిని ట్రై చేయాల్సి ఉంటుంది.
- బైకర్స్ కాస్త వెరైటీ ట్రై చేయాలనుకుంటే బ్లాక్ షర్ట్‌ను లెదర్ జాకెట్‌తో కలిపి ధరించొచ్చు. స్మార్ట్‌గా, కాంట్రాస్ట్‌గా ఇది ఉంటుంది. ఈ తరహా షర్ట్స్ వేసినప్పుడు ఫేడెడ్ బ్లాక్ జీన్స్, చంకీ బూట్స్ వాడాలి.
- కాలేజీ విద్యార్థులు బ్లాక్ షర్ట్స్ ధరించాలనుకుంటే పోలో షర్ట్స్ ధరించొచ్చు. అదే వర్కవుట్స్‌కు వెళ్లేవారు ఆలివ్ గ్రీన్ జాగర్ ప్యాంట్స్‌తో పాటుగా బ్లాక్ టీ షర్ట్ ధరించొచ్చు.



# శ్వేత సోయగాలు

తెలుపు రంగును ఫ్యాషన్ డిజైనర్లు తెగ ప్రేమించేస్తారు తెలుసా. ఈ ప్రేమకు సరైన పోలిక... చిత్రకారులు. అదెలాగంటే ఖాళీ కాన్వాస్ మీద రంగులద్దేందుకు చిత్రకారులు ఎంతగా తపించిపోతారో అంతగా ఫ్యాషన్ డిజైనర్లు తెలుపు రంగును ప్రేమిస్తారన్నమాట. తెలుపురంగు మిగతా ఏ రంగులతో జతకట్టినా అందంగా కనిపించడమే ఇందుకు కారణం. ముత్యంలా మెరిసిపోయే స్వచ్ఛమైన తెలుపు రంగుకు గులాబీ రంగు అద్దితే యువతుల చెక్కిళ్లు తలపుకొస్తాయి. ఎరుపు రంగు అద్దితే నుదిటిమీద కుంకుమ నాట్యమాడుతున్నట్టు ఉంటుంది. పసుపు రంగు అద్దితే ఇంటి వాకిలి గడప ఆనందాల స్వాగతాలు పలికినట్టే అనిపిస్తుంది. అదే ఆకుపచ్చ రంగుతో కలిస్తే ప్రకృతి ఒడిలో సేదతీరిన భావనే కలుగుతుంది. ఇలా తెలుపు రంగును ఏ రంగుతో జత చేర్చినా మనసుకు హాయైన భావనలు కలగడం ఖాయం. ఒక్క మాటలో చెప్పాలంటే మనసు పలికే తెలుపు భావనలు ఎంతో అపురూపం. ఈ మధ్య జరిగిన ఒక పరిశోధన కూడా కాస్త అటుఇటుగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది.

తెలుపు రంగు వస్త్రాలు ధరిస్తే నిరాశా పూరిత భావాలు తగ్గుతాయనేది ఆ పరిశోధనా సారాంశం. మనసుకు హాయి కలిగించే మంత్రదండం తెలుపు రంగును ఆప్యాయంగా కౌగిలించుకోవడమే ఆలస్యం.



# ఎరుపు మెరుపు

బోల్డ్ ఈజ్ బ్యూటిఫుల్! అది రంగులకూ వర్తిస్తుంది. కాబట్టే ముదురు రంగులు ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారాయి. మరీ ముఖ్యంగా ఎరుపు రంగు లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్! కాబట్టి రౌడీ రెడ్ స్టయిల్స్ ఫాలో అయిపోదాం!

### రెడ్ స్పెక్స్

కళ్లజోడు ఫ్రేములు ఇప్పుడు ఎన్నో రకాల్లో దొరుకుతున్నాయి. వీటిలో ఎరుపు రంగువి ఎంచుకుంటే అందర్లోకి ప్రత్యేకంగా కనిపిస్తాం! ఎరుపు రంగు ఎంత దూరం నుంచి అయినా కళ్లను ఆకర్షిస్తుంది కాబట్టి కళ్లజోడు మిస్ కాదు.

### లిప్‌స్టిక్

లేలేత పెదవులకు ఎర్రరంగు లిప్‌స్టిక్ మరింత అందాన్నిస్తుంది. అందులోనూ మాట్ టైప్ రెడ్ లిప్‌స్టిక్స్, నెయిల్ పాలిష్‌లు వేస్తే కిల్లింగ్ స్టయిల్!




### యాక్సెసరీస్

గొడుగు నల్లగానే ఎందుకుండాలి?

ఎరుపుది ఎంచుకుంటే అదొక ఆకర్షణ.

### రెడ్ షూస్

అట్టైర్‌లో ఆటిట్యూడ్ కనిపించాలంటే ఎరుపును జోడించాలి. కాంట్రాస్ట్‌గా రెడ్ కలర్ షూ, బ్యాగ్ మ్యాచ్ చేస్తే అదిరిపోతుంది.

### రెడ్ ఫ్రాక్

ఫ్రాకులు ఎరుపువైతే ఆ ఆకర్షణే వేరు. నలుగురిలో నదురుగా కనిపించాలనుకుంటే మోకాళ్ల వరకూ ఉండే రెడ్ ఫ్రాక్ ఎంచుకోవాలి. లాంగ్‌ఫ్రాక్‌ల స్టయిల్ కూడా బాగుంటుంది. అయితే వీటికి మ్యాచింగ్ నెయిల్ పాలిష్, ఐ షాడో తప్పనిసరి.





# సమ్మర్ స్టయిల్

**హ్యాట్స్**, గాగుల్స్ పెట్టుకుని సమ్మర్ ఫ్యాషన్‌కి షిఫ్ట్ అయిపోతారు చాలామంది అమ్మాయిలు. అంతవరకు ఓకే కాని సమ్మర్‌లో సింపుల్‌గా, స్టయిలిష్‌గా కనిపించాలంటే ఏం చేయాలి... అదింకా సింపుల్. ఈ ఫోటోల్లో కనిపిస్తున్న అమ్మాయికి మల్లే రెడీ అయిపోవాలి. క్యాప్రిలు, ట్రౌజర్స్... ఏవి వేసుకున్నా వాటిపై టీషర్ట్ వేసుకోవాలి. జుట్టు మెడ మీద పడి చిరాకు పెట్టకుండా తలకి ఒక పక్కగా హెయిర్ బ్యాండ్ పెట్టేయాలి. ఒకవేళ ఈ హెయిర్‌స్టయిల్ నచ్చకపోతే జుట్టు ముఖం మీదకి పడకుండా హ్యాట్‌తో మేనేజ్ చేసేయొచ్చు. ఈ డ్రస్సింగ్‌తో హాట్‌హాట్ సమ్మర్‌లో మరింత హాట్‌గా కనిపించడం ఖాయం.

# వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ...

వన్గ్రామ్ గోల్డ్ జువెలరీ... ఒకప్పుడు దిగువ మధ్యతరగతి ప్రజలకు మాత్రమే పరిమితమైన ఈ ఆభరణాలు ఇప్పుడు సంపన్న వర్గాల మహిళలను కూడా ఆకర్షిస్తున్నాయి. పార్టీలు, వేడుకల్లో అతివలు వీటినే వినియోగిస్తున్నారిప్పుడు. బంగారం ధరలు రోజూ రికార్డులను తాకుతున్నాయి. దీపావళి నాటికి 30 వేల రూపాయల మార్క్‌కు 10 గ్రాముల బంగారం చేరిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న ధరలు ఒకవైపు ఆందోళన కలిగిస్తుంటే.. మరోవైపు చైన్ స్నాచర్‌లు, దొంగల భయం. బయటకు వెళ్లిన వారు మంగళ సూత్రాలతో సహా అయినా సురక్షితంగా ఇంటికి వస్తారన్న గ్యారంటీ లేదు.

ప్రతి రోజూ చైన్ స్నాచర్ల విజృంభణ చూస్తూనే ఉన్నాం. ఈ భయాలకు చెక్ పెడుతూనే అతివలకు కావాల్సిన డిజైన్స్‌లో లభిస్తూ స్టైలిష్‌గా మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయి వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు.యాంటిక్ నుండి స్లిమ్ ఫిట్ జువెలరీ వరకూ వేలాది మోడల్స్ వస్తున్నాయి. ఇక సినిమా, టీవీ సీరియల్స్‌లో ఓ ఆభరణం కనిపించింది అని అంటే.. మరుసటి రోజుకు ఆ ఆభరణం ప్రత్యక్షమవటం కూడా నగరంలో కనిపిస్తోన్న నయా ట్రెండ్.

### బంగారానికి ప్రత్యామ్నాయం...

సప్లయ్ తక్కువ కావడం.. డిమాండ్ పెరగడం.. ప్రభుత్వాలు విధించే పన్నులు.. వెరసి పసిడి ధరలు ఆకాశంలో పయణించడం మొదలుపెట్టాయి. మరి ప్రత్యామ్నాయం ఏమిటి..? ఆ ఆలోచనలో నుండి పుట్టుకు వచ్చిందే వన్ గ్రామ్ గోల్డ్. మెడలో వీసమెత్తు బంగారం లేకుండానా అనే వారు కూడా ఇప్పుడు ఈ వన్గ్రామ్ జువెలరీ మెరుపుల పట్ల ఆకర్షితులవుతున్నారు. దీనికి తోడు ఫ్యాషన్ల పట్ల మోజు ఎలాగూ ఉంది. తమ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే రీతిలో ఆభరణాలు ఉండాలని కోరుకుంటోన్న మహిళలు పెరిగారు. ఇటీవలి కాలంలో అతి ఎక్కువగా కనిపిస్తోన్న ట్రెండ్ నల్లపూసలు (బ్లాక్ బీడ్స్) ను కూడా వన్గ్రామ్ గోల్డ్‌తో చేసినవే వాడుతుండటం. దాదాపు 100కు పైగా డిజైన్స్ ఈ నల్లపూసల్లో లభిస్తున్నాయిప్పుడు. ఆఫీస్‌వేర్ కలెక్షన్‌గా ఎక్కువమంది అతివలు ఇష్టపడుతున్న పెండెంట్, ఇయర్ రింగ్స్, చైన్‌లు కూడా ఎన్నో వెరైటీల్లో లభిస్తున్నాయి. వన్గ్రామ్ గోల్డ్‌కు ఇటీవలి కాలంలో విపరీతమైన ఆదరణ లభిస్తోందంటున్నారు చిరాగ్ అలీ లేన్‌లోని సాయి పెరల్స్ అండ్ గిఫ్ట్స్ అధినేత రమేష్‌కుమార్.



సరిగ్గా చెప్పాలంటే పది పన్నెండేళ్ల నుంచీ వీటిని ఆదరిస్తున్నారు కానీ ఇటీవలికాలంలో డిమాండ్ పెరిగింది. కేవలం 100 రూపాయల నుంచే వీటి ధరలు ఉండటం.. గరిష్టంగా 25 వేల రూపాయలకు తల నుంచి పాదాల వరకూ కావాల్సిన జ్యుయెలరీ మొత్తం వైవిధ్యమైన డిజైన్లలో లభించటం.. వీటికి తోడు కనీసం ఆరు నెలల వారెంటీ... ఇవన్నీ ఇటు వైపు మహిళలు దృష్టి సారించేలా చేసున్నాయంటున్నారు. అందుకే ఒకప్పుడు చిరాగ్ అలీ లేన్ లాంటి ప్రాంతాల్లో మాత్రమే కనిపించే ఈ ఆభరణాలు ఇప్పుడు ఫ్యాన్సీ షాపుల్లో కూడా కనిపిస్తున్నాయి. అయితే వన్గ్రామ్ గోల్డ్ ఆభరణాలను మాత్రమే అమ్మే షాప్‌లు హైదరాబాద్, సికిందరాబాద్‌లలోనే దాదాపు 500 వరకూ ఉన్నాయి. ఆబిడ్స్‌లోని చిరాగ్ అలీలేన్‌లోనే కనీసం 30 వరకూ ఈ తరహా ఆభరణాల షాపులు దర్శనమిస్తుండటం విశేషం.

### జాగ్రత్తలు తప్పనిసరి..

సాధారణంగా ఈ జువెలరీ ఓ సంవత్సరం పాటు అందాలను చిందిస్తాయి కానీ.. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే 10 సంవత్సరాలు కూడా పాడవకుండా ఉంటాయి. అలా ఎక్కువ కాలం మన్నాలంటే ఇలా చేయాల్సిందే అంటూ కొన్ని సూచనలు చేస్తున్నారు..

1 పాలిథిన్ కవర్ లేదా ప్లాస్టిక్ బాక్స్‌లలోనే వీటిని భద్రపరచాలి

2 ఆభరణాలను ధరించిన తరువాత ఫెర్‌ఫ్యూమ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్ప్రే చేయకూడదు.


3 స్నానం చేసేటప్పుడు ఈ ఆభరణాలను ధరించకూడదు. సబ్బు నీళ్లు తగిలితే త్వరగా పాడయ్యే అవకాశం ఉందట.


4 అతి ఎక్కువ వేడి ఉన్న ప్రాంతాల్లో ఈ జువెలరీ వాడకపోవడం మంచిది. ఎక్కువ వేడి శరీరం తత్త్వం కలిగిన వాళ్లు ఈ తరహా జువెలరీ జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం.

# మరో కీలక ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో..

## ఫిబ్రవరి 17న శ్రీహరికోట నుంచి ప్రయోగం


- జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ద్వారా ఇన్సాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధం
- మెరుగైన వాతావరణ అంచనాల లక్ష్యంగా ప్రయోగం
- ప్రయోగానికి నిధులు సమకూర్చిన మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్





**శ్రీహరికోట, వెలుతురు:**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. మరింత మెరుగైన వాతావరణ అంచనాల కోసం జీఎస్ఎల్వీ-ఎఫ్14/ఇన్సాట్-డీఎస్ మిషన్ (GSLV-F14/INSAT-3DS) ప్రయోగాన్ని చేపట్టనుంది. ఫిబ్రవరి 17, 2024న సాయంత్రం 5:30 గంటలకు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ను ప్రయోగించనుంది. ఇన్సాట్-3డీఎస్ వాతావరణ ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ప్రయోగానికి సంబంధించిన వివరాలను 'ఎక్స్' వేదికగా ఇస్రో షేర్ చేసింది. జీఎస్ఎల్వీ మూడు దశల లాంచ్ వెహికల్ అని, ఇది 51.7 మీటర్ల పొడవు, 420 టన్నుల బరువు ఉంటుందని ఇస్రో వెల్లడించింది. వాతావరణ పరిశీలన కోసం ఇస్రో ఈ 'ఇన్సాట్-3డీఎస్' ఉపగ్రహాన్ని రూపొందించింది. మెరుగైన రీతిలో వాతావరణ పరిశీలనలు, వాతావరణ అంచనాలతో పాటు భూమి, సముద్ర ఉపరితలాలను పర్యవేక్షణకు ఉపయోగడపడనుంది. వాతావరణ విపత్తులను



మరింత మెరుగ్గా అంచనా వేసి అప్రమత్తమవ్వడం కూడా ఒక ప్రధాన లక్ష్యంగా ఉంది. కాగా మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఈ ప్రయోగానికి అవసరమైన నిధులను సమకూర్చింది. భారత వాతావరణ విభాగం (IMD), ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్ (నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్), విభాగాలు వాతావరణ అంచనాల కోసం ఇన్సాట్-3డీఎస్ డేటాను ఉపయోగించుకోనున్నాయి.



# ఏపీ ఆర్థిక గణాంకాలపై కాగ్ నివేదిక..




**అమరావతి, వెలుతురు:**

2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీ ఆర్థిక గణాంకాలపై కాగ్ నివేదిక ఇచ్చింది. రాబడులు- వ్యయాలకు సంబంధించిన అంశాలపై ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నివేదిక ఇచ్చింది.

**కాగ్ నివేదిక..**

పథకాల అమలు కోసం కేంద్రం బదలాయించిన రూ 15,771 కోట్ల రూపాయలు వార్షిక ఖాతాల్లో ప్రతిఫలించ లేదు.
2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.48,728 కోట్ల రుణాలు తీసుకోవాలని అంచనా వేస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.52,508 కోట్ల రుణం తీసుకుంది.
అసెంబ్లీ ఆమోదించిన మొత్తం కంటే అదనంగా రూ. 4,027 కోట్లను ఖర్చు చేసేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 341 రోజుల పాటు వేస్అండ్ మీన్స్ అడ్వాన్సులను ఏపీ వినియోగించుకుంది. రిజర్వు బ్యాంకు ఖాతాలో రూ.1.94 కోట్ల కంటే తక్కువ నిల్వల కారణంగా ఏడాదిలో 1,18,039 కోట్లను వేస్ అండ్ మీన్స్ గా వాడుకుంది.
ఇదే ఆర్థిక సంవత్సరంలో 152 రోజుల పాటు ఏపీ ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయాన్ని వాడుకుంది.
మొత్తం రూ. 57,066 కోట్ల మేర ఓవర్ డ్రాఫ్ట్ ఏపీ వాడుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 73 మార్లు బహిరంగ మార్కెట్ ద్వారా రూ. 57,478 కోట్ల మేర ఏపీ అప్పు తెచ్చింది.
కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ ఏడాదిలో రూ. 8,411 కోట్ల మేర ఏపీ అప్పు తెచ్చింది.
మూలధన వ్యయం కేవలం రూ.7244 కోట్లకు మాత్రమే పరిమితం.
రాష్ట్రస్థూల ఉత్పత్తిలో మూలధన వ్యయం కేవలం 0.55 శాతం మాత్రమే.
వివిధ కార్పోరేషన్లు రుణం తీసుకునేందుకు ప్రభుత్వ హామీలు రూ.1,38,875 కోట్లు.

# జగనన్న ఎవరికి పులి, ఎవరికి సింహం?: షర్మిల

**దెందులూరులో షర్మిల సభ**

**జగనన్న సీఎంగా ఉండి ఏం సాధించారన్న షర్మిల**

**ఢిల్లీ నేతలకు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారని ఎద్దేవా**

**చంద్రబాబు, జగన్ బీజేపీ నేతలకు తొత్తులుగా మారారని విమర్శలు**



**దెందులూరు, వెలుతురు:**

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె వాడీవేడిగా ప్రసంగించారు. జగనన్న సీఎంగా ఉండి ఏం సాధించారని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీ నేతలకు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే జగనన్న బీజేపీని నిలదీయాలని అన్నారు. "జగనన్న పులి అని, జగనన్న సింహం అని ఆయనను అభిమానులు ఆకాశానికెత్తేస్తున్నారు. జగనన్న ఎవరికి పులి? జగనన్న ఎవరికి సింహం? జగనన్న సాక్షి పేపర్ వరకే పులా? సోషల్ మీడియా వరకే సింహమా? ఒకసారి ఆ పంజాను బీజేపీపై విసరాలి... దమ్ముంటే బీజేపీపై గాండ్రించాలి. మీరా పులులు, సింహాలు? ఆంధ్ర రాష్టం పాలిట ద్రోహులు మీరు. ప్రశ్నిస్తే... ఓ ఆడబిడ్డ అని కూడా చూడకుండా వ్యక్తిగతంగా దూషిస్తూ, బూతులు మాట్లాడుతున్నారు. సొంత ఆడబిడ్డ అని చూడకుండా బజారుకు లాగుతున్నారు. వైసీపీకి చేతనైంది ఇదేనా?" అంటూ షర్మిల నిప్పులు చెరిగారు.

**బీజేపీతో జగన్, చంద్రబాబు ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుపుతున్నారు!**

ఎన్నికలు వస్తుండడంతో బీజేపీతో జగనన్న, చంద్రబాబు ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడిపిస్తున్నారని షర్మిల ఎద్దేవా చేశారు. పోటీ పడి మరీ బీజేపీతో పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు బీజేపీ వాళ్లను ఒక్క మాట కూడా అనడంలేదని... వాళ్లు పిలవడం, ఈయన పోవడం ఏమిటో అంటూ వ్యంగ్యం ప్రదర్శించారు. పిలిస్తే వెళ్లాడు సరే... రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తేనే పొత్తు అని ఎందుకు షరతు పెట్టడంలేదని షర్మిల ప్రశ్నించారు. చంద్రబాబు తీరు చూస్తుంటే బీజేపీ కార్యకర్తలా ఉందని విమర్శించారు. "చంద్రబాబు గతంలో 15 ఏళ్లు ప్రత్యేక హోదా కావాలన్నారు. జగనన్న 25 ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా ఎందుకు రాదన్నారు. కానీ చంద్రబాబు, జగన్ బీజేపీకి తొత్తులుగా మారారు. జగనన్న గెలిచిన తర్వాత హోదా కోసం ఒక్క ఉద్యమం కూడా చేయలేదు" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**ఢిల్లీలో జగనన్న పరిస్థితి కూడా ఇంతే!**

చంద్రబాబు బీజేపీని ఆకట్టుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నాడని, జగనన్న కూడా ఢిల్లీకి వెళుతున్నాడని షర్మిల పేర్కొన్నారు. ఢిల్లీలో జగనన్న పరిస్థితి కూడా అంతేనని, వంగి వంగి దండాలు పెట్టడంతోనే సరిపెట్టుకుంటారని వ్యాఖ్యానించారు. ఏపీలో 25 మంది ఎంపీలు ఉండి కూడా బీజేపీకి గులాంగిరీ చేయాల్సిన అవసరం ఏంటని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.



# రేపటి నుంచి గుణదల మేరీ మాత ఉత్సవాలు

**ఎన్టీఆర్‌జిల్లా, వెలుతురు:**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుణదల మేరీ మాత ఉత్సవాలు రేపటి (శుక్రవారం) నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను వికర్ జనరల్ మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్ ఆవిష్కరించారు. గుణదల ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్ర గురువులు ఇప్పటికే సకల ఏర్పాట్లు పూర్తి చేశారు.


# పెరుగుతున్న భూతాపం

**లక్ష ఏళ్లలో ఇదే ప్రథమం...**

**అత్యధిక ఉష్ణోగ్రతల ఏడాదిగా 2023**

**1.52 డిగ్రీల మేర పెరిగిన భూ ఉష్ణోగ్రత**

**2024లోనూ వాతావరణ వైపరీత్యాలు కొనసాగుతాయన్న శాస్త్రవేత్తలు**



**న్యూఢిల్లీ, వెలుతురు:**

భూతాపం అంతకంతకు అధికమవుతోందని, రానున్న కాలంలో వాతావరణ మార్పుల పర్యవసానాలు అత్యంత తీవ్రంగా ఉండనున్నాయని శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నారు. తాజాగా, యూరప్ కు చెందిన కోపర్నికస్ వాతావరణ మార్పుల పరిశీలన సంస్థ ఆసక్తికర నివేదిక వెలువరించింది. గత లక్ష ఏళ్లలో లేనంతగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ఏడాది బహుశా 2023 అయ్యుంటుందని తెలిపింది. మానవాళికి ఇదొక హెచ్చరిక అని శాస్త్రవేత్తలు పేర్కొనడంలో ఆశ్చర్యమేమీ లేదని అభిప్రాయపడింది. ఎల్ నినో ఉత్పాతం ఫలితంగా ఓవైపు తుపానులు, మరోవైపు కరవు, కార్చిచ్చులు భూమండలాన్ని అతలాకుతలం చేస్తున్నాయని... 2023లో అత్యధిక ఉష్ణోగ్రతలకు కారణం వాతావరణ మార్పులేనని కోపర్నికస్ సంస్థ పేర్కొంది. 2024లోనూ ఈ విపరీత పరిణామాలు కొనసాగుతాయని వెల్లడించింది. 19వ శతాబ్దంలో నమోదైన భూమి సగటు ఉష్ణోగ్రతతో పోల్చితే... 2023 ఫిబ్రవరి నుంచి 2024 జనవరి వరకు నమోదైన భూమండలం సగటు ఉష్ణోగ్రతల్లో 1.52 డిగ్రీల సెల్సియస్ పైగా పెరుగుదల నమోదైనట్టు వివరించింది. సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్ ను తాకితే ఏమవుతుందో పారిస్ క్లైమేట్ చేంజ్ ఒప్పందంలో స్పష్టంగా పేర్కొన్నారని, ఇప్పుడది అనుభవంలోకి వస్తోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల ప్రభావం సామాజికంగానూ, ఆర్థికంగానూ మూల్యం చెల్లించేలా ఉందని స్పష్టం చేశారు.

# అయోధ్యలో కేఎఫ్‌సీ..


## ఆ ఒక్కటి తప్ప అన్నీ అమ్ముకోవచ్చట!

**కేఎఫ్‌సీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్న అయోధ్య కలెక్టర్**

**మాంసాహార పదార్థాల విక్రయానికి మాత్రం నో**

**శాకాహార పదార్థాలు అమ్ముకోవచ్చన్న కలెక్టర్**

**ఆలయానికి 15 కిలోమీటర్ల పరిధిలో నిషేధం**




**మహారాష్ట్ర, వెలుతురు:**

కేఎఫ్‌సీ.. ఈ పేరెత్తితేనే చాలు నాన్‌వెజ్ ప్రియుల నోటిలో నీళ్లూరుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతిచోట అవుట్‌లెట్లు కలిగిన కేఎఫ్‌సీ త్వరలో అయోధ్యలోనూ దుకాణాలు తెరవబోతున్నట్టు వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం స్పందించింది. అయోధ్యలో మాంసాహార విక్రయాలపై నిషేధం ఉందని స్పష్టం చేసింది. కావాలంటే వారు శాకాహార పదార్థాలు అమ్ముకోవచ్చని తెలిపింది. అయోధ్యలో ఔట్‌లెట్ తెరవడాన్ని ఆహ్వానిస్తున్నామని అయితే, నిషేధిత ప్రాంతంలో శాకాహార పదార్థాలు మాత్రమే విక్రయించాల్సి ఉంటుందని అయోధ్య జిల్లా కలెక్టర్ నితీశ్ కుమార్ తెలిపారు. మాంసం, చేపలు, ఇతర మాంసాహార పదార్థాల విక్రయం, వినియోగాన్ని రామాలయ ప్రాణప్రతిష్ఠకు ముందే యోగి ప్రభుత్వం నిషేధించిందని గుర్తు చేశారు. అయితే, అయోధ్యకు 15 కిలోమీటర్ల పరిధి తర్వాత ఈ నిబంధనలేవీ వర్తించవని స్పష్టం చేశారు. అయోధ్య రామమందిరం ప్రారంభం తర్వాత రాముని దర్శనార్థం వచ్చే భక్తులతో అయోధ్య కిక్కిరిసిపోతోంది. భక్తుల రద్దీ పెరగడంతో వారి అవసరాలు తీర్చేందుకు పలువురు వ్యాపారులు దుకాణాలు తెరుస్తున్నారు. ఆలయ సమీపంలో హోటళ్లు, రెస్టారెంట్లు వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేఎఫ్‌సీ కూడా ఔట్‌లెట్ తెరబోతోందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం స్పందించి ఈ ప్రకటన చేసింది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com